


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


సంపుటి 07, సంచిక: 183 | మంగళవారం | 04-06-2024 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00


## పూర్తిగా విరుద్ధంగా...



**న్యూఢిల్లీ:** ఎగ్జిట్ పోల్స్‌లో చూపిన దాని కంటే లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పూర్తి విరుద్ధంగా ఉంటాయని తమ పార్టీ ఆశిస్తుందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అన్నారు. ఢిల్లీలోని డిఎంకె కార్యాలయంలో ఆ పార్టీ కీలక నేత ఎం. కరుణానిధి శత జయంతి కార్యక్రమానికి సోమవారం నాడు ఆమె హాజరై నివాళులర్పించారు.

## నేడే ఓట్ల లెక్కింపు





# ఉత్కంఠకు తెర

**న్యూఢిల్లీ :** అధికార–ప్రతిపక్ష శిబిరాల్లో ఆశలు మోసులెత్తి ఎవరి అంచనాల్లో వారు ఉన్న తరుణంలో దేశ భవిష్యత్ తలరాత మార్చే 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు తెరలేచింది. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ దేశవ్యాప్తంగా ప్రారంభమవుతున్నది. 80 రోజుల పాటు సుదీర్ఘంగా కొనసాగిన ఏడు విడతల ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల ప్రచారం అనంతరం, ఇంతకుముందు రెండుసార్లు ఎన్నికల ఫలితాలు వచ్చినవిధంగానే మూడోసారి కూడా అదేస్థాయిలో ఫలితాలు వెలువడతాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంచనా వేస్తుండగా ప్రతిపక్ష ‘ఇండియా’ కూటమి మాత్రం కౌంటింగ్ ప్రక్రియలో ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నమైన పద్ధతుల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలు వెలువడతాయని విశ్వాసంతో ఉంది. చాలామంది నిపుణులు బిజెపి నాయకత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డిఎ)కు అనుకూలంగా ఎన్నికల ఫలితాలు ఉంటాయని ఎగ్జిట్ పోల్స్‌లో చెప్పగా అదంతా మోడీ సృష్టించిన ఫలితాలేన్న వాస్తవావిష్కరణ జరుగుతుందని ప్రతిపక్షం స్పష్టం చేసింది. కొత్త ప్రాంతాలకు విస్తరిస్తే తప్ప ఎన్ డి ఎ కూటమి గెలిచే అవకాశాలు లేవు. కానీ ఎన్నికల ప్రచారపర్వంలో ప్రతిపక్ష ఆధిపత్యం కనిపించింది. ప్రాంతీయ భావజాలం పోటెత్తింది. మోడీ కోరుకున్నట్లుగా 400 సీట్ల లక్ష్యానికి మోదీ ఎన్‌డిఎ దగ్గరగా ఉందని, ‘ఇండియా’ కూటమి 180 సీట్లను దాటుతుందని ఎగ్జిట్‌పోల్స్ ఏకగ్రీవంగా ఒకేవిధమైన జోస్యాలు చెప్పినప్పటికీ కొద్ది గంటల్లో వెలువడే చరిత్రాత్మక తీర్పు వాస్తవాన్ని ఆవిష్కరించనున్నది. రాజకీపార్టీలు మల్లగుల్లాలు పడి ఎన్నికల తీర్పులను చారిత్రకంగా సమ్మతించినప్పటికీ ఎన్నికల కమిషన్ సహా పోలింగ్‌ప్రక్రియలో ఈసారి ప్రతిపక్షాలు లేవనెత్తే కొన్ని ప్రశ్నలు మాత్రం చాలా పదునుగా ఉంటాయి. ఎన్నికల ప్రచారం తర్వాత కూడా ఎగ్జిట్ పోల్స్ పుణ్యమా అని అధికార–ప్రతిపక్ష శిబిరాలు రెండింటిమధ్యా కూడా ఇంకా వాడీ వేడీ విమర్శలు కొనసాగుతున్నాయి. ఎగ్జిట్‌పోల్స్‌ను తరువాయి 2లో



## ప్రపంచ రికార్డు సృష్టించాం

**లోక్‌సభ ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటేశారు...**

**ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్**

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటర్లు, అందులో 31.2 కోట్ల మహిళా ఓటర్ల ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా భారతదేశం ప్రపంచ రికార్డు సృష్టించిందని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో ఎన్నికల కమిషనర్‌లు గ్యానేశ్ కుమార్, ఎస్.ఎస్.సంధులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని అతి పెద్ద ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల ప్రక్రియలో 68 వేల మానిటరింగ్ బృందాలు, 1.5 కోట్ల మంది పోలింగ్, భద్రతా సిబ్బంది భాగస్వాములయ్యారని చెప్పారు. సోషల్ మీడియాలో ఎన్నికల కమిషనర్‌లను లాపతా జెంటిల్మెన్ అని మీమ్‌లు రావడంపై స్పందిస్తూ తరువాయి 2లో

# ప్రజా తీర్పు నేడే

- రాష్ట్రంలో ఓట్ల లెక్కింపునకు ఇసి ఏర్పాట్లు
- 17 ఎంపి, కంటోన్మెంట్ ఉప ఎన్నిక కౌంటింగ్
- నాలుగైదు గంటల్లోనే ఫలితాలు వెల్లడి!

ప్రజాపక్షం/హైదరాబాద్



లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలు కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్స్, ఆ తర్వాత ఇవిఎం బ్యాలెట్లను లెక్కించనున్నారు. మొత్తం 17 లోక్‌సభ స్థానాలలో ఓట్లను లెక్కించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 34 ప్రాంతాల్లో 120 హాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం 1855 సిద్ధం చేశారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు మే 13న జరిగిన ఎన్నికల్లో 66.3శాతం పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే. మొత్తం పోలైన 2.20,24,806 ఓట్లలో 2,18,000 పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయి. అలాగే సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ తరువాయి 2లో

## అప్రమత్తంగా ఉండాలి:సిఎం



లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కిం పు సమయంలో అభ్యర్థులు, పార్టీ నాయకులు, ఎజెంట్లు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దిశా నిర్ధేశం చేశారు. పోటా పోటీగా ఉన్న నియోజకవర్గాల ఓట్ల లెక్కింపులో నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు పూర్తయిన అనంతరమే ఈవిఎం కౌంటింగ్ జరుగుతుందని, ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. మంగళవారం జరగనున్న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాటించాల్సిన జాగ్రత్తలపై టిపిసిసి అధ్యక్షుడు, సిఎం ఎ.రేవంత్‌రెడ్డి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంఎల్‌ఎలు, పార్టీ ఎంపి అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియపై నాయకులు చర్చించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఏజెంట్లు అధికారులతో వ్యవహరించాల్సిన తీరు, కౌంటింగ్ ఏజెంట్ల అప్రమత్తతపై నాయకులు దిశా నిర్దేశం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం తరువాయి 2లో

## కేంద్రాలవద్ద భారీ భద్రత



ఉత్కంఠగా ఎదురుచూస్తున్న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు రాష్ట్రంలోని అన్ని కౌంటింగ్ సెంటర్ల వద్ద పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. భద్రత ఏర్పాట్లపై డిజిపి రవిగుప్తా సోమవారం అన్ని జిల్లాల ఎస్‌పిలు, కమిషనరేట్ల కమిషర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కౌంటింగ్ సెంబర్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై వారితో సమీక్షించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మరింత అప్రమత్తంగా ఉండాలని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నడు లేనివిధంగా కౌంటింగ్ సెంబర్ల వద్ద ఈ సారి నాలుగు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ హాల్ నుంచి మొదలయ్యే మొదటి అంచె బందోబస్తులో కేంద్ర పారామిలటరీ బలగాలు, రెండు, మూడు అంచెల్లో ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలు, నాలుగో అంచలో సివిల్ పోలీలు బందోబస్తులో పాల్గొంటున్నారు. కౌంటింగ్ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తును కలెక్టర్లతో కలిసి ఆయా జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లు స్వయంగా పర్యవేక్షించి సూచనలు, సలహాలు చేశారు. భద్రతా ఏర్పాట్లపై వారు తరువాయి 2లో

## రాష్ట్రానికి నైరుతి రుతుపవనాలు

- వారం రోజుల ముందుగానే ప్రవేశం
- మూడు రోజులు భారీ వర్షాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు ముందుగానే తెలంగాణను తాకాయి. జోగులాంబ గద్వాలజిల్లా, నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాలో రుతుపవనాలు ప్రవేశించినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల పాటు దక్షిణ జిల్లాలో వర్షాలు కురిసే అవకాశముందన్నారు. సాధారణంగా జూన్ తరువాయి 2లో

## ఎంఎల్‌సి కవిత రిమాండ్ పొడిగింపు

- జులై 3వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీలోనే



**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితకు బిగ్ షాక్ తగిలింది. ఏకంగా నెల రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగించింది. ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత రిమాండ్ సోమవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆమెను కోర్టు ముందు హాజరుపరచగా, రౌస్ అవెన్యూ కోర్టు ఇడి కేసులో కవితకు జులై 3 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగిస్తూ తీర్పునిచ్చింది. ఢిల్లీ మద్యం విధానంలో కవిత పాత్రపై ఇడి తరువాయి 2లో

## కుంభవృష్టి...

**బెంగళూరులో 133 ఏళ్ల రికార్డు బద్దలు**



**బెంగళూరు:** రుతుపవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఎపిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. ఇక కర్ణాటక రాజధాని బెంగళూరు సిటీలో ఒక్కరోజులోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. 133 ఏళ్లలో ఎన్నడూ లేనంత వర్షపాతం ఒక్కరోజులోనే తరువాయి 8లో

# అమరుల కుటుంబాలను, ఉద్యమకారులను ఆదుకుంటాం

- తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ఏర్పడిన ప్రభుత్వమిది
- ఉద్యమకారుల సన్మానసభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క



ప్రజపక్షం/హన్మకొండ ప్రతినిధి

తెలంగాణ ఉద్యమకారులను, అమరుల కుటుంబాలను ఆదుకుంటామని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క తెలిపారు. హన్మకొండ హంటర్‌రోడ్‌లోని డికన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమకారుల సన్మానసభ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క మాట్లాడుతూ అనేక పోరాటాలు, వందల మంది విద్యార్థి, యువకుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నేడు ఉద్యమకారుల ఆకాంక్షల మేరకే పని చేస్తుందన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ ఎంపిలు అనేక ఇబ్బందులను ఎదుర్కొని కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీని ఒప్పించి రాష్ట్రాన్ని సాధించారని, కానీ ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో తరువాయి 2లో

## ట్యాంక్‌లో శవం

- పది రోజులుగా అవే నీళ్లు తాగుతున్న జనం
- మొన్న నందికొండలో వానరాలు.. నేడు నల్లగొండలో మనిషి..

ప్రజాపక్షం/ నల్లగొండ ప్రతినిధి



నల్లగొండ జిల్లా కేంద్రంలోని పాతబస్తీ హిందూపూర్‌లోని తాగునీటి ట్యాంక్‌లో శవం లభ్యమైంది. గత పది రోజులుగా ఆ వాటర్ ట్యాంక్‌లోని నీటినే తాగుతున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 12వ వార్డు పాతబస్తీ హిందూపూర్ వాటర్‌లో ట్యాంక్‌లో హనుమాన్ నగర్ పాతబస్తీకి చెందిన ఆవుల వంశీకృష్ణ (27) శవాన్ని సోమవారం గుర్తించారు. గత కొద్ది రోజులుగా తాగునీటిలో తరువాయి 8లో

## బీహార్‌లో ‘ఇండియా’కు 25కు పైగా ఖాయం



**పాట్నా :** బీహార్‌లో ఇండియా కూటమి కనీసం 25కు పైగా లోక్‌సభ స్థానాలలో విజయం సాధిస్తుందని ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా అన్నారు. ఎగ్జిట్ పోల్స్ అనేవి మానసిక పన్నాగమని, బీహార్ ప్రజలు అందులో చిక్కుకోబోరని చెప్పారు. పాట్నాలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్స్ అన్ని ప్రధాన మంత్రి కార్యాలయంలోనే తయారు చేశారని ఆరోపించారు. కొన్ని ఛానల్స్‌లో ఎగ్జిట్ పోల్స్ అంకెలను నిన్నటికీ, ఈరోజుకు తెలిపారు. కౌంటింగ్ పూర్తవగానే ఆ అంకెలు మొత్తం మారిపోతాయన్నారు.

## ఎసిబికి పట్టుబడిన సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్

**రూ. 99,200 నగదు స్వాధీనం**

**సబ్ రిజిస్ట్రార్ బాణోతు సురేందర్ నాయక్‌తో పాటు డాక్యుమెంట్ రైటర్లపై కేసు నమోదు**




ప్రజాపక్షం/ సూర్యాపేట ప్రతినిధి

అవినీతి, అక్రమాలకు అడ్డగా మారిన సూర్యాపేట జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాయంలో సోమవారం ఎసిబి అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో డాక్యుమెంటర్ రైటర్లను అడ్డం పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ బాణోతు సురేందర్ నాయక్ బేరసారాలు ఆడుతున్నట్లు గుర్తించారు. వారి నుండి రూ. 99,200 స్వాధీనం చేసుకుని సబ్ రిజిస్ట్రార్‌తో పాటు మధ్యవర్తులైన డాక్యుమెంటర్ తరువాయి 2లో

# సాగుకు రైతు సన్నద్ధం

- ఖరీఫ్ సీజన్‌లో 151.93 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- రాష్ట్రంలోకి రుతు పవనాల ఆగమనం
- అవసరమైన వివిధ రకాల విత్తనాలను అందుబాటులోకి తెస్తున్న వ్యవసాయ శాఖ యంత్రాంగం



ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది వారం రోజుల ముందుగానే నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడం, తొలకరి పలకరింపులు కూడా ప్రారంభం కావడంతో దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు. గత ఏడాది వర్షభావ పరిస్థితులు నెలకొనడంతో సకాలంలో వర్షాలు రాక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడగా, ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురునున్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించినట్లుగానే ముందుగానే నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకడంతో రాష్ట్ర రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జిల్లాల వారీగా వ్యవసాయ అధికారులు సైతం అప్రమత్తం అవుతున్నారు. ఇప్పటికే పత్తి విత్తనాలు, పచ్చరొట్ట విత్తనాలను జిల్లాల వారీగా రైతులకు అందుబాటులో ఉంచిన అధికారులు వివిధ పంటలకు సంబంధించిన అవసరమైన విత్తనాలు, ఎరువుల సేకరణలో నిమగ్నమయ్యారు.

**ఖరీఫ్ సీజన్‌లో 151.93 లక్షల ఎకరాల్లో సాగు**

గత ఏడాదితో పొల్చితే ఈ ఏడాది మరింత సాగు విస్తీర్ణం పెరగనుంది. గత ఏడాది140.74 లక్షల ఎకరాలు సాగు చేయగా, ఈ సంవత్సరం 151.93 లక్షలకు చిలుకు ఎకరాలు సాగు అయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు అన్ని పంటలకు సరిపోయే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉండే తరువాయి 2లో

### రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థి ప్రకటన ఈవారంలోనే

## ట్రంప్ పోటీలో నిలుస్తారా?




**వాషింగ్టన్ :** కోర్టు కేసుల్లో చిక్కుకున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ప్రస్తుత పరిస్థితులు ఆయనకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఐనప్పటికీ యన వెనక్కు తగ్గడలేదు. కేసులు రుజువైతే తక్షణం ఆయనకు నాలుగు సంవత్సరాలు జైలుశిక్ష పడే అవకాశం ఉంది. నటి స్టార్మీ డార్మియర్స్‌తో శృంగారం చేశారన్న ఆరోపణల్లో కోర్టు ఆయన్ను దోషిగా తేల్చింది. ఈ దశలో ట్రంప్ పరోక్షంగా తనకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని సమ్మతించారు. అందుకు తలవంచుతానని కూడా ఆయన పరోక్షంగానే సంకేతాలు ఇచ్చారు. ఐతే తన అనుచరులను ఎగదోశారు. వారు ఊరికే ఉండరని చెబుతూ మళ్ళీ అల్లర్లు జరుగుతాయన్న సంకేతాలు ఇచ్చారు. కాగా చాలాబలంగా రెండోసారి దేశాధ్యక్షుడు కావాలని ట్రంప్ ఉబలాటపడుతున్న తరుణంలో రిపబ్లికన్ పార్టీ ఈ వారంలోనే తన అభ్యర్థిని అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈసారి ఎన్నికల్లో ట్రంప్ దీటుగా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్‌ను ఢీ కొట్టేందుకు బరిలో నిలబడగలరా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. నేరాలు చేసి తిరిగి దేశాధ్యక్ష పదవికి పోటీ పడుతున్న అభ్యర్థిగా ట్రంప్ అమెరికా చరిత్రలో ప్రత్యేక నాయకుడుగా మిగిలిపోయారు.

### ఇక హంటర్ బైడెన్ వంతు....

34 ఆరోపణల్లో నేరస్తుడుగా డోనాల్డ్ ట్రంప్‌పై కేసులు రుజువైన కొద్ది రోజుల తర్వాత ఇక అమెరికా దేశాధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ వంతు వచ్చింది. ఆయనపై వచ్చిన ఆరోపణలపై కోర్టు కేసు మొదలైంది. అక్రమంగా ఆయుధాలను కలిగి ఉన్నాడన్న ఆరోపణలపై హంటన్ బైడెన్ కోర్టుకు హాజరవుతున్నారు. అదేవిధంగా ఆయనపై ఇంకా రుజువు కాకపోయినప్పటికీ డ్రగ్ అబ్యూజ్ ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ కేసులో గనుక హంటర్ బైడెన్ దోషిగా తేలితే ఆయనకు 25 ఏళ్ళు జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి.

## పాక్‌లో 504మంది ఉగ్రవాదులు హతం



**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్‌లో గడచిన ఐదు నెలల కాలంలో 504 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. పాకిస్థాన్ ప్రభుత్వం ఈ విషయం ప్రకటించింది. ప్రధానంగా ఖైబర్ పఖ్తుంక్వా, బలోచిస్థాన్‌లలో ఈ నిర్మూలన జరిగినట్లు పాకిస్థాన్ భద్రతా ఏజన్సీ సోమవారం వెల్లడించింది. తెహ్రిక్ యే తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి), హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్ వంటి నిషేధిత ఉగ్రవాద సంస్థలకు చెందిన అగ్రశ్రేణి కమాండర్లు కూడా భద్రతా దళాల చేతుల్లో హతులయ్యారని నివేదిక వెల్లడించింది. అక్రమ వసూళ్ళు, లక్ష్యంగా చేసుకుని హత్యలు చేయడం, డబ్బుకోసం కిడ్నాపులు వంటి చర్యలకు పాల్పడిన కేసులలో గడచిన జనవరి నుండి మే నెల చివరి వరకూ 158 మంది ఉగ్రవాదులను అరెస్టు చేశారు. భద్రతాదళాలపై 398 సార్లు ఉగ్రవాదులు జరిగిన దాడుల్లో 240మంది అమాయకులైన ప్రజలు మరణించారు. మరో 200 మంది భద్రతా సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయారు. భద్రతా దళాలు, పోలీసులు కలిసి గూఢచారి విభాగం సమాచారం మేరకు 479 సార్లు ఉగ్రవాద నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించారు. ఏప్రిల్, మేనెలల్లో అత్యధికంగా 130 మంది చొప్పున ఉగ్రవాదులను భద్రతాదళాలు హతమార్చాయి.

# మెక్సికో అధ్యక్షపీఠంపై తొలిమహిళ క్లాడియా




**మెక్సికో సిటీ :** మెక్సికో అధ్యక్ష ఎన్నికల్లో అధికార వామపక్షానికి చెందిన చెందిన అభ్యర్థి క్లాడియా షియిన్ బాయుమ్(61) విజయం సాధించారు. మెక్సికోలో నయా ఉదారవాద, కార్పొరేట్ అనుకూల శక్తుల ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న అధికార వామపక్ష ''మోరెనా'' పార్టీ అభ్యర్థిగా ఆమె బరిలోకి దిగి ప్రజల్లో తిరుగులేని అభిమానం సంపాదించుకున్నారు. మెక్సికోలో 'మోరెనా' పార్టీ అతిపెద్ద పార్టీ. ఎంతో ప్రజాభిమానం సంపాదించుకున్న పార్టీ. దీంతో లాటిన్ అమెరికా దేశాల్లో అప్రతిహతంగా కొనసాగుతున్న మహిళా నాయకత్వ జాబితాలో మరోదేశం కూడా వచ్చి చేరినట్లయింది. ఈ ఏడాది అక్టోబరు 1న ఆమె పదవీ బాధ్యతలు తీసుకుంటారు. అప్పటివరకూ ''ప్రెసిడెంట్ ఎలక్ట్''గా ఆమె కొనసాగుతారు. ప్రస్తుతం దేశాధ్యక్షుడుగా ఆండ్రెస్ మేన్యుయెల్ లోపెజ్ అబ్రెడార్ పదవిలో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో అబ్రెడార్ ఒక ప్రకటన చేస్తూ తాను ఇంక ప్రజా జీవితం నుండి నిష్క్రమిస్తున్నాననీ, ఇక శేష జీవితం ప్రశాతంగా గడుపుతానని పేర్కొన్నారు. నేషనల్ ఎలక్టోరల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెక్సికో (ఎన్ఇఐఎం) సోమవారం ఒక ప్రకటన చేస్తూ క్లాడియా షియిన్ బాయుమ్‌కు సుమారుగా 58.3 – 60.7 శాతం మేరకు ఓట్లు నమోదైనటు ప్రకటించింది. ఇప్పటివరకూ 10 లాటిన్ అమెరికా దేశాల్లో మహిళలే దేశానికి నాయకత్వ సారథ్యం వహిస్తుండగా ఇప్పుడు మెక్సికో దేశం తాజాగా 11వ దేశం గా ఆ జాబితాలో చేరింది. మెక్సికో చరిత్రలో ఒక మహి ళ దేశాధ్యక్షపదవి చేపట్టడం ఇదే మొదటిసారి. పైగా దేశాధ్యక్షపదవికోసం ప్రధానంగా ఇద్దరు మహిళలు ప్రధాన ప్రత్యర్థులుగా పోటీ పడ్డారు. నువ్వా నేనా అన్న రీతిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో దేశఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడమే ప్రధాన అంశంగా తెరమీదకు వచ్చాయి. ప్రతిపక్షం తరపున మహిళా అభ్యర్థి గ్జోచిట్ గాల్వేజ్‌కు 26.6–28.6 (మధ్యలో) శాతం మేరకు ఓట్లు పోలైనట్లు మెక్సికో నేషనల్ ఎలక్టోరల్ ఇనిస్టిట్యూట్ ప్రకటించింది. ఇక ఏకైక పురుష అభ్యర్థి జార్జ్ అల్వేరెజ్ మేనెజ్‌కు 9.9– 10.9 శాతం (మధ్య) మేరకు ఓట్లు పోలయ్యాయి. పూర్తిస్థాయిలో పోలింగ్ వివరాలు రేపటికి తెలుస్తాయి.

**ఎవరీ క్లాడియా?...** క్లాడియా షియిన్ బాయుమ్ వాతావరణ శాస్త్రవేత్త, మెక్సికో సిటీ మేయర్‌గా ఆమె ఇంతకు ముందు పదవీబాధ్యతలు నిర్వహించారు. దేశాధ్యక్ష పదవికి పోటీ చేయడంకోసం 2023 జూన్ 12న ఆమె మేయర్ పదవినుండి వైదొలగారు. 2018నుండి క్లాడియా వామపక్ష మోరెనా పార్టీలో క్రియాశీల పాత్ర వహిస్తున్నారు. అంతకుముందు 2000 సంవత్సరంలో మెక్సికోసిటీ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీగా పనిచేశారు. మేయర్‌గా పనిచేస్తూ, పోలీస్, పర్యావరణం, విద్యారంగాలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి పాలనా వ్యవస్థపై తనదైన ముద్రవేశారు. ఈసారి భయంకరమైన హింసాత్మక ఘటనలమధ్య ఈ ఎన్నికలు పూర్తయ్యాయి. మొత్తం 37మంది రాజకీయ నాయకులు హత్యకుగురయ్యారు. మెక్సికో చరిత్రలో ఎన్నడూలేనంతస్థాయిలో ఈసారి హింస చెలరేగింది.

## 6 నుండి ఇయు పార్లమెంటు ఎన్నికలు




**పారిస్ :** యూరోపియన్ యూనియన్ పార్లమెంటుకు ఈనెల 6 వ తేదీ నుండీ 9వ తేదీ వరకూ ఎన్నికలు జరుగుతాయి. యూరప్ ప్రజాస్వామ్య భవితవ్యాన్ని నిర్ణయించడంకోసం యూరప్ దేశాల ప్రజలు ఈ ఎన్నికల్లో పాల్గొననున్నారు. స్థానిక, జాతీయ, యూరోపియన్ యూనియన్ అనే మూడు స్థాయిలలో ఈ ఎన్నికలు జరుగుతాయి. యూరోపియన్ యూనియన్(ఇయు) పార్లమెంటులో మొత్తం720 స్థానాలు ఉన్నాయి. ఇ.యు పార్లమెంటును కైవసం చేసుకుని అధికారం చెలాయించాలంటే ఏ కూటమి అయినా 361 స్థానా లు గెలుచుకోవాలి. ఈ దేశాల్లో ప్రజలు ట్రాన్స్ నేషనల్ అసెంబ్లీ(బహుళదేశాల ప్రాతినిధ్యసభ)కి మెంబర్‌ఆఫ్ యూ రోపియన్ యూనియన్ (ఎంఇపి)లను ఎన్నుకుంటారు. ఫ్రాన్స్(81), జర్మనీ(96), ఇటలీ(76), పోలెండ్(53), నెదర్లాండ్స్(31), స్పెయిన్(61), రొమేనియా(33) దేశాలు ఈ ఎన్నికల్లో కీలకపాత్ర వహిస్తాయి. ఎందుకంటే ఈ దేశాలకు ఎక్కువ సీట్లు ఉన్నాయి. ఈ పార్లమెంటు ఏటా బడ్జెట్‌ను రూపొందిస్తుంది. బడ్జెట్‌ను ఖర్చుచేయాలో ప్రణాళికరూ పొందిస్తుంది. ఇయు పార్లమెంటు కమిషన్ ఒక అధ్యక్షుణ్ణి ఎన్నుకుంటుంది. జవాబుదారీకోసం పలు కమిషనర్లను నియమిస్తుంది. యూరప్‌లోని అతిపెద్ద సమూహాల నుండి అతి చిన్న చిన్న సమూహాల వరకూ, అతిపెద్ద బహుళజాతి కంపెనీల నుండి స్టార్టప్‌ల వరకూ గ్లోబల్ నుండి లోకల్ వరకూ అందరినీ ఈ ఎన్నికలు ప్రభావితం చేస్తాయి.



వాటి భవిష్యత్తును నిర్దేశిస్తాయి. యూరోపియన్‌యూనియన్‌లోని సభ్యదేశాల రోజువారీ జీవితాలను ఈ ఎన్నికల ఫలితాలే శాసిస్తాయి. ఇందుకు అనుగుణంగా కొత్త చట్టాలను యూ రోపియన్ యూనియన్ పార్లమెంటు రూపొందిస్తుంది. మీదుమిక్కిలి ప్రస్తుతం యూరోపియన్ యూనియన్ దేశాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాంతీయ సంఘర్షణలపట్ల విభిన్న వైఖరులు వ్యక్తమవుతున్న తరుణంలో ఈ ఎన్నికలు మరింత కీలకంగా మారాయి. 42,33,255 కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న యూరోయన్ యూనియన్ దేశాల్లో తాజా గణాంకాల ప్రకారం సుమారు 44.8 కోట్లమంది (ప్రపంచ జనాభాలో 5.8 శాతం) ప్రజలు జీవిస్తున్నారు. ప్రస్తుతం 27 సభ్యదేశాలు యూరోపియన్ యూనియన్‌లో ఉన్నాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో 50.7 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి ఎన్నికల్లో మితవాద, ఛాంధసవాద పార్టీల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుందని చాలా నెలల నుండే హెచ్చరికలు, భయాలు వ్యక్తం అవుతున్నాయి. గత ఎన్నికల్లోనే ఈ ధోరణి మొదలైంది. ఎన్నికల చట్టాల్లో మార్పులు తీసుకురావాలనే ఆలోచనలు కూడా జరిగాయి. యూరోపియన్ యూనియన్ పార్లమెంటుకు ఎన్నికలు జరగడం ఇది పదోసారి. 1979లో మొదటిసారి ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా బ్రిటన్ యూరోపియన్ యూనియన్ నుండి (బ్రెగ్జిట్) వైదొలగిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికలు కూడా ఇవే. 2019 మార్చి 29న బ్రిటన్ యూరోపియన్ యూనియన్ నుండి వైదొలగింది.

### 30 ఏళ్ళ ఎఎన్‌సి ఆధిపత్యానికి విఘాతం

## సంకీర్ణ ప్రభుత్వం దిశగా దక్షిణాఫ్రికా

**జోహన్నెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికా పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో అధికార ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ (ఎ ఎన్ సి) పార్టీ 30 ఏళ్ళ ఆధిపత్యానికి విఘాతం కలిగింది. 1994 నుండి మెజారిటీ సంపాదించుకుని అప్రతిహతంగా విజయభేరి మోగిస్తున్న ఎఎన్‌సి పార్టీకి ఈసారి పార్లమెంటు దిగువసభ జాతీయ అసెంబ్లీలో తగిన మెజారిటీ రాలేదు. ఎఎన్‌సి పార్టీ 159 సీట్లకు మాత్రమే పరిమితమైంది. దేశ ప్రయోజనాలరీత్యా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు భావసారూప్యతగల పార్టీలతో సంప్రదింపులకు ఎఎన్‌సి పార్టీ సమాలోచనలు చేస్తున్నది. ఈ దశలో ఈ ఎన్నికల్లో అనూహ్య విజయాలతో ముందుకు దూసుకువచ్చిన మాజీ దేశాధ్యక్షుడు జాకబ్ జుమాతో తిరిగి ఎఎన్‌సి జత కడుతుందనే ఊహాగానాలు వస్తున్నాయి. ఐతే దేశంలో అధికార ఎఎన్‌సి, ప్రతిపక్ష డెమొక్రటిక్ అలయెన్స్ కలిసి జాతీయ ప్రభుత్వ ఏర్పాటుచేయాలని వ్యాపార వర్గాలు కోరుకుంటున్నాయి. ఎంకెపార్టీతో కలిసి ఎఎన్‌సి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే అంతా వినాశనమేనని డెమొక్రటిక్ ఎలయెన్స్ కూటమి హెచ్చరిస్తున్నది. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన 14 రోజుల్లోనే జాతీయ అసెంబ్లీ తొలి సమావేశం నిర్వహించి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాలను పూర్తిచేయవలసి ఉన్నది. ఐతే ప్రస్తుతం ఎవరికీ మెజారిటీ లేకపోవడంతో సంకీర్ణ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ఎఎన్‌సి చురుగ్గా పావులు కదుపుతున్నది. ప్రధాన ప్రతిపక్షం డెమొక్రటిక్ ఎలయెన్స్ 87 సీట్లు సంపాదించగా, అవినీతి ఆరోపణలతో ఎ ఎన్ సి ని సవాలు చేసి విడిపోయి వేరు కుంపటి పెట్టిన దేశ మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమా ఒక కెరటంలాగా ఈ ఎన్నికల్లో ఎగసిపడ్డారు. ఆయన స్థాపించి న ఎంకె పార్టీ 58 సీట్లు సంపాదించడంతో దేశంలో సంభ్రమాశ్చర్యాలు రేకెత్తాయి. ఎకనామిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ (ఇఎఫ్ఎఫ్) పార్టీ 39స్థానాల్లో విజయం సాధించింది. ఎన్నికల్లో సాధించిన విజయంపై దేశాధ్యక్షుడు సైరిల్ రామఫోసా సోమవారం దేశ ప్రజలకు అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్యంలో ఈ ఎన్నికలు ఎంతో కీలకమైనవని ఆయన అన్నారు. ఐతే గతం కంటే భిన్నంగా ఈసారి ఎన్నికల్లో అతి తక్కువగా పోలింగ్ 58.64 శాతం మాత్రమే నమోదైనట్లు దక్షిణాఫ్రికా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అధికార ఎ ఎన్ సి పార్టీకి 40.18 శాతం ఓట్లు నమోదుకాగా, ప్రతిపక్ష డెమోక్రటిక్ అలయెన్స్‌కు 21.81 శాతం, జాకబ్ జుమా సారథ్యంలోని ఎం కె పార్టీకి 14.58 శాతం, ఇ ఎఫ్ ఎఫ్ పార్టీకి 9.52 శాతం ఓట్లు లభించినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. 1994లో జాతి వివక్ష నశించి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత నెల్సన్ మండేలా హయాంలో 86.87 శాతం పోలింగ్ జరిగింది. 1999 ఎన్నికల్లో 89.30 శాతం, 2004లో 76.70 శాతం, 2009 లో 77.30 శాతం, 2014లో 73.48 శాతం, 2019లో 66.05 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ విధంగా క్రమంగా ఓటింగ్ శాతం తగ్గుతూ 2024 మే 29 ఎన్నికల్లో కనిష్టస్థాయిలో 58.64 శాతం పోలింగ్ నమోదైంది.



## అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

నుంచి చిత్తశుద్ధి, నిబద్ధత ఉన్న పార్టీ నాయకుల, కార్యకర్తలను మాత్రమే ఏజెంట్‌గా పంపించాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సీనియర్ నాయకులను కూడా కౌంటింగ్ సెంటర్లకు తీసుకెళ్లేలా చూసుకోవాలని అన్నారు. ప్రతి రౌండ్‌లో కౌంటింగ్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని వివరించారు. ప్రతి ఒక్కరి దగ్గర 17సి లిస్ట్ (ఓటరు జాబితా) ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఈవిఎం ఓట్లకు, 17సి లిస్ట్ ఓట్లకు తేడా వస్తే అక్కడే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. ప్రతి అభ్యర్థి ఈ అంశాలపై అవగాహనతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఓట్ల లెక్కింపు కోసం ఈసి అన్ని ఏర్పాట్లు చేసింది. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. దీంతో పాటు సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల ఓట్లతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు కూడా జరగనుంది.

## కేంద్రాల వద్ద భారీ భద్రత

(మొదటి పేజీ తరువాయి)

సంతృప్తి వ్యక్త పరిచారు. ప్రతికౌంటింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల దూరం వరకు నిషేదాజ్ఞలు విధించారు. ఈప్రాంతంలో పాస్‌లు లేని ఎవర్ని అనుమతించరు. అలాగే కౌంటింగ్ సెంబర్ల వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఇప్పటికే కౌంటింగ్ సెంబర్లలోపల బయట బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు.అలాగే ఇక్కడ 144 సెక్షన్ విధించారు. ఇక మద్యం దుకాణాలు మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి గురువారం ఉదయం ఆరు గంటల వరకు బంద్ ఉంటాయి. ఈ మేరకు పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. పబ్లిక్ ప్రదేశాలలో ఏటాంటి బాణాసంచాలను కాల్చడము కాని, విసిరేయడముపై కూడా నిషేధం విధించారు. ర్యాలీలు, సభలు, సమావేశాలపై కూడా నిషేధం విధించారు. కౌంటింగ్ సెంబర్ల వద్ద బందోబస్తును ఎప్పటికప్పుడు సిసిటివిల ద్వారా డిజిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్నతాధికారులు వీక్షిస్తారు. ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు చేస్తుంటారు.

## నైరుతి రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

రెండో వారంలో తెలంగాణకు తాకుతాయి. కానీ ఈ ఏడాది వారం రోజుల ముందే వచ్చాయి. జూన్ 6వతేదీన రూతుపవనాలు తాకుతాయని అంచనా వేసినా, మూడు రోజుల ముందే ప్రవేశించాయి. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది సాధారణంగా కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురిస్తాయని చెప్పారు. మంగళవారం నుంచి వచ్చే మూడురోజులపాటు తెలంగాణ రాష్ట్రంలోని దక్షిణ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించారు. రెండు, మూడు మాసాలుగా అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులు, ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు నైరుతి ఆగమనం, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఉపశమనం కలిగించనున్నాయి.

## రిమాండ్ పొడిగింపు (మొదటి పేజీ తరువాయి)

సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆమెకు, చరణ్‌ప్రీత్‌లకు ప్రొడక్షన్ వారెంట్ జారీచేసింది. మిగిలిన ఇద్దరు నిందితులను కోర్టు ముందు హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. ఇప్పటి వరకు 14రోజులు మాత్రమే రిమాండ్ పొడిగిస్తూరాగా, ఈసారిఏకంగా నెలరోజులపాటు పొడిగిస్తూ కోర్టుఉత్తర్వులిచ్చింది.

**సిబిఐ కేసులోనూ కస్టడీ పొడిగింపు :** మరోవైపు సిబిఐ కేసులోనూ సోమవారంతో కవిత కస్టడీ ముగియగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు కవితను జడ్జి ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఈనెల 7 వరకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. జూన్ 7న సిబిఐ కవితపై ఛార్జిషీట్ దాఖలు చేయనుంది. ఈ కేసుకు సంబంధించి మార్చి 26వ తేదీ నుంచి కవిత తీహార్ జైల్లో ఉన్న విషయం తెలిసిందే.

## సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్

(మొదటి పేజీ తరువాయి)

రైటర్లు కల్లూరి శ్రీనివాస్, తంగేళ్ళ వెంకట్ రెడ్డిని అరెస్టు చేశారు. నల్లగొండ ఎసిబి డిఎస్‌పి జగదీష్ చందర్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని తనకున్న 1080 గజాల స్థలాన్ని మేకల వెంకటేశ్వర్లు తన కుమార్తె మానస పేరున గిఫ్టు డీడ్‌గా, మరో 160 మేడిపల్లి రవి రాజు పేరున సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు డాక్యుమెంటర్స్ కల్లూరి శ్రీనివాస్, తంగేళ్ళ వెంకట్‌రెడ్డిలను సంప్రదించారు. వీరి ద్వారా సబ్ రిజిస్ట్రార్ బాణోతు సురేందర్ నాయక్‌ను కలవగా పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారు. నాలుగు నెలల పాటు తన చెప్పులు అరిగేలా కార్యాలయం చుట్టు తిరిగినా ఫలితం లేకపోవడంతో చివరకు గజానికి రూ. 100 చొప్పున ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. తనను సబ్ రిజిస్ట్రార్ ఇబ్బందులకు గురిచేసి డబ్బులు డిమాండ్ చేయడంతో ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎసిబి డిజి సివి ఆనంద్ ఆదేశాలతో డిప్యూటి డైరెక్టర్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా దీనిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని తెలిపారు. సోమవారం బాధితుడు వెంకటేశ్వర్లు డాక్యుమెంటర్ రైటర్లకు డబ్బులు అందజేయగా అవి సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్ ఇచ్చేందుకు ప్రయత్నించగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుండి రూ. 99,200 స్వాధీనం చేసుకోని కార్యాలయంలో తనిఖీలు చేసి వారిని అదుపులో తీసుకోని లోతుగా విచారణ జరిపారు. అనంతరం వారిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఏ1గా సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్, ఏ2 గా కల్లూరి శ్రీనివాస్, ఏ3గా తంగేళ్ళ వెంకట్ రెడ్డి చేర్చారు. అనంతరం నాంపల్లి ఎసిబి కోర్టులో హాజరు పర్చేందుకు తరలించారు. సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్‌పై 2007లో రంగారెడ్డి జిల్లా పరిగి, 2018లో మల్కాజ్‌గిలో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన సమయంలో రెండు సార్లు ఎసిబికి ట్రాప్ అయినట్లు తెలిపారు. గతంలో పట్టుబడడంతో ఆయన నేరుగా డబ్బులు తీసుకోకుండా ప్రైవేట్ ఏజెంట్ల ద్వారా బేరసారాలు ఆడి అవినీతికి పాల్పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైన ప్రజల నుండి డబ్బులు డిమాండ్ చేస్తే ఎసిబి టోల్‌ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ఎసిబి డిఎస్పి కోరారు.

## ఉద్యమకారులను ఆదుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని అన్నారు. నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు, పింఛన్లను అందిస్తామన్నారు. రానున్న రోజులలో వరంగల్ కేంద్రంగా కాకతీయ ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇక నుండి తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో స్వేచ్ఛగా జీవిస్తారన్నారు. ఇక నుండి ప్రతి సభలో అందరూ జై తెలంగాణ అని నినదించేలా ప్రభుత్వం తరుపున ఆదేశాలు ఇస్తామన్నారు. సభలో తొలుత రాష్ట్ర జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఉద్యమకాలంలో అన్ని పార్టీలను, సంఘాలను ఏకతాటిపైకి తీసుకురావడానికి ఎంతో కష్టపడ్డామని, కానీ వచ్చిన తెలంగాణను తానొక్కడినే తెచ్చినట్టు కెసిఆర్ పదేళ్లపాటు నిరంకుశ పాలన నిర్వహించారన్నారు. ఉద్యమం కెసిఆర్ ఒక్కరిది కాదు సబ్బండ వర్గాలది అని చెప్పడానికి మనకు పదేళ్ల కాలం పట్టిందన్నారు. కాగా సభలో నాటి ఎంపిలు, టిపిసిసి నాయకులు మధుయాస్కి గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యే వివేక్ తదితరులు మాట్లాడుతూ ఆనాడు బిల్లు పెట్టే సమయంలో పార్లమెంట్‌లో జరిగిన ఘటనలను కళ్లకు కట్టినట్లు వివరించారు. కెయు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉద్యమకారులను మంత్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు మాజీ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపిలు పసునూరి దయాకర్, సీతారామ్ నాయక్, ఎమ్మెల్యేలు కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మామిడాల యశస్వినిరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు టి. వెంకట్రాములు, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి,వరంగల్ మేయర్, గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, ప్రొఫెసర్ టి. పాపిరెడ్డి, ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి.రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ రికార్డు సృష్టించాం

(మొదటి పేజీ తరువాయి)

తాము ఎల్లప్పుడూ ఇక్కడే ఉన్నామని, ఎన్నడూ తప్పిపోలేదని రాజీవ్‌కుమార్ వ్యాఖ్యానించారు. తాము పత్రికా ప్రకటనల ద్వారా మీడియాతో అనుసంధానమై ఉన్నామని, ఈసారి తొలిసారిగా సుమారు వంద ప్రెస్ నోట్‌లు, అడ్వైజరీలు విడుదల చేశామన్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో నాలుగు లక్షల వాహనాలు, 135 ప్రత్యేక రైళ్ళు, 1,692 విమాన ప్రయాణాలను ఉపయోగించామని చెప్పారు. 2024 సాధారణ ఎన్నికల్లో కేవలం 39చోట్ల మాత్రమే రీపోలింగ్ జరిగిందని, 2019లో ఆ సంఖ్య 540 అని తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో నాలుగు దశాబ్దాలలో అత్యధికంగా ఓటర్లు ఓటు హక్కును నమోదు చేసుకున్నారని, అక్కడ మొత్తం 58.58 శాతం ఓట్లు పోల్ కాగా, లోయ ప్రాంతంలో 51.05 శాతం పోలయ్యాయని ప్రధాన ఎన్నికల అధికారి వివరించారు.

**రూ.10వేల కోట్లు జప్తు...** ఎన్నికలలో భాగంగా సుమారు రూ.10వేల కోట్ల మొత్తాన్ని జప్తు చేశామని, వాటిలో నగదు, వస్తువులు, మాదకద్రవ్యాలు, మద్యం ఉన్నాయని రాజీవ్ కుమార్ వెల్లడించారు. 2019 ఎన్నికల్లో రూ.3వేల కోట్లు జప్తు చేయడం జరిగిందన్నారు.

**ప్రతిపక్షాలు ఆధారాలు చూపించాలి...**ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, జిల్లా కలెక్టర్లను ప్రభావితం చేస్తున్నారనే ఆరోపణలపై ప్రతిపక్షాలు ఆధారాలు చూపించాలని రాజీవ్ కుమార్ అన్నారు.

## సాగుకు రైతు సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

విధంగా ఇప్పటికే ప్రణాళికలను సిద్ధ చేసుకున్న వ్యవసాయ శాఖఅధికారులు ఇందుకు సంబంధించి వివిధ రకాల విత్త నా, ఎరువుల కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ ముం దుకు సాగుతున్నారు. మరి ముఖ్యంగా ఈ ఏడాది పత్తి సాగు విస్తరణ గణనీయంగా పెరగనున్నట్లు అంచనా వేశారు. గత ఏడాది సుమారు 45 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఈ సంవత్సరం 55 లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా. గత ఏడాదితో పోల్చితే ఇది 10లక్షల ఎకరాలు అదనం కావడం, అధికారుల అంచనా వేసినట్లుగానే పత్తి విత్తనాలకోసం రైతులు ఎగబడుతుండడం, అక్కడక్కడ ఆందోళనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. పత్తి విత్తనాలకు చాలా డిమాండ్ పెరగడంతో రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రోజువారిగా అధికారులతో తాజా పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

## ప్రజా తీర్పు నేడే

(మొదటి పేజీ తరువాయి)

శాసనసభ ఉప ఎన్నిక ఫలితాలను కూడా లెక్కించనున్నారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గ కౌంటింగ్ నిమిత్తం ఒక హాల్‌ను ఏర్పాటు చేయగా, చేవేళ్ల, మాల్కాజిగిరి, మెదక్ లాంటి పెద్ద నియోజకవర్గాల కు మాత్రం రెండుహాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో లోక్ సభ నియోజక వర్గంలో సుమారు 18 నుంచి 24 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా చొప్పదండి, దేవరకొండ, యాకుత్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధి లో 24రౌండ్లు. అతితక్కువగా ఆర్మూరు, భద్రాచ లం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో 13రౌండ్లలో లెక్కింపు పక్రియ పూర్తికానుంది. కేంద్రఎన్నికల కమిషన్ నుంచి 49మంది పరిశీలకులు వచ్చారు. వారితో పాటు 2,414మంది సూక్ష్మ పరిశీలకులు ఉంటారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10వేల మంది సిబ్బంది కౌంటింగ్‌లో పాల్గొననున్నారు.

**ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఇలా..** రాష్ట్ర వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం 8.00 గంటల నుండే ఆరంభంఅవుతోంది. ఒక్కో ఈవిఎంలో వెయ్యి నుంచి 1200ఓట్లు ఉండనుండగా,ఒక్కో రౌండ్‌కు 14 మీద అంటే 14వేల నుండి 15 వేల ఓట్లను తేల్చనున్నారు. ఓటు వేసిన ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్న చోట్ల ఫలితాలు తొందరగా వెల్లడికానుండగా, లక్ష ఓటర్లు ఉంటే ఎనిమిది నుండి పది రౌండ్లలో ఫలితం వెలువరించే ఛాన్స్ ఉంటుంది. అదే సమయంలో రెండు లక్షలు ఆ పైన ఓటర్లు ఉంటే 16 నుండి 20 రౌండ్లలో ఫలితం వెలువడనుంది. మల్కాజిగిరి, చేవేళ్ల, మెదక్ వంటి పెద్ద లోక్‌సభ నియోజకవర్గాల్లో మూడులక్షలపై చిలు కు ఓటర్లు ఉన్నారు. అలా మూడు లక్షల మంది ఓటర్లు ఉన్న చోట ఒక్కోసారి 24 రౌండ్ల వరకు సమయం తీసుకోనుంది. ఈవిధానాన్ని దేశ వ్యాప్తం గా ఉన్న లోక్‌సభ స్థానాలతో పాటు కంటోన్‌మెంట్ ఎన్నికల లెక్కింపులోనూ ఎన్నికల సంఘం అధికారులు, సిబ్బంది పాటించనున్నారు. కాగా ఒక వేళ పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు గనుక అలాగే కొనసాగితే ఇక ఈవిఎంల ఓట్ల లెక్కింపును కూడా చేపడుతారు. ప్రస్తుతానికి ప్రతిమూడు నిమిషాలకు ఒక పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కిస్తారని అంచనావేస్తున్నారు.

**రౌండ్ లెక్కింపునకు కనీసం అరగంట సమయం**

ఎన్నికల్లో ఒక రౌండ్ ఫలితాలు ఎన్నికల కమిషన్ అధికారులు అధికారికంగా ప్రకటించాలంటే కనీ సం అరగంటనుండి 45నిమిషాలపాటు సమయం పడుతుంది. అలా రౌండ్‌పూర్తయిన తర్వాత అన్నిపార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్ల సంతకాలను తీసుకుంటారు. అనంతరం మైక్రోఅబ్జర్వర్, కేంద్ర ఎన్నికల పరిశీలకుల సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఇలా ఇవిఎంలలో వచ్చిన ఓట్లు, వివి ప్యాట్లలో వచ్చిన ఓట్లు సరిపోవాల్సి ఉంటుంది. ఆ తరువాత ఏజెంట్లు కౌంటింగ్‌పై అభ్యంతరం లేదని చెప్పిన తర్వాత ఆర్‌ఓ రౌండ్ ఫలితాలు అధికారికంగా ప్రకటించనున్నారు.

## ఉత్కంఠకు తెర (మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ 'మోదీ మీడియా పోల్స్'గా అభివర్ణించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుపై అనేక సందేహాలు లేవనెత్తే 'ఇండియా' కూటమి నాయకులు ఈ విధమైన 'ఫాంటసీ' ఎగ్జిట్‌పోల్స్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే బ్యూరోక్రసీకి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కొన్ని సంకేతాలు పంపించారని విమర్శిస్తూ, రాజ్యాంగ ప్రకారం ఎన్నికల ప్రక్రియ కౌంటింగ్‌కు ఉన్న మార్గదర్శక సూత్రాలను తు.చ తప్పకుండా పాటించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి విజ్ఞప్తి చేశాయి. దీనిపై భారతీయ జనతాపార్టీ తీవ్రంగా స్పందించింది. భారతదేశ అత్యాధునిక సాంకేతిక పద్ధతుల్లో జరిగే ఎన్నికల ప్రక్రియను తక్కువచేసి చూస్తున్నారని బిజెపి విమర్శించింది. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏ విధమైన హింస, అరాచకాలకు తావు లేకుండా అలాంటి ప్రయత్నాలు జరక్కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి బిజెపి ఒక విజ్ఞప్తి చేసింది. మోదీ తన ఎన్నికల ప్రచారం మొత్తాన్ని 'ప్రతిపక్షాల బుజ్జగింపు రాజకీయాలు' అనే నినాదం చుట్టూ అల్లుకుంటూ వచ్చారు. దాన్ని కేంద్ర బిందువుగా చేసుకునే ప్రతిపక్షాలపై లేనిపోని బురద జల్లారు. ఈపూర్వరంగంలోనే సంపద పునఃపంపిణీ పేరుతో ప్రజల ఆస్తులపై కాంగ్రెస్ కన్నేసిందనీ, ఓబిసి రిజర్వేషన్లను ముస్లింలకు బదిలీ చేస్తుందనీ ఎన్నికల ప్రచారంలో ప్రముఖంగా మోదీ ప్రచారం చేశారు. ప్రతిపక్షాలు దేశంలో ఓటర్లను మత ప్రాతిపదికపై విభజించాలని చూస్తున్నాయని కూడా బిజెపి నాయకులు చెప్పినప్పటికీ, దేశాభిమానం, సాంస్కృతిక వారసత్వం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, యావత్ దేశ రాజకీయ స్థిరత్వం, ఆర్థిక వృద్ధి వంటి అంశాలకు ప్రతిపక్ష రాజకీయపార్టీల నాయకులు తమ ప్రసంగాల్లో ప్రముఖంగా ప్రచారంలోకి తెచ్చారు. కాగా కొన్నిరాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు కూడా ఏకకాలంలో జరిగాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల ప్రచారం కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉత్కంఠ భరితంగా వివాదాస్పదంగా మారాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రక్రియ హింసాత్మకంగా మారింది. పలు ప్రాంతీయ పార్టీలు అభద్రతా వాతావరణంలో ఉన్నాయి. ఇక తమిళనాడులో, కేరళలో బిజెపి బలమైన శక్తిగా అవతరిస్తుందా? అనేక అంశం కూడాచర్చకు వచ్చింది. ఈ రెండు రాష్ట్రాలలోనూ బిజెపి జాడ ఎక్కడా లేదు. ఆఅవకాశాలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. కానీ మోదీ మాత్రం తిరిగి అధికారంలోకి వస్తానని కలలు కంటున్నారు. ఎక్స్ వేదికగా ఇప్పటికే ఒక వ్యాసం కూడా ఆయన రాశారు. రాబోయే 100 రోజుల పరిపాలన గురించి తన ప్రణాళికను ఆయన చెప్పుకున్నారు. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, భూపేంద్ర యాదవ్, స్బనానంద సోనోవాల్, ధర్మేంద్ర ప్రధాన్ సహా బిజెపి తరపున పోటీ చేసిన రాజ్యసభ సభ్యుల భవితవ్యం కూడా కొద్ది గంటల్లోనే తేలిపోతున్నది. మాజీ ముఖ్యమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, బసవరాజ్ బొమ్మై, త్రివేంద్ర సింగ్ రావత్‌తో పాటు కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌ససింగ్, భూపేష్ బాఘెల్ భవితవ్యం కూడా తేలనున్నది. ఇక నరేంద్రమోదీ వారణాసి నుండి మూడోసారి పోటీ చేశారు. రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షాల గెలుపు కూడా ఈసారి కీలకమే.

## కార్మికుల హక్కుల కోసం మల్లేశం నిరంతరం పోరాడారు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** సిరిసిల్ల పట్టణం చేనేత కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయడంలో కామ్రేడ్ సామల మల్లేశం ప్రధాన పాత్ర పోషించారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. సిరిసిల్ల లో సిపిఐ నాయకులు కామ్రేడ్ సామల మల్లేశం సంతాప సభను సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. సామల మల్లేశం చేనేత పరిశ్రమ, పవర్లూమ్ కార్మికుల బీడీ కార్మికుల హక్కులకై అనేక పోరాట ఉద్యమాలు చేయడంలో సామల మల్లేశం ది ప్రధాన పాత్ర ఉందని అన్నారు. ఏఐటీయూసీ నాయకులకు కార్మికుల పక్షపాతిగా అనేక పోరాట ఉద్యమాలు చేశారని, ఆయన సిపిఐ లో సీనియర్ నాయకులుగా 40 సంవత్సరాలుగా ప్రజా ఉద్యమంలో పాల్గొని అమరుడయ్యారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, తాంద్ర సదానందం, పంతం రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, నల్ల చంద్రమౌళి, కడారి రాములు, చెన్న విశ్వనాథం, మీసం లక్ష్మి ఉన్నారు.

## పారిజాతమ్మకు నివాళి



**చెన్నై :** సిపిఐ తొలి తరం నేత, పుత్తూరు మాజీ ఎమ్మెల్యే గంధమనేని శివయ్య సతీమణి పారిజాతమ్మకు సిపిఐ నాయకులు సోమవారం నాడు నివాళి అర్పించారు. చెన్నైలోని వారి స్వగృహంలో పారిజాతమ్మ భౌతిక కాయానికి సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పూలమాల వేసారు. గంధమనేని శివయ్య 1972–77లో పుత్తూరు నుండి సిపిఐ తరుపున ఎంఎల్ఏగా పని చేశారు. ఆయన సతీమణి పారిజాతమ్మ (84) ఆదివారం సాయంత్రం చెన్నైలోని వారి స్వగృహంలో మరణించారు. ఆమె భౌతిక కాయానికి నివాళి అర్పించిన వారిలో నారాయణతో పాటు సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. రామానాయుడు, రాష్ట్ర సమితి సభ్యులు డాక్టర్ టి .జనార్ధన్, సీనియర్ నాయకులు బి. తులసేంద్ర, తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నిరాజ్, సుధాకర్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు నాగేంద్ర, ఏపీ యూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## 78 రోజుల్లో రూ.200 కోట్లు

ఎన్నికల్లో నగదు, మద్యం, డ్రగ్స్ పట్టివేత

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో (78 రోజుల్లో) రూ.200 కోట్ల విలువచేసే నగదు, మద్యం, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు డిజిపి రవి గుప్తా తెలిపారు. 466 ఫ్లైయింగ్ స్క్వాడ్, 89 అంతరాష్ట్ర చెక్‌పోస్టులు వద్ద జరిపిన తనిఖీల్లో వీటిని గుర్తించారు. ఇందులో రూ.99.16 కోట్ల నగదు, రూ.11.48 కోట్ల మద్యం, రూ.14.52 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు, 63.19 కోట్ల విలువైన బంగారు, వెండి ఆభరణాలు ఉన్నట్లు రవిగుప్తా పేర్కొన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జరిపిన తనిఖీల్లో రూ. 46.3 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకోగా ఈ సారి అత్యధికంగా రూ.200కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

## ''యువకుడి ధైర్యానికి పోలీసు సెల్యూట్''

కత్తితో దాడి చేసినా వెరవని ధైర్యం.. స్నాచర్‌ను పట్టించిన వైనం



**ప్రజాపక్షం / హైదరాబాద్:** యువకుడి ధైర్యసాహాలకు హైదరాబాద్ పోలీసులు సెల్యూట్ చేశారు. కత్తితో దాడి చేస్తున్నా స్నాచర్‌ను మాత్రం విడవకుండా ధైర్యం గా పోలీసులకు పట్టించిన యువకుడి ఉదంతం సోమవారం మధురానగర్ పోలీ సు స్టేషన్ పరిధిలో చోటుచేసకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వెంగళరావునగర్ కాలనీలో ఉదయం 10 గంటలకు నడుచుకుంటూ వెళ్తున్న జాషువా అనే యువకుడిపై స్నాచర్ దాడి చేశాడు. అతని సెల్‌ఫోన్‌ను లాక్కుని పారిపోసాగాడు ఇంతలో అప్రమత్తమైన జాషువాకుమార్ సదరు స్నాచర్‌ను గట్టిగా పట్టుకున్నాడు. విష యం పసిగట్టిన మరో స్నాచర్ కత్తితో జా షువాపై దాడికి తెగబడ్డాడు. అయిన అత డు బెదరలేదు, ధైర్యంగా స్నాచర్‌ను మరింత గట్టిగా పట్టుకున్నాడు. ఇలా మూ డు నిముషాలు పట్టువదలని విక్రమార్కుడిలా అతన్ని పట్టుకొని మరోపక్క కత్తిదాడి ని ఎదుర్కొంటున్న వైనాన్ని స్థానికులు గ మనించి అక్కడికి చేరుకున్నారు. స్థానికుల రాకను గమనించిన మరో స్నాచర్ అక్కడి నుంచి పారిపోగ జాషువా చేతిలో బంధీ అయిన స్నాచర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. జాషువా సాహసానికి స్థా నికుల ప్రశంసలు వెలిబుచ్చగా పోలీసులు సైతం అతన్ని షెబాష అంటూ మెచ్చుకుని సెల్యూట్ చేసినంత పనిచేశారు. కేసు నమోదు చేసిన మధురా నగర్ పోలీసులు స్నాచర్ వివరాలపై ఆరా తీస్తున్నారు.

## అమిత్ షా మాటలపై ఎన్నికల సంఘం విచారణ చేయాలి: జి.నిరంజన్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** చిన్న పిల్లలను ఎన్నికల ప్రచారంలో ఉపయోగించిన కేంద్ర హోం శాఖమంత్రి అమీత్ షా ఎన్నికల సంఘం విచారణ చేయాలని టిపిసిసి సీనియర్ ఉపాధ్యాక్షుడు జి.నిరంజన్ అన్నారు. గాంధీ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిజెపి ఎన్నికల ప్రచారం మే 1వ తేదీన హైదరాబాద్ బిజెపి అభ్యర్థి ప్రచారం సుధా థియేటర్ వద్ద సభ నిర్వహించారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో చిన్నారులను బహిరంగ సభల్లో, ర్యాలీలలో ఉపయోగించవద్దు అని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం చెప్పిందన్నారు. ఆ సభలో అమిత్ షా పాల్గొన్నారన్నారు. ఎన్నికల కమిషనర్‌ను నియమించే ఎన్నికల కమిటీలో ఉన్న సభ్యుడు అమిత్ షా అని, ఆయనకు కనీసం చిన్నారులను ప్రచారంలో ఉపయోగించవద్దనే విషయం తెలియదా అని ప్రశ్నించారు. దీనిపై ఫిర్యాదు చేస్తే, మరునాడు మొఘల్ పురా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ ఫైల్ అయ్యిందని తెలిపారు. దీనిపై ఎన్నికల కమిషనర్ విచారణ చేయాలని కోరామన్నారు. నివేదికలు పంపాలని కోరారన్నారు. మెటీరియల్ ఎవిడెన్స్‌లో ఉన్న రాజా సింగ్, మాధవి లత పేర్లపై కేసు నమోదు చేశామని అన్నారన్నారు. కానీ అమిత్ షా, కిషన్ రెడ్డిల పేర్లు చేర్చడం లేదని నోటీసులు పంపారన్నారు. చిన్నారులు ప్రచారంలో పాల్గొన్న అన్ని వీడియోలు పంపాను అని నిరంజన్ చెప్పారు. ఇది ఎన్నికల సంఘాన్ని తప్పుదోవ పట్టించడమే అన్నారు. ఎన్నికల సంఘం వద్ద తీసుకొనే ప్రతి పర్మిషన్ సభ, ర్యాలీలకు ఒక షాడో టీం ఉంటుందని, ఫొటో గ్రాఫర్ ఉంటారని, కొంత మంది పేర్లు చార్జిషీట్‌లో తొలగించే ప్రయత్నం చేస్తున్న సంబంధింత పోలీసులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని నిరంజన్ కోరారు.

# మరికొన్ని గంటల్లో 'తెలంగాణ తీర్పు'




'హస్తం'లో ఆశలు.. గులాబీలో గుబులు..

కమలం కంగారు.. అభ్యర్థుల్లో ఉత్కంఠ..

గెలుపుపై ఎవరికివారికే ధీమా..

అభ్యర్థులను, ముఖ్యనేతలను అప్రమత్తం చేసిన రాజకీయ పార్టీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మరి కొన్ని గంటల్లోనే 'లోక్‌సభ అభ్యర్థుల' భవితవ్యం తేలిపోనుంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బలపడేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్న బిజెపిలకు లోక్‌సభ ఎన్నికలు ఒక రాజకీయ మలుపుకానుంది. ముఖ్యంగా కాంగ్రెస్, బిజెపి మధ్య తీవ్రమైన పోటీ ఉన్నట్టు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఇదే విషయాన్ని ఇటీవల ఎగ్జిట్ పోల్స్ కూడా వెల్లడించాయి. మెజార్టీ స్థానాలు తమవే అని కాంగ్రెస్, బిజెపి నేతలు ఎవరికి వారు అంచనాలు వేసుకుంటే, బిఆర్ఎస్ మాత్రం కనీసం గౌరవ సీట్లనైనా దక్కించుకుంటామా? లేదా? అనేది గులాబీ శిబిరంలో తీవ్ర ఉత్కంఠత నెలకొన్నది. శాసనసభ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు వచ్చే సీట్లు, ఓట్లపైనే సర్వత్రా రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఆ పార్టీకి వచ్చే సీట్లు, ఓట్లపైనే గులాబీ నేతల రాజకీయ భవిష్యత్ ఆధారపడి ఉన్నట్టు పలువురు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలను పరిశీలించిన తర్వాతనే రాజకీయ నిర్ణయం తీసుకోవాలని కొందరు బిఆర్ఎస్ నేతలు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఓట్ల లెక్కింపు తర్వాత మరుసటి రోజు (జూన్ 5న) బిఆర్ఎస్‌కు చెందిన 20 మందికిపైగా ఎంఎల్‌ఎలు కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా ఇందులో బిఆర్ఎస్‌కు 9, బిజెపికి నాలుగు, కాంగ్రెస్‌కు మూడు , ఎంఐఎంకు ఒక సిట్టింగ్ స్థానాలు ఉన్నాయి. శాసనసభ ఎన్నికల్లో తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు వచ్చాయి. పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రతి ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను దక్కించుకున్నది.శాసనసభ ఎన్నికల తర్వాత ఆ పార్టీ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన ముఖ్యనాయకులు, సిట్టింగ్ ఎంపిలు, ఎంఎల్‌లు బిఆర్ఎస్‌కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి గౌరవ స్థానాలు దక్కపోతే మరికొంత మంది 'కారు' దిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికలు తమకు రెఫరెండం అని ఇది వరకే టిపిసిసి అధ్యక్షుడు,ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. 9నుంచి 12 స్థానాలను గెలుచుకుంటామని సిఎం ధీమా వ్యక్తం చేశారు. మరో వైపు బిజెపి మెజార్టీ స్థానలను దక్కించుకుని రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయం అని నిరూపించుకునేందుకు బిజెపి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఎవరి లెక్కలు, అంచనాలు ఎలా ఉన్నప్పటికీ మరి కొ న్ని గంటల్లోనే ఓటర్ల తీర్పు వెలువడనుంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి తమ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేసింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎవరు ఏ పాత్రను పోషించాలనే విషయమై అభ్యర్థులను, నియోజకర్గ ముఖ్యనేతలకు ఆయా పార్టీలు దిశానిర్దేశం చేశాయి. బ్యాలెట్ బ్యాక్సుల నుంచి మొదలు ఇవిఎం లెక్కింపు జరిగే ప్రదేశంలో జాగ్రత్తగా ఉండాలనిసూచించారు. చివరి ఫలితాలు వెలువడే వరకు అక్కడే ఉండాలని, ఏమాత్రం చిన్న పాటి పొరపాట్లు జరిగినా తమ ముఖ్యనేతలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## సమాజంపట్ల అరసం ఎప్పుడూ బాధ్యతగానే ఉంది

అస్థిత్వ ఉద్యమాలు తెలుగు సాహిత్యానికి మేలు చేశాయి

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అరసం కవిసమ్మేళనంలో నందిని సిద్ధారెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్:** సమాజం పట్ల అరసం ఎప్పుడూ బాధ్యతగానే ఉందని, పలు ఉద్యమాలకు బాసటగా నిలిచిందని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి అన్నారు. గతంలో అరసం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పాల్గొన్నానని, అది సామాజిక స్పృహను పెంచడం, ప్రజల పక్షం వహించడం నేర్పిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో అరసం తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అస్థిత్వ ఉద్యమాలు తెలుగు సాహిత్యానికి ఎంతో మేలు చేశాయని, వాటి నుంచే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అస్థిత్వ ఉద్యమం బలంగా కొనసాగి, రాష్ట్రాన్ని సాధించే వరకు తీసుకువెళ్లిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్న వేళ అరసం కవిసమ్మేళనం ఏర్పాటు చేసి చారిత్రకంగా గొప్ప పనిచేసిందని 'మా తెలంగాణ' పత్రిక 'మరసం' మొదలైనవి తెలంగాణ ఆవిర్భావానికి చేసిన కృషిని తమ సందేశాత్మక ప్రసంగంలో తెలిపారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ తెలంగాణను దశాబ్ద కాలంగా పాలించిన ప్రభుత్వం గత కాలమే మేలు వచ్చు కాలం కంటెన్ అనే రీతిగా వ్యవహరించిందన్నారు. ప్రస్తుతం వచ్చిన కొత్త ప్రభుత్వం మంచి గతమున కొంచమేనోయి అన్న మాటను రుజువు చేసే విధంగా పరిపాలించాలన్నారు. ప్రజల పక్షం వహిస్తూ కవిత్వం రాయాలని అరసం ఉపాధ్యక్షులు నిధి అన్నారు. ఈ కార్యక్రమానికి పల్లేరు వీరస్వామి అధ్యక్షత వహించారు. కవి సమ్మేళనంలో కవులు, రచయితలు డాక్టర్ నాగేశ్వరం శంకరం, కన్నం లక్ష్మీ నారాయణ, సుతారపు వెంకటనారాయణ, ఎస్.విజయభాస్కర్, జి. చంద్రమోహన్‌గౌడ్, బొమ్మగాని నాగభూషణం, నాంపల్లి శ్రీనివాస్, కందుకూరి శ్రీరాములు, ఎస్.జగన్‌రెడ్డి, బెల్లంకొండ సంపత్ కుమార్, నిధి, వద్దిరాజు ప్రవీణ్ కుమార్, బూర బిక్షపతి, వేముల నారాయణ పాల్గొన్నారు.

## సెక్రటేరియట్‌లో వాస్తు మార్పులు !



**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో వాస్తు మార్పులు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఆరవ అంతస్తు నుంచి తొమ్మిదో అంతస్తుకు మార్పు చేస్తున్నట్లు సమాచారం. తొమ్మిదో అంతస్తులో ముఖ్యమంత్రి కార్యాలయానికి అవసరమైన అన్ని ఏర్పాట్లకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు సెక్రటేరియట్ ప్రధాన ద్వారం నుంచి లోపలికి వచ్చిన ముఖ్యమంత్రి కాన్వాయ్ ఇక నుండి పశ్చిమ ద్వారం నుంచి లోపలికి వచ్చి ఈశాన్య ద్వారం గుండా బయటకు వెళ్లనున్నది. ఆగ్నేయ ద్వారం నుంచి ఐఎఎస్, ఐపిఎస్, ఇతర ఉన్నతాధికారుల రాకపోకలు కొనసాగుతాయని భద్రతా అధికారులు అంటున్నారు. సచివాలయం లోపల మరి కొన్ని మార్పులు, చేర్పులను కూడా ప్రభుత్వం చేయిస్తున్నది.

## ప్రెజర్ బాంబ్ పేలి వ్యక్తి మృతి

కొంగల గుట్టలో పేలిన బాంబు

పోలీసులను టార్గెట్ చేసిన మావోయిస్టులు





**ప్రజాపక్షం / వాజేడు:** మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని కొంగాల అటవీ ప్రాంతంలో పోలీసులను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. వాజేడు మండలం జగన్నాదపురం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఇల్లందుల ఏసు(55), ఇల్లందుల రమేష్, ఇల్లందుల ఫకీర్, పాల్గుణ, అరికిల్ల లక్ష్మ య్యలు వంట చెరుకు తెచ్చుకోవడం కోసం కొంగాల అటవీ ప్రాంతానికి ఉదయం 6 గంటల సమయంలో వెళ్ళారు. గుట్ట ఎక్కుతూ వెళ్తున్న సమయంలో దారిలో అమర్చిన బాంబు పేలి ఇల్లందుల ఏసు(55) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా నలుగురికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రెజర్ బాంబు పేలడంతో శబ్దానికి దూరంగా పరుగెత్తారు. కొంగాల గుట్టపై ప్రెషన్ బాంబు పేలడంతో చుట్టు ప్రక్కల గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇది తెలుసుకున్న మృతుడి బంధువులు సంఘటన ప్రాంతానికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లేందుకు నిరాకరించడంతో బంధువుల సహాయంతో మృతదేహాన్ని గుట్టపై నుండి క్రిందికి దించారు. అనంతరం జగన్నాధపురం గ్రామానికి తరలించడంతో అక్కడి నుండి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన ఇల్లందుల ఏసు భార్య గతంలో అనారోగ్యంతో మృతి చెందింది. ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. ఈ ముగ్గురికి వివాహం జరిగినట్లు బంధువులు తెలిపారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు విలపించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆర్‌టిసికి రూ.20 కోట్ల కుచ్చుటోపీ కేసులు దర్యాప్తు ముమ్మరం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రకటనల పేరుతో ఆర్‌టిసికి రూ.20 కోట్ల కుచ్చుటోపి పెట్టిన ఉదంతంపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. జూబ్లీబస్ స్టేషన్‌లో చోటుచేసుకున్న ఈ కుంభకోణానికి సంబంధించిన పూర్తి వివరాలను సిసిఎస్ పోలీసులు ఆర్‌టిసి అధికారుల నుంచి సేకరించారు. కుచ్చుటోపి పెట్టిన 'గో రూరల్ ఇండియా' అనే యాడ్ ఏజెన్సీని నిర్వహిస్తున్న దంపతులు చెబ్రోలు మృదుల, సునీల్‌ల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వారి బ్యాంక్ ఖాతాల వివరాలపై కూడా పోలీసులు కన్నేశారు. గో రూరల్ ఇండియా పేరుపై ఏపీ బ్యాంక్‌లో అకౌంట్లు ఉన్నాయి, వాటిలో ఏపీ ఏజెన్సీవారు ఎంతెంత డబ్బులకు చెక్‌లను వేశారు అనే అంశాలపై దృష్టి పెట్టారు. జూబ్లీ బస్ స్టేషన్‌లోని అన్ని బస్సులపై ప్రకటనల టెండర్‌ను దక్కించుకున్న ఈ సంస్థ ఆయా వ్యాపార వాణిజ్య సంస్థల నుంచి ప్రకటనలు సేకరించి బస్సులపై ప్రకటనలు వేశారు. ఆయా సంస్థల నుంచి గో రూరల్ ఇండియా సంస్థ ఎంత డబ్బు వసూలు చేశారు, ఆ డబ్బును ఏం చేశారు అనే అంశాలపై కూడా ఆరా తీస్తున్నారు. గో రూరల్ ఇండియా కార్యాలయంపై కూడా పోలీసులు సోదాలు నిర్వహించారు. పలు కీలక డాక్యుమెంట్లు సైతం స్వాధీనం చేసుకున్నారు. అభించిన డాక్యుమెంట్ల ఆధారంగా సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు. బస్సులపై ప్రకనటలు ఇచ్చిన ఏజెన్సీల నిర్వాహకులను కూడా విచారించే అవకాశాలు ఉన్నాయి. ఆర్‌టిసికి కుచ్చుటోపి పెట్టిన గో రూరల్ ఇండియా సంస్థ నిర్వాహకుల వెనుక ఎవరైనా రాజకీయ నేతల హస్తం కూడా ఉందా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.త్వరలో ఈ కేసును చేధిస్తామని సిసిఎస్ పోలీసులు ధీమా వ్యక్త పరిచారు.

## బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నించే గొంతుక

1969 ఉద్యమానికి, మలిదశ ఉద్యమానికి విజయాన్ని అందించింది సిద్దిపేటనే...

కెసిఆర్ లేకుంటే తెలంగాణ లేదు: మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు




**ప్రజాపక్షం / సిద్దిపేట ప్రతినిధి:** సిద్దిపేట 1969 ఉద్యమానికి, మలిదశ ఉద్యమానికి విజయాన్ని అందించిందని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా పొన్నాలలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బిఆర్ఎస్ జెండా, జాతీయ జెండాను ఆవిష్కరించి, రక్తదాన శిబిరాన్ని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు రాష్ట్ర ప్రజలకు పండుగని తెలిపారు. సిద్దిపేట లేకుంటే కేసీఆర్ లేడని కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రానికి అత్యంత అవసరమని,బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నించే గొంతుక అన్నారు.కేసీఆర్ లేకపోతే తెలంగాణ సోయిని ఖతం చేస్తారని అన్నారు. తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌లో కలుపాలని ఆంధ్ర నాయకులు అంటున్నారని మండి పడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కాపాడాలంటే కేసీఆర్ శ్రీరామ రక్ష అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పత్రిక ప్రకటనలో జై తెలంగాణ పదం లేదని మండి పడ్డారు. తెలంగాణ హక్కులు కాపాడే పార్టీ బిఆర్ఎస్ అన్నారు. రేవంత్ రెడ్డి ఏనాడూ జై తెలంగాణ అనలేదని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ఎప్పటికి తెలంగాణ ఉద్యమకారుడు కాలేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఉద్యమ ద్రోహి అవుతాడు తప్ప ఉద్యమ కారుడు కాడని నిప్పులు చెరిగారు. ఉద్యమం కోసం ఎన్నిసార్లు అయినా తాము జైలుకి వెళ్ళామన్నారు. కొన్ని దశాబ్దాల పోరాటం వల్లనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రం కళను నిజం చేసింది బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా మూడవ రోజు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో అవతరణ వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. ఉద్యమంలో సిద్దిపేట మట్టి బిడ్డలు రాష్ట్ర స్థాయిలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో రామలింగారెడ్డి, నందిని సిధారెడ్డి, రమణచారి, దేశపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్, దేవి ప్రసాద్‌ల సేవలు మరువలేనివి, వారిని గుర్తుంచుకోవడం మన కర్తవ్యం అన్నారు. ఉద్యమంలో నిస్వార్థంగా సేవ చేసిన వారిని గుర్తుంచుకోవడం నిజమైన పండుగన్నారు. తెలంగాణ ఉద్యమం చాలా సార్లు విఫలమైందని, ఉద్యమానికి కేసీఆర్‌కి సిద్దిపేట మట్టి బిడ్డలు కుడి భుజంగా నిలిచారన్నారు.అనంతరం ఉద్యమ కారులను సన్మానించారు. సందర్భంగా దేశపతి శ్రీనివాస్ ఉద్యమం జరిగిన తీరును తన పాటలతో వివరించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్, రసమయి బాలకిషన్, ఎంఎల్‌సి యాదవరెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజా శర్మ, ఎర్రోళ్ల శ్రీనివాస్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, కరీంనగర్ జెడ్పి మాజీ చైర్మన్ తుల ఉమ, నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, సంపత్‌రెడ్డి, పాల సాయిరాం, కత్తి కార్తీక, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'గ్రూప్-1హాల్ టికెట్'పై ఫొటో తప్పనిసరి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** టిపిఎస్‌సి గ్రూప్1 ప్రిలిమినరీ రాతపరీక్షలో హాల్ టికెట్‌పైన ఫోటో తప్పని సరిగా అతికించాలని టిఎస్‌పిఎస్‌సి స్పష్టం చేసింది. మూడు నెలల క్రితం నుంచి ఇప్పటి వరకు దిగిన పాస్ ఫొటో అతికించాలని నిబంధన విధించింది. ఈ మేరకు టిపిఎస్‌సి సోమవారం వెల్లడించింది. హాల్ టికెట్ పైన ఫోటో లేని అభ్యర్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించబోమని, ఈ నిబంధనను హాల్ టికెట్‌లో పొందుపరిచినట్లు టిపిఎస్‌సి అధికారులు తెలిపారు. కాగా ఫొటో కింద సంతకం చేసేందుకు తప్పనిసరిగా స్పేస్‌ను పెట్టాలని సూచించింది. అయితే హాల్ టికెట్‌తో పాటు పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడి,ఆధార్ కార్డు, గవర్నమెంట్ ఎంప్లాయ్ గుర్తింపు కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఏదైనా ఒరిజినల్ కార్డును పరీక్షా కేంద్రం వద్ద చూపిస్తేనే లోపలికి అనుమతిస్తారు. ఈ నెల 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓఎంఆర్ విధానంలో జరిగే రాత పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే హాల్ టికెట్లను విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పది గంటలు దాడితే పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తామని , ఆ తర్వాత ఎవరినీ లోపలికి అనుమతించబోమని ఇది వరకే స్పష్టం చేసింది.

## రుతుపవనాల ప్రవేశంతో అప్రమత్తం

జిల్లా కలెక్టర్లకు, అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలో ప్రవేశించి నాలుగు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్ని జిల్లాలకు సరఫరా చేసిన పచ్చరొట్ట, పత్తి విత్తనాల ప్యాకెట్ల అమ్మకాలకు సంబంధించి రైతులకు ఏలాంటి ఇబ్బందులు రా కుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నాటికి 84,43,474 పత్తి విత్తనాల ప్యాకెట్లు సరఫరా కాగా, ఇప్పటికే 25,10,430 పత్తి విత్తనాల ప్యాకెట్లు రైతులు కొనుగోలు చేశారని అధికారులు మంత్రికి వివరించారు. కంపెనీల వారీగా సరఫరా సమీక్షించి, ప్రణాళిక మేరకు రా ష్ట్రానికి సరఫరా చేయాల్సిన పత్తి ప్యాకెట్లను కూడా రైతులకు ఈ మూడు రోజులలో అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పచ్చిరొట్ట విత్తనాలు గత ఏడాది జూన్ 3వ తేదీ నాటికి 37,959 క్వింటాళ్లు రైతులు కొనుగోలు చేయగా, ఈ సంవత్సరం ఇప్పటికే 97,109 క్వింటాళ్లు అందుబాటులో ఉంచగా, రైతులు 84,412 క్వింటాళ్లు పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేశారని అధికారులు తెలిపారు. ప్రభుత్వం సరఫరా చే యల్సిన విత్తనాలను ఈ 45 రోజుల్లో రైతులకు అం దుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామన్నా రు. కొన్ని ప్రాంతాలలో పచ్చిరొట్ట విత్తనాలును ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసి పక్కరాష్ట్రాలకు తరలిస్తున్నట్లు ప్రభుత్వ దృష్టి కి వచ్చిందని, మన రాష్ట్ర రైతు ప్రయోజనాలను పణంగా పెట్టి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి ఆదేశించారు. అనుమతి లేకుండా పత్తి విత్తనాల ప్యాకెట్లు విక్రయిస్తున్న 33 మందిపై కేసులు పెట్టి రూ.2 కోట్ల విలువ గల 118.29 క్వింటాళ్ళ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారని, బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారని ఇద్ద రు డీలర్లపై కేసులు నమోదు చేశామని అధికారులు మంత్రికి వివరించారు. ప్రత్తి విత్తనాలు మార్కెట్లలో అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయని, రైతులందరూ అధికృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, మాయ మాటలు చె ప్పే ప్రైవెట్ వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

ప్రజాపక్షం

మంగళవారం, జూన్ 04

# ఎగ్జిట్ పోల్స్–స్టాక్ మార్కెట్ జోరు

18వ సార్వత్రిక ఎన్నికల వేడి తగ్గుదలతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లో తొలకరిజల్లుల పలకరింపులతో సూర్యతాపం తగ్గి వాతావరణం ఒకింత చల్లబడి ఉపశమనం ప్రాప్తింపజేసింది. ఉత్తరాదిలో మొన్న 1వ తేదీ వరకూ జరిగిన పోటా పోటీ పోలింగ్ వలే భానుడు చంద్రనిప్పులు కురిపిస్తున్నాడు. ఆందోళనకరంగా పదులసంఖ్యలో వడగాడ్పుల మరణాలు సంభవిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ నీటి ఎద్దడితో అల్లాడుతున్నది. ఇదంతా పర్యావరణ మార్పులవల్ల సంభవిస్తున్న ఉత్పాతం. పార్టీలు ఎన్నికలపట్ల చూపే పోటీతత్వంలో, ఉత్సాహంలో కొంతైనా పర్యావరణం, భూ వాతావరణం పరిరక్షణపట్ల చూపించకపోతే మున్ముందు ఉపద్రవాలు పెరుగుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దాదాపు రెండు నెలలపాటు మండుటెండల్లో ఉష్ణతాపాన్ని మించిన వాడివేడి వాగ్బాణాలతో సాగిన పరస్పర నిందాపూర్వక ఎన్నికల ప్రచారం, ఏడు దశల్లో పోలింగ్ ముగిసింది. రాజకీయపార్టీల వచ్చే ఐదేళ్ళ భవితవ్యాన్ని నిర్దేశించిన ఓటర్ల తీర్పు ఈ రోజు (మంగళవారం) వెల్లడికానున్నది. ఓట్ల లెక్కింపు ఘడియలకోసం ఆసేతు హిమాచలం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నది. ఈలోపు ముందస్తు రుచి (అరుచి)లాగా వివిధ మీడియా సంస్థలు ఎగ్జిట్‌పోల్ ఫలితాలు ప్రకటించాయి. పశ్చిమదేశాల్లో వారం వారం ఒపీనియన్ పోల్స్ ప్రకటిస్తుంటారు. దాని కాపీగా మనదేశంలో ఎన్నికల జోస్యులు (సెఫాలజిస్టులు) – ఓటువేసి తిరిగివెళ్ళే జనాల్లో కొందరిని ఏ పార్టీకి వారు ఓటువేశారో వాకబుచేసి అవన్నీ క్రోడీకరించి, శాతాలు కట్టి ఎగ్జిట్‌పోల్ ఫలితాలు తయారు చేస్తుంటారు. పోలింగ్ దశలు ముగిసేవరకూ ప్రచురించరాదన్న ఎన్నికల కమిషన్ ఆంక్షతో చివరిదశ పోలింగ్ ముగియగానే వారు హుటాహుటిన టి.వి. ఛానళ్ళలో తమ చిట్టీ విప్పుతారు. కొన్ని గణాంకాలు అసలు ఫలితాలకు బారెడు దూరంగా, కొన్ని దరిదాపుల్లో ఉండటాన్ని మనం చూస్తుంటాం. దరిదాపుల్లో ఉన్న టివి ఛానల్ తమదే రైట్ అంటూ బాకా ఊదుతూ ఉంటుంది. యూరప్‌లో దేశాలు చిన్నవి కావటం, విద్యాధికులైన ఓటర్లు తమ అభిప్రాయాన్ని నిర్భయంగా చెప్పటంవల్ల అక్కడ సెఫాలజిస్టుల అంచనాలు దాదాపు సరిగ్గానే ఉంటాయి. అయితే మనది కుల,మత ప్రభావాలు, ప్రాంతం, వెనుకబాటుతనం, అవిద్య, పేదరికం, పెత్తందారుల దౌర్జన్యాలు వంటి రుగ్మతలతో కూడిన సువిశాల దేశం అయినందున ఓటర్లు వెలిబుచ్చే అభిప్రాయంలో దాపరికాలు, వ్యత్యాసాలు ఉండటం సహజం. అందువల్ల మన జోస్యులు దారితప్పుతుంటారు. అయినా కాలక్రమంలో ఎగ్జిట్‌పోల్స్ కాలక్షేపపు బఠానీలుగా కాకుండా బెట్టింగ్‌లు కట్టి కొంపలు కూల్చుకునేస్థాయికి చేరాయి. ఇందుకు స్టాక్ మార్కెట్ తోడుకావడం విచారకరం. ఎన్‌డిఎ కూటమి పెద్ద మెజారిటీతో అధికారం నిలబెట్టుకోబోతున్నదని, నరేంద్రమోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రి పీఠం అలంకరించబోతున్నారనీ అత్యధిక ఎగ్జిట్‌పోల్స్ బాకా బజాయించగానే, మదుపుదారుల్లో ఉత్సాహానికి సంకేతంగా సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త రికార్డులవైపు పరుగులు తీశాయి. 30–షేర్ సెన్సెక్స్ 2000 పాయింట్లుపైగా, 50 స్టాక్ నిఫ్టీ 800 పాయింట్లు పైగా దూసుకెళ్లాయి. దీంతో ముంబయి స్టాక్ ఎక్ఛేంజీ స్టాక్, మార్కెట్ విలువకు రూ.12.48 లక్షలకోట్ల సంపద పెరిగింది. అసలు ఫలితాలనుబట్టి ఇవి హెచ్చుతగ్గుల కుదుపులకు గురవుతాయి. ఈమధ్యలో అశకుపోయి పెట్టుబడులు పెట్టినవారిలో కొందరు ఖుషీతో విందులు చేసుకోగా తొలిసారి చేయపెట్టిన అత్యధికులు లబోదిబోమంటారు. పెట్టుబడిదారీవ్యవస్థలో స్టాక్ మార్కెట్ అతిపెద్ద చట్టబద్ధమైన జూదం అని మరచిపోరాదు. అయితే జాతీయ ప్రధాన టి వి ఛానళ్ళలో అత్యధికం గుత్తపెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళి వారి ఆదేశానుసారం మోదీ భజన చేస్తున్నందున, వాటి ఎగ్జిట్‌పోల్స్ నిజాయితీ ప్రశ్నార్థకమవుతున్నది. ఇదిలావుండగా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కింలలో పాలకపార్టీలు తిరిగి అధికారంలోకి వచ్చాయి. ఆదివారంనాడు జరిగిన ఓట్ల లెక్కింపుల్లో 60 సీట్లున్న అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో 46 సీట్లతో బిజెపి అధికారం నిలుపుకుంది. కాగా సిక్కింలో పాలక సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కెఎం) అసెంబ్లీలోని 32 సీట్లతో 31 సీట్లు గెలుచుకుని విజయభేరి మోగించింది. ఎన్నికలముందు వరకూ ఎస్‌కెఎం ఎన్‌డిఎలో భాగస్వామి. భారత భూభాగంలో సున్నితమైన ప్రాంతాలలోని రాష్ట్రాలలో అస్థిరతకు తావులేకుండా భారీ ఏకపక్ష మెజారిటీతో ప్రభుత్వాలను ఎన్నుకున్న అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం ఓటర్లకు అభినందనలు.

# కాంగ్రెస్‌పైనే గురుతర బాధ్యత!

ఈసారి సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఇప్పటికే వచ్చేశాయి. కానీ, ఎగ్జిట్ పోల్స్‌ను ఎంత వరకు నమ్మవచ్చన్నది ప్రశ్న. మంగళవారం (జూన్ 4) ఉదయం కౌంటింగ్ ప్రారంభం కానుండగా, రాత్రిలోగా పూర్తి ఫలితాలు తెలిసే అవకాశం ఉంది. ఏ పార్టీ లేదా కూటమి అధికారంలోకి వచ్చినా, సామాజిక సంస్కరణల అజెండాను కొనసాగించాల్సిన గురుతర బాధ్యత కాంగ్రెస్‌పై ఉందనేది వాస్తవం. ఈ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి గెలిస్తే, మిగతా భాగస్వామ్య పార్టీలతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడానికి చర్యలు ప్రారంభించాలి. ఒకవేళ ఓటమిపాలైతే, అదే అజెండాను కొనసాగించేందుకు, ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదాలో బాధ్యతలు తీసుకోవాలి. ఎన్‌డిఎ తిరిగి అధికారంలోకి వస్తే, ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లను తొలగిస్తామని బిజెపి ఇప్పటికే ప్రకటించింది. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టుకొని, పోరాటాలకు దిగాలి. ఇప్పటికే జరిగిన అనర్థాలను తోడూగా, రాబోయే కాలంలో చోటు చేసుకోబోయే విపరీత పరిణామాలకు ఇదొక ఉదాహరణ మాత్రమే. కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకుంటే, ముస్లిం రిజర్వేషన్లను కొనసాగించాలి. నిరుద్యోగ యువతను మభ్యపెడుతూ, వారికి తాత్కాలిక అవకాశం కల్పించే 'అగ్నివీర్' పథకాన్ని తక్షణమే రద్దు చేయాలి. దేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. భారత రాజ్యాంగం అట్టడుగు కులాలకు ఇచ్చిన సామాజిక భద్రతకు ఎటువంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. లౌకిక విధానాన్ని రాజ్యాంగం నుంచి ఎవరూ భవిష్యత్తులో తొలగించకుండా పటిష్టమైన సవరణలు తీసుకురావాలి. దేశంలో సుమారు 90 శాతం ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు వివిధ రంగాల్లో ప్రాధాన్యత దాదాపు శూన్యంగా ఉంది. ఈవిషయాన్ని 'పంచకుల సమ్మేళన్'లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తావించారు. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే, ఈ అంశంపైన కాంగ్రెస్ దృష్టి కేంద్రీకరించాలి. అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలి. భారత రాజకీయ వ్యవస్థ కింది కులాలకు వ్యతిరేకంగా ఉందని నిజాన్ని గ్రహించి, సముచిత ప్రాధాన్యం కల్పించాలి. ప్రగతిశీల ప్రజాస్వామిక, సామ్యవాద వ్యవస్థను పునరుద్ధరించాలి. కార్పొరేట్ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా, బిజెపి సర్కారు గత పదేళ్ల కాలంలో సామాన్యులకు చేసిన అన్యాయాలను సరిదిద్దాలి. సంపద పూర్తిగా కేంద్రీకృతమైనందువల్ల, ధనిక, పేద వర్గాల మధ్య వ్యత్యాసం అంతులేనంతగా పెరుగుతున్నది. ఈ సమస్యను అధిగమించే క్రమంలో సంపద వికేంద్రీకరణపైన లేదా సంపద పునఃపంపిణీ దిశగా అడుగులు వేయాలి. సుమారు పదేళ్ల కాలంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2014 ఎన్నికల సమయంలో బిజెపి హామీ ఇచ్చింది. రైతు సంక్షేమమే తమ లక్ష్యమని ఘనంగా ప్రకటించుకుంది. 2023లోగా చెప్పిన వన్నీ చేసిచూపుతామంటూ అరచేతిలో వైకుంఠం చూపించింది. కానీ, ఈ పదేళ్ల కాలంలో రైతుల బతుకులు మరింతగా దిగజారాయి. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌పై ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేర లేదు. పైగా, వ్యవసాయ రంగాన్ని కూడా పూర్తిగా కార్పొరేట్ వర్గాలకు అప్పచెప్పే రీతిలో, మూడు వివాదాస్పద సాగు చట్టాలను తీసుకొచ్చింది.



ఈ నల్ల చట్టాలను నిరసిస్తూ, 2020 నవంబర్ 26న ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు ప్రారంభించిన ఆందోళన సుమారు సంవత్సరం పాటు కొనసాగింది. సుమారు 800 మంది రైతుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. అయినప్పటికీ, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో సుమారు 40 రైతు సంఘాలు నిరసనను కొనసాగించాయి. మరోవైపు న్యాయ పోరాటం కూడా ఆరంభించాయి. వివాదాస్పద వ్యవసాయ చట్టాలను తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ అమలు చేయవద్దని సుప్రీం కోర్టు ఆదేశించడంతో, కేంద్రంలోని మోదీ సర్కారు ఇరుకున పడింది. 2022లో గోవా, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు వచ్చిపడ్డాయి. అదే సమయంలో, రైతుల ఆందోళనకు దేశ వ్యాప్తంగా మద్దతు పెరిగింది. నిరసనలు, ర్యాలీలు, ధర్నాలతో పలు రాష్ట్రాలు హోరెత్తిపోయాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో, వివాదాస్పద నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తూ బిజెపి సర్కారు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టింది. ఆగమేఘాలపై అది ఆమోదం పొందేసుకుంది. అయినప్పటికీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను, అజెండాను అనుసరిస్తున్న మోదీ సర్కారును రైతులు నమ్మలేదు. ఆందోళన విరమించలేదు. చివరికి లిఖితపూర్వక హామీతో తాత్కాలికంగా ఆ ఆందోళనకు తెరదించింది. ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పిస్తామని, ఆందోళన సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని, పంట బీమా పథకాన్ని అమలు చేస్తామని, రుణమాఫీ చేస్తామని నమ్మబలికింది. కానీ, వీటిలో ఏ ఒక్క హామీ నెరవేరలేదు. ఎంఎస్‌పి చట్టబద్ధతకు అంశంపై ఏర్పాటు చేసిన కమిటీ ఏమైందో ఎవరికీ తెలియదు. రైతు సమస్యలకు పరిష్కారం లభించలేదు. ఇటీవలే రైతులు మలిదశ పోరాటాన్ని ప్రారంభించారు. 'ఢిల్లీ మార్చ్' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఎక్కడికక్కడ అరెస్టులు, అణచివేతలు జరుగుతున్నప్పటికీ, పంజాబ్–హర్యానా సరిహద్దు వద్ద నిరసనను కొనసాగిస్తున్నారు. దేశానికి వెన్నుముకైన రైతులు రాజును చేస్తామని ప్రకటించిన మోదీ ప్రభుత్వం, వారిని బికారులను చేసుతన్నది. రైతు సమస్యల పరిష్కార భారం కూడా కాంగ్రెస్‌పై ఉంది. 'ఇండియా' కూటమి గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, తక్షణమే చేపట్టాల్సిన అంశాల్లో రైతుల డిమాండ్లు, పరిష్కారాలు కూడా ఉండాలి. ఇక నిరుద్యోగులపై బిజెపి వరాల జల్లు కురిపించింది. ఆచరణలో మొండిచేయి చూపింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల ఊసు లేదు. నిరుద్యోగ భృతి జాడ లేదు. కాంగ్రెస్ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన పనుల్లో ఉపాధి కల్పన ఒకటి. మోదీ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దే బాధ్యత కాంగ్రెస్‌పైనే పడుతుంది. కార్మికులకు జరుగుతున్న అన్యాయం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న హక్కులను, చట్టాలను మోదీ సర్కారు రద్దు చేయడం దుర్మార్గం. వాటి స్థానంలో తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను దేశంలోని అన్ని కార్మిక సంఘాలు, సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. అదే విధంగా కొత్తగా ప్రవేశపెట్టిన పిఎఫ్ విధానంపైన కూడా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. 'ఇండియా' అధికారంలోకి వచ్చిన వెంటనే, లేబర్ కోడ్‌ల రద్దు, పాత పిఎఫ్ విధానం అమలు వంటి చర్యలు చేపట్టాలి. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను అనేక రాష్ట్రాలు తిరస్కరిస్తున్నాయి. దీని రద్దు దిశగా అడుగులు అవసరం. కనీసం సిఎఎను పునఃసమీక్షించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకంగానీ, రాజ్యాంగంపై గౌరవంగానీ లేని బిజెపి ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై దేశాన్ని నవ్వులపాలు చేసింది. భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘన పెరుగుతున్నదని అమెరికాసహా పలు దేశాలు విమర్శిస్తున్న విషయం తెలిసిందే. కులాలు, మతాలు, ప్రాంతాల వారీగా దేశాన్ని ముక్కలు చేయడానికి మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల దుష్ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. ఆకలి కేకల సూచీలో దేశ పరిస్థితి అధ్వాన్నంగా మారింది. దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చడమే లక్ష్యమని పలువురు బిజెపి నాయకులు అనేక సందర్భాల్లో తేల్చిచెప్పారు. ఆ ప్రమాదం నుంచి దేశాన్ని రక్షించాలి. మత పునాదులపై ఏర్పడిన పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో చూస్తునే ఉన్నాం. విదేశీ వ్యవహారాల అంశంలోనూ భారత్ తీరు మారాలి. ఒంటెద్దు పోకడలు ఎవరికీ మంచిది కాదు. దేశ భవిష్యత్తును నిర్దేశించే విద్యార్థుల పట్ల కూడా మోదీ ప్రభుత్వం అనుచితంగా వ్యవహరిస్తున్నది. పాఠ్యాంశాల్లోనూ కాలం చెల్లిన సిద్ధాంతాలను, మత విద్వేషాన్ని రెచ్చగొట్టే అంశాలను చేరుస్తున్నదని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ ఫలితం లేకపోతున్నది. డార్విన్ ప్రతిపాదించిన 'జీవ పరిణామ సిద్ధాంతం' సైతం ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల నుంచి మాయమైందంటే, విద్యార్థులకు ఎలాంటి తిరోగమన విధానాలను నేర్పడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయో ఊహించుకోవచ్చు. పలు పార్టీలు చేస్తున్న ఆరోపణలను ఒకసారి సింహావలోకనం చేసుకుంటే, బిజెపి వైఖరి ఏమిటో బోధపడుతుంది. దేశాన్ని ఎలాంటి దారుల్లో నడిపేందుకు ప్రయత్నిస్తున్నదో అవగతమవుతుంది. గత పదేళ్ల కాలంలో మోదీ సర్కారు తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలను మార్చాల్సిన అవసరం ఉంది. అవసరమైతే కొన్ని చట్టాలను రద్దు చేయక తప్పదు. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే, ఈ దిద్దుబాటు చర్యలను కాంగ్రెస్ ప్రారంభించాలి. సమ సమాజ నిర్మాణానికి అనుకూలంగా ప్రణాళికలు అమలు చేయాలి. అన్ని రకాల సమస్యలపై చర్చలు జరపాలి. సమీక్షించుకోవాలి. సమష్టి నిర్ణయాలు అమలు చేయాలి. కూటమిలోని అన్ని పార్టీలకూ ఇతోధిక ప్రాధాన్యం ఇచ్చి, ఒకే తాటిపై నడిపించాలి. ఒకవేళ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు నిజమై, మరోసారి బిజెపి నేతృత్వంలో ఎన్‌డిఎ సర్కారు ఏర్పడినా, కాంగ్రెస్ బాధ్యతల్లో మార్పు ఉండదు. అధికారంలో ఉంటే, ప్రజల డిమాండ్లను అమలు చేయడానికి, బిజెపి అస్తవ్యస్తంగా మార్చిన వ్యవస్థలను చక్కదిద్దడానికి చర్యలు తీసుకోవాలి. అధికారం చేతిలో ఉంటుంది కాబట్టి, వెంటనే వాటిని అమలు చేయాలి. ఒకవేళ ఎన్‌డిఎ హ్యాట్రిక్ విజయం సాధిస్తే, ప్రధాన ప్రతిపక్ష హోదాలో ప్రజల గొంతుకను వినిపించాలి. భాగస్వామ్య పార్టీలతో కలిసి ప్రజా ఉద్యమాలు నిర్మించాలి. ప్రభుత్వం దిగి వచ్చేవరకూ ఉద్యమాలను ఉధృతం చేయాలి. సాగు చట్టాలను రద్దు చేయించుకోవడంలో రైతులు చూపిన పోరాటస్ఫూర్తిని మార్గదర్శకంగా తీసుకొని, ముందడుగు వేయాలి. సారాంశాన్ని సూక్ష్మంగా చెప్పాలంటే, సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తే, ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి. ఓటమిపాలై, ప్రతిపక్షంగా ఉండాల్సి వచ్చినా, అన్ని వర్గాలకు న్యాయం చేయాలనే లక్ష్యాన్ని సాధించేందుకు, ప్రజల తరపున పోరాటాలు చేయాలి. ఏ రకంగా చూసినా, మిగతా అన్ని పార్టీల కంటే కాంగ్రెస్‌పైనే బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయి. సామాన్యుల అంచనాలు కూడా ఆ పార్టీపైనే ఉండడంలో ఆశ్చర్యం లేదు.

**బిఎల్**

# పోరాట యోధుడు.. తెలంగాణ మార్గదర్శకుడు 'రావి'

## జూన్ 4న 117వ జయంతి

తెలంగాణ సాయుధ పోరాట రథసారథి, స్వాతంత్ర సమరయోధులు, భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ బిరుదాంకితులు కామ్రేడ్ రావి నారాయణరెడ్డి 117 జయంతి సందర్భంగా జాతీయోద్యమ నాయకున్ని స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించుదాం. రావి నారాయణరెడ్డి నల్లగొండ జిల్లా భువనగిరి సమీపంలోని బోల్లేపల్లిలో 1908 జూన్ 4న జన్మించారు.



హైదరాబాద్ సంస్థానం నిజాం రాచరిక పాలనలో కొనసాగుతుండే రోజులు, వారి పాలనలో జమీందారుల, జాగిర్దారుల, దొరల, దేశముఖుల, సర్ఫే ఖాస్ క్రింద 90శాతం భూములు ఉండేది. 10శాతం భూములు మాత్రమే మధ్య, చిన్న, సన్నకారు, పేద రైతుల కింద ఉండేది. అంటే 90 శాతం ప్రజలు సొంతంగా భూమి లేని వారి అన్న మాట. జనాభాలో నూటికి 91 మంది నిరక్షరాస్యులు. గ్రామాలలోని వివిధ వృత్తుల వాళ్లు, వృత్తుల వారిగా దొరల, జమీందారులకు వెట్టి చాకిరి చేసే విధానం ఉండేది. రాజకీయాలు పార్టీలు, ప్రజా కార్మిక సంఘాలు, నిషేధం. హైదరాబాద్ రెడ్డి హాస్టల్‌లో విద్యార్థిగా ఉన్నా రావినారాయన్‌రెడ్డి, స్వాతంత్ర ఉద్యమంలో గాంధిజీ ఆలోచన విధానం, వారిచ్చిన శాసనోల్లంగా పిలుపు, ఉప్పు సత్యాగ్రహం, హరిజనొద్ధరణకు ఎంతో ఉత్తేజితుడై రాజకీయాల్లో అడుగుపెట్టాడు. దేశవ్యాప్తంగా శాసనోల్లంఘనోద్యమంలో భాగంగా జరుగుతున్నఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనాలన్న కుతూహలం కలిగి, రెడ్డి హాస్టల్ నుండే కాకినాడ సత్యాగ్రహానికి రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి పాల్గొన్నారు. గ్రామ గ్రామం తిరుగుతూ సత్యాగ్రహాలు 'కల్లు మానం డోయ్, కండ్లు తెర వండోయ్', మాకొద్దీ తెల్ల దొరతనం ' అనే పాటలు పాడుతూ మద్య దుకాణాలు, విదేశీ వస్తువుల షాపుల ముందు పికటింగులు చేశారు. గాంధీజీతో కలిసి హరిజన సేవా సంఘానికి నిధులు వసూలు చేసి దళితుల కోసం 100 పాఠశాలలు, రెండు వసతి గృహాలు ఏర్పాటు చేశారు. ఖాదీ వస్త్రాల ఉత్పత్తి కేంద్రాలను స్వగ్రామంలో ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ సత్యాగ్రహ ఉద్యమంలో తెలంగాణ నుండి జైలుకు వెళ్లిన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందారు. నెహ్రూజీ సోషలిస్ట్ భావాలతో మొదలై 1939 నాటికి కమ్యూనిస్టు అయ్యారు. హైదరాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక సభ్యునిగా గ్రామాలలో ఆ పార్టీకి పునాదులు వేశారు. 1940లో బద్దం ఎల్లారెడ్డితో కలిసి కిసాన్ సభ ఏర్పాటు చేశారు. దీని నిజాం ప్రభుత్వం నిషేధించింది. అయితే ఆంధ్ర మహాసభలు చేరి రైతు కూలీల సమస్యలపై పోరాటాలు సాగించారు. 1941లో ఆంధ్ర మహాసభకు అధ్యక్షుడిగా ఎన్నికైన రావి నారాయణరెడ్డి మొదటిసారిగా భూస్వామి వ్యవస్థను, వెట్టి చాకిరి విధానాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని పెట్టి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 1944 లో భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహిస్తూ అక్రమంగా భూస్వాముల కింద ఉన్న భూములను ఆక్రమించి పంచాలని, పెట్టి చాకిరి విధానం రద్దు, 'దున్నేవారికి భూమి' కావాలని రైతు కూలి సంఘాలు ఏర్పాటు చేసి పేద రైతు కూలీలు చైతన్యం చేయాలని పిలుపునిచ్చిన మహానేత రావి నారాయణరెడ్డి. 1946–48మధ్యలో భూస్వాముల ఆగడాలు విపరీతంగా పెరిగిపోవడం వారికి రజాకారు నిజాం సైన్యం అండగా ఉండటంతో వారి ఆగడాలు ఎదిరించి తిప్పికొట్టాలని, గ్రామ రక్షక దళాలు ఏర్పాటు చేసి.. పేద ప్రజలకు అండగా ఉండాలని, రజాకార్ల గుండాయిసాన్ని ఎదిరించటానికి సాయుదులై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

> 'వారి తండ్రి ద్వారా వచ్చిన భూమిలో 500 ఎకరాల భూములను పేదలకు పంచి ఆదర్శప్రాయుడిగా నిలిచారు. ఇదే 1951లో భూదానోద్యమానికి నాంది పలికింది.'

దీనితో ఆంధ్ర మహాసభ, రైతు కూలీల సంఘాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూములను, భూస్వాముల కింది భూములను వారి దౌర్జన్యాలను అడ్డుకొంటూ వేల గ్రామాలలో భూరక్షక పోరాటాల దళాలు ఏర్పడినవి. వందల, వేల గ్రామాలలో వేల ఎకరాల భూములు పంచటం జరిగింది. అందులో భాగంగానే వారి తండ్రి ద్వారా వచ్చిన భూమిలో 500 ఎకరాల భూములను పేదలకు పంచి ఆదర్శప్రాయుడిగా నిలిచారు. ఇదే 1951లో భూదానోద్యమానికి నాంది పలికింది. ఆ తరువాత భూ సంస్కరణలకు, కౌదారీల రక్షణ చట్టానికి శ్రీకారం చుట్టింది. కమ్యూనిస్టు పార్టీ నిషేధం ఉన్నందున 1951వరకు అజ్ఞాతంలో ఉన్న రావినీ అరెస్టు చేసింది. 1952–57లో నల్లగొండ నుండి లోకసభ సభ్యులుగా,1957–62 లో భువనగిరి శాసనసభ సభ్యులుగాను, తిరిగి 1962–66వరకు లోకసభ సభ్యునిగా ఉండి ప్రజా సమస్యలపై గలమెత్తారు. భారత దేశ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం గుర్తింపు తెచ్చిన చరిత్రలో ఇదొక రికార్డు. వారు తన 60వ ఏటా స్వచ్ఛందంగా క్రియాశీలక బాధ్యతల నుండి తప్పుకున్నారు. అయితే పార్టీ ఆహ్వానించే కార్యక్రమాల్లో పాల్గొంటుండేవారు. కేంద్ర ప్రభుత్వం రావిని స్వాతంత్ర సమరయోధుల గుర్తింపు కొరకు ఏర్పాటుచేసిన స్క్రీనింగ్ కమిటీకి సభ్యులుగా నియమించింది. తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్వాతంత్ర పోరాటంలో భాగంగానే గుర్తించాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పెన్షన్‌లు మంజూరు చేయించారు. ఆ పోరాటంలో పాల్గొన్న వేలాది మందికి పైగా పెన్షన్లు మంజూరు చేసింది. వారి సేవలకు గుర్తింపుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం1978లో కళా ప్రపూర్ణ బిరుదు ప్రదానం చేసిసత్కరించింది. ఆయన జీవిత విశేషాలపై తెలుగు విశ్వవిద్యాలయం ఒక డాక్యుమెంటరీ చిత్రము రూపొందించింది. ఆర్ ఎన్ 'నా అనుభవాలు జ్ఞాపకాలు'అనే గ్రంథంలో ఆనాటి సాంఘిక ఆర్థిక పరిస్థితులతో పాటు అనేక పోరాట ఘట్టాలను వివరించారు. 1991 సెప్టెంబర్ 7న ఆయన మన నుండి దూరమైనారు. వారు కోరుకున్న చిరకాల వాంఛైనా తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఏర్పాటు చేసి.. ఎంతోమంది స్వాతంత్ర సమర యోధులచే నిధులను సమకూర్చారు. వారి కోరిక మేరకు బంజారాహిల్స్ లోటస్ పాండ్‌లో శాశ్వత భవనాన్ని' ఆర్‌ఎన్ అడిటోరియం పేరుతో నిర్మించి కార్యక్రమాలు నడుస్తున్నాయి.

# దళితుల అభివృద్ధికి కేటాయింపులు సరే.. ఖర్చు ఏది!

గుర్రం రాంమోహన్‌రెడ్డి
7981018644

రాష్ట్ర బడ్జెట్లో షెడ్యూల్ కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి వారి అభివృద్ధికి ఖర్చు చేసే వ్యవస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోనే ఏర్పాటు అయ్యింది. ఎస్సీల ప్రత్యేక అభివృద్ధి నిధికి కేటాయించిన నిధులు 54 శాఖలు ఖర్చు చేయాల్సి వుంటుంది. దళితుల ప్రగతికోసం ఒక సంవత్సరం ఖర్చు చేయని నిధులు మరసిటి సంవత్సరం ఖర్చు చేయాలన్న యోచన పాలకుల్లో సన్నగిల్లింది. ఒక వైపు నిధులు కేటాయించి ఖర్చు చేయకపోవడం, మరో వంక కేటాయించిన నిధులను ప్రభుత్వాలు ఇతర పథకాలకు దారి మళ్ళించడం పరిపాటు అయ్యింది. గడిచిన దాదాపు 10 ఎళ్ళ కాలంలో నిధుల ఖర్చును పరి శీలిస్తే దిగ్భ్రాంతి కలుగుతుంది. ఎస్.సి. కులాల అభివృద్ధి శాఖతో పాటు మరో 42 ప్రభుత్వ శాఖలకు కేటాయింపులు జరుగుతాయి. 20142015 నుంచి 2022 2023 ఆర్థిక సంవత్సరాలను పరిశీలిస్తే ఎన్ని నిధులు కేటాయించారు. ఎంత ఖర్చు చేశారో విశిదమౌతుంది. ఎస్.సి. కులాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి క్రింద ఒక లక్ష 41 వేల 160.37 వేల కోట్లు కేటాయించగా 78.008.27 కోట్లు అంటే 55 శాతం మాత్రమే ఖర్చు చేశారు. ఖర్చు చేయకుండా రూ.63,152.10 కొట్లు గత ప్రభుత్వంలో 7,579.15 కేటాయించగా, విడుదల చేసింది మాత్రం 3,235.16 కోట్లు కాగా ఖర్చు చేసింది 2,936.19 కోట్లు. 201516 సంవత్సరంగాను 8,089.24 కోట్లు కేటాయించగా, విడుదల చేసింది. 4,380.80 ఖర్చు చేసింది. 4,682.48 ఖర్చు చేయని మొత్తం 3,408.76 కోట్లు. 201617 సంవత్సరంలో 10,483.96 కోట్లుగా విడుదల చేసింది. 5,257.61 కోట్లు కాగా ఖర్చు చేయని మొత్తం 5,226.35 కోట్లు ఎంత చిత్త శుద్ధి వుందో అర్థం అవుతుంది. 201718 సంవత్సరంలో 14,375.13 కోట్లు కాగా విడుదల చేసింది. 9,990.22 కోట్లు, ఖర్చు యేయని మొత్తం 4,384.91 కోట్లు అంటే ధళితుల పట్ల ఎంత నిబద్ధత ఉందో స్పష్టం అవుతుంది. 2018–19 సంవత్సరంగాను 16,452.79 కోట్లు కాగా, విడుదల చేసింది. 11,077.26 ఖర్చు చేసింది. 10,989.18 కోట్లు ఖర్చు చేయాలి మొత్తం 5,463.61 కోట్లు. 201920 సంవత్సరంలో 12,400.22 కోట్లు కాగా, విడుదల చేసింది 13,778.88, ఖర్చు చేసింది 10,744.79 కాగా, ఖర్చు చేయని మొత్తం 1655.43 కోట్లు అంటే దళితుల అభివృద్ధి పట్ల ఎంత ప్రేమ ఉందో తెలుస్తుంది. 2020–21 సంవత్సరంలో 16,534.97 కాగా, విడుదల చేసింది. 10,223.99, ఖర్చు చేసింది. 11,474.80 కోట్లు, ఖర్చు చేయని మొత్తం 5,060.17 కోట్లు, 202122 సంవత్సరంలో 21,306.85 కోట్లు కాగా, విడుదల చేసింది. 19,180.60 కోట్లు, ఖర్చు చేయని మొత్తం 5,629.17 కోట్లు 202223 సంవత్సరంలో 33,937.76 కోట్లు కాగా విడుదల చేసింది. 26,817.75 కోట్లు, ఖర్చు చేసింది 6,225.25 కోట్లు ఖర్చు చేయని మొత్తం 27,712.01 కోట్లు అంటే దళితుల అభివృద్ధి అంటే ఎందుకింత వివక్షత అనన ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. కేటాయింపులు, విడుదల చేయడం తప్ప ఖర్చు చేసే విషయంలో గత ప్రభుత్వం దళితుల వర్గాలపట్ల ఎంత నిబద్ధత ఉందో తేటతెల్లం అవుతుంది. తెలంగాణ ఎస్.సి. అభివృద్ధి శాఖకు 2014 2023 వరకు 37,781.16 బడ్జెట్లో నిధులు కేటాయించగా ఖర్చు చేసింది మాత్రం 16,458.41 కోట్లు మాత్రమే అంటే 21,322.75 కోట్లు ఖర్చు చేయని దుస్థితి దాపురించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో దళితులు తీవ్ర అలక్ష్యానికి గురయ్యారని పుంకాను పుంఖాలుగా ప్రకటనలు కురిపించిన గత ప్రభుత్వం సబ్లిన్ నిధులు, ఎస్.సి. అభివృద్ధి శాఖ నిదులను పూర్తి స్థాయిలో ఎందుకు ఖర్చు చేయలేదని ఆ వర్గాలు గట్టిగా ప్రశ్నిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 54.9 లక్షల మంది అంటే మొత్తం రాష్ట్ర జనాభాలో 15.45 శాతం మంది దళితులు ఉంటే, వారి జీవన ప్రమాణలు స్థితి గతులు మార్చేందుకు నిధలు ఖర్చు చేయడంలో గత ప్రభుత్వంకు ఎంత సంకల్పం ఉందో ఇట్టే తెలుస్తుంది. గడిచిన ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం చేయకుండ దళితుల అభివృద్ధి కోసం పూర్తి స్థాయి నిధులు ఖర్చు చేసి ఔదర్యాన్ని చాటాల్సిన నైతిక బాధ్యత ఉంది.

# కార్పొరేట్ శక్తుల నుంచి విత్తనాలను కాపాడుకోవాలి

ఈసారి వ్యవసాయ సీజన్ ముందస్తుగానే ప్రారంభమైంది. ఇప్పటికే వర్షాలు పడటంతో రైతులు దుక్కులు తయారు చేసుకుని విత్తనాల వెతుకులాటలో పడ్డారు.ఈ ఖరీఫ్ సీజన్లో 1.60 కోట్ల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగవుతాయనీ, ఇందులో వరి 65 లక్షల ఎకరాలు, పత్తి తదితర పంటలు 60.53 లక్షల ఎకరాల్లో సాగవుతాయనీ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. వీటికి వరి విత్తనాలు 16.50 లక్షల క్వింటాళ్లు, పత్తి విత్తనాలు 54 వేల క్వింటాళ్లు, మొక్కజొన్నలు 48 వేల క్వింటాళ్లు అవ సరం అవుతాయని అంచనా. రైతాంగానికి విత్తన కొరత రాకుండా చూస్తామని ప్రభుత్వము ప్రకటిస్తున్నప్పటికీ నిర్దిష్టమైన విత్తన సరఫరా ప్రణాళికేదీ వారి వద్ద లేదు.రాష్ట్రంలో ప్రైవేటు కంపెనీలు విచ్చలవిడిగా నకిలీ విత్తనాలను మార్కెట్లో ప్రవేశపెట్టి రైతాంగానికి అంట కడుతున్నారు.లాభాపేక్షే లక్ష్యంగా పనిచేసే ప్రైవేట్ విత్తన సంస్థల ప్రచార ఉచ్చులో పడి వారి పుచ్చు విత్తనాలతో ప్రతి సంవత్సరం రైతులు తీవ్రంగా నష్టపోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అనేక జిల్లాల్లో విత్తనాల దుకాణాలపై విజిలెన్స్ దాడులు జరిగి కేసులు నమోదు చేస్తున్న వార్తలు కూడా వస్తున్నాయి. ఇదంతా కూడా గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలు ఏరుకోవడం లాంటిదే.విత్తనాల మీద పెత్తనమంతా ప్రైవేటు శక్తులకు కట్టబెట్టి, వాళ్ళను నకిలీ విత్తనాలు సరఫరా చేయకుండా కట్టడి చేస్తామనటం జరిగే పనికాదు.

నకిలీ విత్తనాల వలన పైర్లకు అనేక రకాల చీడపీడలు, చెప్పలేని కొత్త కొత్త వైరస్ లు సోకి పంట చేతికి రాని స్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పత్తి, మిర్చి తదితర వాణిజ్య పంటలను సాగుచేస్తున్న రైతులు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి నకిలీ విత్తనాల వలన చీడపీడల బారిన పడి కోలుకోకుండా నష్టపోయి బతుకు భరోసా లేని స్థితిలో ఆత్మహత్యల బారిన పడుతున్నారు. ప్రతి సంవత్సరం ఇదే తంతు రొటీన్ గా జరుగుతున్నా తగిన విత్తన ప్రణాళికను రూపొందించి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించటంలో పాలకులు విఫలమవుతున్నారు.

వ్యవసాయంలో విత్తనాల సేకరణ అత్యంత ప్రధానమైనది.కానీ ఈనాడు విత్తనాలు రైతుల చేతుల్లోనుండి బహుళ జాతి సంస్థల చేతుల్లోకి వెళ్ళాయి. భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసిఎఆర్)ఎంతో కృషిచేసి సాధించిన విత్తనాభివృద్ధి టెక్నాలజీని కూడా ప్రైవేట్ కంపెనీలు కాపీ కొట్టి లాభాలు దండుకొంటున్నాయి. దేశంలో మొత్తం ప్రైవేట్ విత్తన కంపెనీలు 540 ఉండగా వాటిలో 80 మాత్రమే విత్తన పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాలలను కలిగి ఉన్నాయని పార్లమెంటరీ స్థాయి సంఘం నివేదికలో వెల్లడించింది.ప్రభుత్వ సంస్థల విత్తనాలనే ఉత్పత్తి చేసి తమ బ్రాండ్లతో విడుదల చేస్తున్న ఈ ప్రైవేట్ కంపెనీల విత్తనాలే 2020 నాటికి మొత్తం విక్రయంలో 64.46 శాతానికి చేరాయి.నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత 1991 నుండి విత్తన పరిశ్రమలోకి 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రభుత్వం అనుమతిస్తున్నది.దీనితో విత్తనాలపై బహుళజాతి కంపనీల గుత్తాదిపత్యం పెరిగిపోయింది. ఫలితంగా విత్తన ఉత్పత్తిలో ప్రైవేట్, కార్పొరేట్ శక్తులు ఆధిపత్యం సంపాదించి 70 శాతానికి పైగా విత్తనాలను వారే సరఫరా చేస్తున్న దుస్థితి ఏర్పడింది. పురుగు మందుల మార్కెట్ కూడా కార్పొరేట్ శక్తుల చేతుల్లోనే వున్నందున వారి లాభాల కోసం నకిలీ విత్తనాల తయారీ అనివార్య మవుతుంది. రైతాంగం నష్టాల్లో, కష్టాల్లో కూరుకుపోవడానికి ఇది ప్రధాన కారణంగా పనిచేస్తున్నది.

ఇది చాలదన్నట్లు ఇటీవల కాలంలో అమెరికన్ కార్పొరేట్ శక్తుల అవసరాలకు అనుగుణంగా మన వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను అనుసంధానం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు చేస్తుంది. అమెరికాతో కలిసి ఏర్పాటుచేసిన నాలెడ్జి ఇనిషియేటివ్ ఆన్ అగ్రికల్చర్(Knowledge Initiative on Agricultureకెఐఎ) వ్యవసాయ పరిశోధన విస్తరణ సేవల్లో సహాయం చేస్తుందని చెపుతున్నారు. వాస్తవానికి భారత వ్యవసాయ పరిశోధనా మండలి కింద (ఐసిఎఆర్) అనేక కేంద్ర సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, ఇతర సంస్థలు వున్నాయి. 7వేల మందికి పైగా శాస్త్ర వేత్తలు, 40వేల మందికి పైగా విస్తరణ సిబ్బంది ఉన్నారు.మన శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బందితో అమెరికా వ్యవసాయ వాణిజ్య సంస్థలు సంబంధాలు పెట్టుకునేందుకు కెఐఎను ఒక సాధనంగా వాడుకుంటున్నాయి. ఈ సంస్థను పర్యవేక్షణ చేసేందుకు ఏర్పాటు చేసిన పాలకమండలిలో అమెరికాలోని బడా వ్యవసాయ వాణిజ్య కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. అమెరికా వైపు నుండి ఉన్న ఎనిమిది మంది సభ్యుల్లో మోన్ శాంటో, వాల్ మార్ట్ లాంటి బహుల జాతి సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారంటేనే ఈ సంస్థ లక్ష్యం ఏమిటో అవగతం అవుతుంది. 1969 నుండి ప్రభుత్వ పరిశోధనా సంస్థలే వివిధ పంటలకు సంబంధించిన 5700 రకాల విత్తనాలను విడుదల చేశాయి.క్రమంగా ప్రభుత్వాలు దానిని నిర్వీర్యపరిచి, ప్రైవేటు విత్తన కంపెనీలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకొంటూ వచ్చారు. విత్తన రంగాన్ని మొత్తంగా దేశ విదేశీ ప్రైవేట్ శక్తులకు అప్పగించేశారు. నేడు ,దేశంలో విత్తన రంగాన్ని వారే శాసిస్తున్నారు.పంట చేలో పోగొట్టుకొని వంటింట్లో వెతికితే పరిష్కారం లభించదు. కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాల నుండి మన విత్తనాలను రక్షించుకోవాలంటే విత్తన రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పూర్తిగా నిషేధించాలి. ఐ సి ఏ ఆర్ ను బలోపేతం చేసి వ్యవసాయానికి అవసరమైన అన్ని రకాల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వమే తయారుచేసి రైతాంగానికి సబ్సిడీపై అందించాలి. ఈ కనీస కర్తవ్యాన్ని పూర్తి చేయకుండా రైతులను ప్రైవేటు కంపెనీల దయాదాక్షిన్యాలకు వదిలేసి రైతే రాజని ఎంత జపం చేసినా అర్థం ఉండదు.

గౌని ఐలయ్య, 9490700955

# నేటితో ఉత్కంఠకు తెర

### తేలనున్న పార్లమెంటు అభ్యర్థుల భవితవ్యం
### పటిష్ట భద్రత మధ్య ఓట్ల లెక్కింపు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** సుదీర్ఘ కాలపు ఉత్కంఠకు నేటితో తెర పడనుంది. పోలింగ్ ముగిసి 20 రోజుల తర్వాత పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుంది. ఖమ్మం పార్లమెంటు ఓట్ల లెక్కింపు ఖమ్మం రూరల్ మండలం శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జరగనుండగా ఖమ్మం పార్లమెంటు పరిధిలో ఉన్న కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, మధిర, పాలేరు, ఖమ్మం శాసన సభ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు ఏడు లెక్కింపు గదుల్లో జరగనుండగా పోస్టల్ బ్యాలెట్ల కోసం ప్రత్యేకంగా ఒక గదిని ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలోని ఇల్లందు, పినపాక, భద్రాచలం ఓట్ల లెక్కింపు మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో జరగనుంది. ఖమ్మం లోక్‌సభకు గత నెల 13న జరిగిన ఎన్నికల్లో 75.19 శాతం పోలింగ్ నమోదైంది. బరిలో చాలా మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ పోటీ ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, బిఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, బిజెపి అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ల మధ్యనే ఉంటుంది. బిజెపి అభ్యర్థి వినోదరావుకు గెలిచే అవకాశం లేదు కాని గణనీయమైన ఓట్లు సాధించే అవకాశం ఉందని బిజెపి ఆశాభావంతో ఉంది. గెలుపోటములు కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మధ్యనే ఉన్న కాంగ్రెస్‌కే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి వామపక్షాల మద్దతు కూడా సంపూర్ణంగా లభించింది. బిఆర్‌ఎస్ శాసన సభ ఎన్నికల ఓటమి తర్వాత తిరిగి పుంజుకున్నట్లు కనిపించ లేదు. కొన్ని నియోజక వర్గాల్లో ప్రచారం స్థాయి కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఖమ్మం పార్లమెంటు ఫలితం పై అంతగా ఉత్కంఠ లేదన్న భావన వ్యక్తమవుతుంది. దాదాపు కాంగ్రెస్‌కే అవకాశం ఉండడంతో జిల్లాలోని వివిధ పార్టీల అభిమానులు ఆంధ్రప్రదేశ్ ఫలితాలపై చర్చ చేస్తున్నారు తప్ప ఖమ్మం పార్లమెంటు ఓట్ల లెక్కింపు గురించి అంతగా ఎవరు పట్టించుకోవడం లేదు. మొత్తం 1631039 మంది ఓటర్లు ఉండగా 1241135 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఓట్ల లెక్కింపు కొరకు ఒక్కో నియోజక వర్గానికి 14 చొప్పున ఏర్పాటు చేశారు. ఖమ్మం శాసన సభ పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉండడంతో 18 ఏర్పాటు చేశారు. 21 రౌండ్లలో మొత్తం ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది.

**లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట భద్రత**

పార్లమెంటు ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పటిష్టంగా మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 250 మంది పోలీసులను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ఏజెంట్లు, మీడియాకు ప్రత్యేకమైన పాసులు ఇచ్చి కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చేందుకు ప్రత్యేక గేట్లు ఏర్పాటు చేశారు. జిల్లా మొత్తం కోడ్ అమలులో ఉన్నందున 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. మద్యం దుకాణాలకు రేపు సెలవు దినంగా ప్రకటించారు.

## పాలిసెట్‌లో స్టేట్ ఫస్ట్ – సెకండ్ ర్యాంకులు సాధించిన 'జయ' విద్యార్థులు



**ప్రజాపక్షం/ సూర్యాపేట టౌన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024 జిల్లా కేంద్రంలోని జయ పాఠశాల విద్యార్థులు జె శ్రీనిక స్టేట్ 1వ ర్యాంకు, ఎం అభివర్ధన్ రెడ్డి రాష్ట్ర 2వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాఠశాలలో రాష్ట్ర ఫస్ట్, సెకండ్ ర్యాంకు సాధించిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జె శ్రీనిక ఎంబిపిసి విభాగంలో స్టేట్ 1వ ర్యాంకు, ఎంపిసి విభాగంలో స్టేట్ 3వ ర్యాంకు, ఎస్ అభివర్ధన్ రెడ్డి ఎంబిపిసి విభాగంలో స్టేట్ 2వ ర్యాంకు, ఎంపిసి విభాగంలో స్టేట్ 8వ ర్యాంకు, ఆర్ మోక్షజ్ఞ ఎంబిపిసి విభాగంలో స్టేట్ 17వ ర్యాంకు, ఎంపిసి విభాగంలో స్టేట్ 56 ర్యాంకు, ఎస్‌కె నేహా ఎంబిపిసి విభాగంలో స్టేట్ 49వ ర్యాంకు, ఎంపిసి విభాగంలో స్టేట్ 19వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో అందించిన అత్యుత్తమ బోధనతోనే విద్యార్థులు ఉన్నతమైన ర్యాంకులను సాధించారని తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పాలిసెట్ ఎంట్రన్స్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

**ప్రజాపక్షం/కోదాడ:** అంబేద్కర్ ఆశయ సాధన కోసం (కోదాడ) ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ పొందిన విద్యార్థులు పాలిసెట్ ఎంట్రన్స్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి సత్తాచాటారు. నూనె మణిదీప్ 117 మార్కులతో 29వ ర్యాంకు, గంధం ప్రశాంతి 108 మార్కులతో 617వ ర్యాంకు, కొంగర భవ్యశ్రీ 101 మార్కులతో 1011ర్యాంకు, గంజి రూపశ్రీ 93 మార్కులతో 1529, 10వేల లోపు 12 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులను ఆస్క్ వ్యవస్థాపకులు బల్గూరి దుర్గయ్య అధ్యక్షతన సన్మానించారు. ఈ సందర్భంగా ఆస్క్ అధ్యక్షురాలు బల్గూరి స్నేహదుర్గయ్య మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆస్క్ ప్రధాన కార్యదర్శి మాతంగి ప్రభాకర్‌రావు, అమరబోయిన వెంకటరత్నం, చేకూరి రమేష్, కోర్స్ కో ఆర్డినేటర్ గంధం బుచ్చారావు, చెరుకుపల్లి కిరణ్, శ్రీకాంత్, గంధం పండరిబాబు పాల్గొన్నారు.

## ఇవిఎం స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ పట్టణ సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఉన్న గోదాంలో నిర్వహించనున్న పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా, ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా పరిశీలకులు మనోజ్ కుమార్ మాణిక్ రావు సూర్యవంశీ అన్నారు. సోమవారం ఆయన దుప్పలపల్లి గోదాంలో పార్లమెంటు ఎన్నికల ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను, అలాగే కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను సూచించారు. ఓట్ల లెక్కింపుకు సంబంధించిన వివరాలను రౌండ్ల వారిగా మీడియాకు, ప్రజలకు తెలిసే విధంగా ముఖ్యమైన ప్రాంతాలలో పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలని చెప్పారు. వారి వెంట రిటర్నింగ్ అధికారి కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇతర జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు ఘనత సమాఖ్యదే



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** భారతదేశంలో మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిన ఘనత జాతీయ మహిళా సమాఖ్య దేనని, సిపిఐ పార్లమెంట్ సభ్యురాలు గీతాముఖర్జీ పార్లమెంట్ మహిళా బిల్లు ప్రవేశపెట్టారని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం నందు భారత జాతీయ మహిళా సమాఖ్య 70వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆమె సంఘ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భారతదేశంలో మహిళలకు ఒక సంఘం ఉండాలని అనాటి ప్రముఖ కమ్యూనిస్టు యోధులు స్థాపించిన సంఘమే ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్) అని సంఘానికి అనుబంధంగా తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించామన్నారు. తెలంగాణలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించామని, భవిష్యత్తులో కూడా మహిళలు ఎదుర్కొంటే అన్ని సమస్యలపై భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాళ్లు నాగలక్ష్మి,సత్యవతి,శ్రావణి,సైదమ్మ,అరుణ,ఆశాభీగం,లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## అంతరాలు లేని సమాజం కోసం నిరంతర పోరాటాలు నిర్వహించాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యూ 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయ ఆవరణలో మహిళా సమాఖ్య జెండాను మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ ఎగురవేశారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన సబిత, బండి జంగమ్మ మాట్లాడుతూ భారత జాతీయ మహిళా సమాఖ్య 70 సంవత్సరాలుగా మహిళల అభ్యున్నతికి అభివృద్ధికి సమానత్వానికి హింసలేని సమాజానికై అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. ఎంతోమంది త్యాగధనుల ఫలితంగా ఎన్నో విజయాలను సాధించిన ఘనత మహిళా సమాఖ్యదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, మహిళా అత్యాచారాల నిరోధక చట్టాలు, మహిళలకు ఉచిత విద్య, వైద్యం కోసం అంతరాలు లేని సమాజంకై నిరంతరం ఉద్యమాలను పోరాటాలను నిర్వహించాలని రాజ్యాంగ పరిరక్షణకై అనేక ఉద్యమాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కౌన్సిల్ సభ్యులు వడ్లకొండ భారతమ్మ, ఆరే పుష్ప, మద్దూరు భాగ్యమ్మ, మునుకుంట్ల నరసమ్మ, సరళ, జ్యోతి, మౌనిక, సౌమ్య, రాములమ్మ, స్వరూప, లక్ష్మి , సునీత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్‌లో జెడ్‌పి విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** సోమవారం వెలువడిన పాలిసెట్ ఫలితాలలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బెక్కం పవన్ రాష్ట్ర స్థాయిలో 149వ ర్యాంక్, అటెల్లి శృతి 1345వ ర్యాంక్, దువ్వ ప్రేమ్‌చంద్ 7291వ ర్యాంక్, కొర్ర నితిన్ 8437వ ర్యాంక్‌లను సాధించి ప్రతిభ చాటారు. ఈ విద్యార్థులకు 40 రోజుల పాటు జూమ్ ఫ్లాట్ ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇచ్చినట్లు గణిత ఉపాధ్యాయుడు కొలనుపాక శ్రీపతిరావు తెలిపారు. ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులందరికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం లభిస్తుందని ఆయన అన్నారు. ఉత్తమ ర్యాంక్ సాధించిన విద్యార్థులందరిని, వారికి శిక్షణ ఇచ్చిన గణిత ఉపాధ్యాయుడు శ్రీపతిరావులను ప్రధానోపాధ్యాయులు చేరుపల్లి శ్రీనివాసులు అభినందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు కొర్ర లోక్యానాయక్, గిరి లక్ష్మయ్య, సూర్య, సైదానాయక్, జగదీష్, జనార్ధన్‌రెడ్డి, సముద్రాల శ్రీనివాస్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గుర్తింపుపత్రం ఇచ్చేదెన్నడు?

### సింగరేణి యాజమాన్య నిర్లక్ష్యం
### ఎన్నికలు జరిగి ఐదు నెలలు
### గడిచినా అందని ధ్రువపత్రం

ONE FAMILY. ONE VISION. ONE MISSION — THE SINGARENI COLLIERIES COMPANY LIMITED



**ప్రజాపక్షం/కూసుమంచి :** తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద సంస్థగా ఉన్న సింగరేణి యాజమాన్య నిర్లక్ష్యం, సమస్యల పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న కార్మికులకు శాపంగా మారింది. సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం గుర్తింపు పొందిన సంఘానికి గుర్తింపు పత్రం ఇచ్చి ఏరియాల్లోను, రాష్ట్ర జాతీయ స్థాయిలోను బొగ్గు గని కార్మికుల సమస్యలపై చర్చించేందుకు యాజమాన్యం అవకాశం ఇవ్వడం ఎప్పటి నుంచో వస్తుంది. సింగరేణి సంస్థలో దాదాపు 46 వేల మంది కార్మికులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. 2023 డిసెంబరు 20న సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో గుర్తింపు సంఘం కోసం ఎన్నికలు నిర్వహించారు. ఎఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఈ ఎన్నికల్లో హోరాహోరీ తలపడ్డాయి. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) గుర్తింపు సంఘంగా ఎన్నికైంది. కాని ఈ ప్రక్రియ జరిగి ఐదు మాసాలు దాటినా ఇంత వరకు గుర్తింపు పత్రం ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం ససేమిరా అంటుంది. సింగరేణి యాజమాన్యం గుర్తింపు పత్రాన్ని ఎందుకు నిరాకరిస్తుందో అర్థం కాని పరిస్థితి. రాష్ట్ర రాజకీయ పరిస్థితుల్లో 2023 నవంబరులో జరిగిన ఎన్నికల్లో సిపిఐ, కాంగ్రెస్‌లు మిత్రపక్షాలుగా పోటీ చేశాయి. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లోను కాంగ్రెస్, సిపిఐ మిత్ర పక్షాలుగానే వ్యవహరించాయి. కాని గుర్తింపు పత్రం ఎందుకు ఇవ్వడం లేదన్నది అర్థం కాని ప్రశ్న. అంతకు ముందు జరిగిన ఎన్నికల్లో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం విజయం సాధించింది. రెండేళ్ల కాల పరిమితి అంటూ నాలుగేళ్ల గడిచినా అప్పటి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేసింది. ఇప్పుడు ఎన్నికలు జరిగి ఏఐటియుసి గెలిచి ఐదు నెలలైనా ఎందుకు గుర్తింపు పత్రం ఇవ్వడం కోసం ఎందుకు తాత్సర్యం చేస్తున్నారన్నది అర్థం కావడం లేదు. గుర్తింపు సంఘం కాలపరిమితి పై కార్మిక సంఘానికి, ప్రభుత్వానికి మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని అందుకే గుర్తింపు పత్రం ఇవ్వడం లేదన్న ప్రచారం జరుగుతుంది. గుర్తింపు సంఘం లేకపోవడం వల్ల కార్మికులు తమ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు సంఘానికి గెలుపు పత్రం అందజేసి సింగరేణి కార్మిక సమస్యల పరిష్కారానికి తోడ్పాటునందించాలని కార్మికులు కోరుతున్నారు.

## మహిళల స్వావలంబనే ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు లక్ష్యం

### మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలోని మహిళలందరూ అన్ని రంగాలలో స్వావలంబన సాగించేలా జాతీయ మహిళా సమాఖ్య కృషి చేస్తుందని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జాతీయ మహిళా సమాఖ్య 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ సమితి పిలుపు మేరకు ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జెండాను జిల్లా గౌరవ అధ్యక్షురాలు పశ్య పిచ్చమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవరం మల్లీశ్వరీ మాట్లాడుతూ మహిళా సమాఖ్య ఏర్పడిన నాటి నుండి అనేక ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా మహిళలకు ఎంతో మేలు చేసిందన్నారు. రాజ్యాంగంలో పొందపర్చిన మహిళల హక్కులు అందుబాటులోకి వచ్చేంత వరకు విశ్రమించకుండా పోరాడుతామన్నారు. మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందుబాటులోకి తెచ్చేందుకే పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకరావడంలో మహిళా సమాఖ్య కృషి మరువలేనిదన్నారు. నేటి నుండి జూన్ 5వ తేదీ వరకు మహిళా సమాఖ్య ఆవిర్భావ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు దేవరం సుజాత,సుందరి పద్మ,కంచర్ల పుష్పమ్మ,చెన్నగాని రామనర్సమ్మ,షేక్ జాన్‌బి,కుర్రి వీరమ్మ, పశ్య సుశీలమ్మ,షేక్ జాహ్నవి, వెంకటమ్మ,చెన్నగాని సావిత్రి,పశ్య మంగమ్మ, షేక్ ఫాతిమా,కుర్రి లింగమ్మ,శ్రావణి,మునగ లింగమ్మ, వీరమ్మ, వెంకమ్మ, జడ వెంకటమ్మ, మునగ మంగమ్మ, ఇందిరాల సంధ్య పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ ఎస్ వెంకట్రావ్



**ప్రజాపక్షం/ సూర్యాపేట కలెక్టరేట్:** నకిలీ విత్తనాలు విక్రయించిన, విత్తనాలు, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించిన కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంకలతో కలిసి వెబ్ ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ టీం విత్తనాల డీలర్ల షాపులపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. స్టేట్ బార్డర్ చెక్ పోస్టుల్లో పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని రెవెన్యూ డివిజన్ అధికారిని ఆదేశించారు. విత్తనాలు విక్రయించే సమయంలో రైతులకు రశీదులు ఇస్తున్నారా లేదా తనిఖీ బృందాలు పరిశీలించాలన్నారు. చెక్ పోస్టుల వద్ద నకిలీ విత్తనాలు సరఫరాపై నిఘా ఉంచాలన్నారు. జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే మాట్లాడుతూ గత సీజన్‌లో నకిలీ విత్తనాలు అమ్మిన వారిని విచారిస్తూ నిగా పెట్టాలని టాస్క్ ఫోర్స్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర చెక్ పోస్ట్, జిల్లా చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ అధికారులు, ఆర్‌డిఓలు, తహసీల్దార్‌లు, వ్యవసాయ శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

### కలెక్టర్ పమేలా సత్పతి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపుకు మంగళవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సారథ్యంలో యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 13న పార్లమెంటు ఎన్నికల పోలింగ్ జరిగింది. మొత్తం 28 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పార్లమెంటు పరిధిలో మొత్తం 17.97.150 మంది ఓటర్లు ఉండగా 13,03,630 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 72.54 శాతం మంది ఉండగా హోం ఓటింగ్ ద్వారా 1560 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సిబ్బంది 10,200 మంది ఉండగా 476 మంది ఓటు హక్కు వినియోగంచుకున్నారు. ఈ మేరకు ఎస్సారార్ కాలేజీలో ఓట్ల లెక్కింపుకు జిల్లా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనల మేరకు సర్వం సిద్ధం చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గీలకు వేర్వేరుగా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. మంగళవారం 8 గంటలకు వీరిని టేబుల్స్ వారీగా కేటయాయించనున్నారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. ఎనిమిదిన్నర గంటల నుంచి ఇవిఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల ఫలితాలను రౌండ్ల వారీగా ప్రకటించనున్నారు. ఈ మేరకు ఎప్పటికప్పుడు ఫలితాలను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయనున్నారు. కరీంనగర్‌లో సిపి అభిషేక్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. మంగళవారం 144 సెక్షన్ అమలు చేయనున్నారు. కౌంటింగ్ ముగిసే వరకు ఎస్సారార్ డిగ్రీ కాలేజీ ఎదుట ఉన్న రోడ్డుపై రాకపోకలకు అనుమతి లేదని తెలిపారు. ఈ మేరకు పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## ఎన్నికల ఫలితాలపై హై ఓల్టేజ్

### గెలుపు ఓటములపై తీవ్ర చర్చ
### ఏపి రిజల్ట్‌పై కోట్ల రూపాయల బెట్టింగ్

**ప్రజాపక్షం/భద్రాచలం :** దేశ వ్యాప్తంగా నేడు వెలువడ నున్న ఎన్నికల ఫలితాలపై హై ఓల్టేజ్ మొదలైంది. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ చైతన్యం గలది కావడంతో చిన్నల నుండి పెద్దల వరకు ఎవరి నోట విన్నా నేటి ఫలితాల మాటే వినిపిస్తోంది. తెలంగాణ లోక్‌సభ ఎన్నికల విషయంలో కాంగ్రెస్ అధిక సీట్లు దక్కించుకుంటుందనే వాదన తొలినాళ్ల నుండి వినిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ బిఆర్‌ఎస్ గ్రాఫ్ కొద్దిగా పెరిగినట్లు పలువురు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది మంది ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ వారే ఉండటంతో పాటు, పార్లమెంట్ స్థానాల పరిధిలో అసెంబ్లీ సీట్లు అన్ని కాంగ్రెస్ చేతిలో ఉండటం ఈ ఫలితాలు కలిసివస్తాయని అంతా భావిస్తున్నారు.

**ఏపి ఫలితాలపై :** ఏపి ఫలితాలపై తెలంగాణలో తీవ్ర చర్చ సాగుతోంది. స్వరాష్ట్రం ఫలితాల కంటే ప్రక్క రాష్ట్ర ఫలితాలపై ఇప్పుడు అంతా ఆసక్తి చూపుతున్నారు. ఇదిలా ఉండగా కోట్లాది రూపాయల బెట్టింగులు సాగుతున్నాయి. వైసిపి అధిక సీట్లు గెలుచుకుని మరో సారి అధికారం చేపట్టబోతోందని ఓ వర్గం, కూటమి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడుతుందని మరో వర్గం, దేశంలో మరోసారి నరేంద్రమోడి నాయకత్వంలో బిజెపి, రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని పందేలు కాస్తున్నారు. ప్రధానంగా సరిహద్దున ఉన్న భద్రాచలం, మదిర నియోజకవర్గాల పరిధిలో ఈ టెన్షన్ మరింత ఎక్కువగా ఉంది. గడిచిన రెండు రోజులుగా భద్రాచలం కేంద్రంగా భారీ మొత్తంలో బెట్టింగ్‌ల పర్వం సాగినట్లు పుకార్లు వస్తున్నాయి.

**సంబురాలకు సిద్ధం :** ఇటు తెలంగాణలోని పార్లమెంట్ ఫలితాలు, అటు ఏపిలోని అసెంబ్లీ ఫలితాలు, దేశవ్యాప్తం ఫలితాలపై సంబురాలు చేసుకునేందుకు ఆయా పార్టీలకు చెందిన అభిమానులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున బాణా సంచాలు తెచ్చి సిద్ధంగా పెట్టుకున్నారు. తమ పార్టీ గెలవాలంటే తమ పార్టీ గెలవాలంటూ చాలా మంది యాగాలు, పూజలు చేస్తున్నారు. నేడు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఫలితాలు వెలువడి జాతకాలు తేలనుండటంతో దేశ వ్యాప్తంగా కూడా హై టెన్షన్ నెలకొంది.

## నిర్వాహణపై అలసత్వమేల?



**ప్రజాపక్షం/నందికొండ :** అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లోని అందాలను తిలకించేందుకు ప్రపంచ నలుమూలల నుంచి పర్యటకులు వస్తుంటారు. అందులో ముఖ్యంగా బుద్ధ వనం గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. కోట్ల రూపాయలతో నిర్మించిన బుద్ధ వనం, దానికి అనుబంధంగా అధిక వ్యయంతో నిర్మించిన బుద్ధవనం రెస్టారెంట్, ఎసి విశ్రాంతి గృహాలను పర్యాటకులసౌకర్యార్థం గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. ఆ తరువాత టెండర్ ప్రక్రియ ద్వారా వాటిని సంబంధిత టెండరు దారునికి ఐదు సంవత్సరాల కాలపరిమితి వరకు లీజుకు ఇవ్వడం జరిగింది. దానిని సిద్ధార్థ రెస్టారెంట్ పేరుతో గత ఐదు సంవత్సరాల కాలం పాటు నిర్వహించారు అయితే లీజు కాలపరిమితి పూర్తయిన తర్వాత వీటి నిర్వహణలో నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. ఇలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటిపై తెలంగాణ టూరిజం అధికారుల పర్యవేక్షణ కరువైంది కోట్ల రూపాయలతో నిర్మించిన ఏసి విశ్రాంతి గృహాలు ఉపయోగంలో లేకపోవడం, నిర్వహణ బాధ్యతను మర్చిపోవడంతో కోట్ల రూపాయల నిధులు వృథాగా మారుతున్నాయి. గతంలో రెస్టారెంట్, విశ్రాంతి గృహాలు , సమావేశ మందిరాలు వాటి బాహ్య, పరిసర ప్రాంతాలు, గార్డెన్, పూల మొక్కలతో కళకళలాడిన ప్రాంతము నేడు ఉపయోగంలో లేక శిథిలావస్థకు చేరుకుని, దీనితో ఇది మందు బాబులకు మంచి అడ్డాగా మారింది. వీటి నిర్వహణ విషయంలో సంబంధిత పర్యాటకశాఖ అధికారుల అశ్రద్ధ, నిర్లక్ష్య ధోరణి అనేది ఎవరికీ అంతు పట్టడం లేదు. సాగర్‌కు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం రాత్రి సమయాలలో బస చేసేందుకు విశ్రాంతి గృహాలు, బోజన శాల అందుబాటులో ఉండాలని తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయడంలో చూపించిన శ్రద్ధ వీటి నిర్వహణ విషయంలో చూపించకపోవడం అందరినీ ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అయితే వీటి నిర్వహణ విషయంలో పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చేలా పాలకులు, సంబంధిత పర్యాటక అధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవడంలో దృష్టి సారించాలని స్థానికులు, ఔత్సాహికులు, విద్యావంతులు, పర్యాటకులు కోరుతున్నారు.

## మద్యంమత్తులో యువకుడిపై దాడి

**మృతి చెందిన యువకుడు నాగేంద్రబాబు**



**ప్రజాపక్షం/బోనకల్ :** మద్యం మత్తులో ఓ యువకునిపై మరో ఇద్దరు యువకులు విచక్షణారహితంగా కొట్టి, రాయితో దాడి చేశారు. మద్యం మత్తులో ఎక్కడ కొడుతున్నామో, ఎలా కొడుతున్నాము, ఎందుకు కొడుతున్నామో అనే విషయం తెలియకుండా ఎగిరే గిరి తన్నారు. ఈ దెబ్బలతో ఆ యువకుడు సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయితే సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పరిస్థితి విషమంగా ఉండటంతో నాగేంద్రబాబుని కారులో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి నాగేంద్రబాబు మృతి చెందాడని నిర్ధారించారు. అనంతరం బోనకల్ పోలీస్‌స్టేషన్‌లో సోదురుడు గోపి ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. విషయం తెలుసుకున్న వైరా ఎసిపి ఎం.ఎ.రెహమాన్, మధిర సిఐ మధు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి దాడి జరిగిన తీరు, కారణాలను ప్రత్యక్షసాక్షులను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**ఇటువంటి సంఘటనలు ప్రతిఒక్కరూ అడ్డుకోవాలి : ఎసిపి**


ఇటువంటి సంఘటనలు జరుగుతున్న సమయంలో ప్రతిఒక్కరూ ప్రతిఘటించి అడ్డుకోవాలని వైరా ఎసిపి ఎం.ఎ.రెహమాన్ అన్నారు. ఇటువంటి సంఘటన జరుగుతున్నప్పుడు సినిమా లాగా కొంతమంది చూడటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వ్యక్తి ప్రాణాలు పోయే విధంగా ఎవరైనా వ్యవహరించిన ఆ వ్యక్తిని కాపాడేందుకు అవసరమైతే దాడి చేస్తున్న వ్యక్తికి ప్రాణాపాయం కలగకుండా దండించవచ్చునన్నారు. ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు ఓ పౌరుడిగా ఎటువంటి చర్య తీసుకున్న తప్పు కాదన్నారు. అటువంటి సమయంలో ప్రాణం కాపాడటమే ప్రధానమన్నారు. ప్రతిపౌరుడు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

## కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, డిసిపి



**ప్రజాపక్షం/యాదాద్రి :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం భువనగిరి శివారులో ఉన్న అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సంబంధించి కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కే.జండగే, డిప్యూటీ పోలీస్ కమీషనర్ రాజేష్ చంద్రలు పరిశీలించారు. కళాశాలలో కౌంటింగ్ కేంద్రాల గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదులకే ప్రాధాన్యం



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి 11 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలిసు అధికారులకు పంపించారు. వాటిని పరిశీలించి బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదుల పురోగతిని తనకు తెలియజేయాలని ఎస్పి కిరణ్ ఖరే సూచించారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



**ప్రజాపక్షం/కొత్తగూడ:** నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే కఠిన చర్యలు తప్పవని తహాశీల్దార్ రమాదేవి, మండల వ్యవసాయ అధికారి జక్కుల ఉదయ్, ఎస్ఐ దీలిప్ లు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తనాల విక్రయ దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నిల్వ, అమ్మకాల రిజిష్టర్లు పరిశీలించారు. అనంతరం మట్లాడుతూ రైతులకు నిర్ణితమైన ధరతో అమ్మాలని అన్నారు. ఎవరైన నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తిసుకుంటామని హెచ్చరించారు.

## సామాజిక చైతన్యమే ప్రధాన కర్తవ్యం



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** కళాకారులకు సామాజిక చైతన్యమే ప్రధాన కర్తవ్యమని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహా అన్నారు. ప్రజా నాట్యమండలి వరంగల్ జిల్లా కమిటి సమావేశం సోమవారం ఉరుసుగుట్టు ఆఫీసులో జానీ అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో ప్రజా కళాకారులు నిత్యం ప్రజల కోసం పనిచేస్తారని ప్రజల చైతన్యమే వారికి పరమావదిగా ఉంటుందని తెలిపారు. ఈనాడు సమాజంలో కులతత్వం మతతత్వం ప్రాంతీయతత్వం అనేక మూఢనమ్మకాలకు గురి అవుతున్నారని అన్నారు. అందుకని కళాకారులు నిత్యం ఒక లక్ష్యంతో పనిచేయాలనుకున్నదు రాజకీయ చైతన్యం కూడా అవసరమని తెలిపారు. దానికోసమే ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో ఈనెల 7,8,9,10 తేదిలలో జరిగే రాజకీయ శిక్షణ శిబిరాలను జయప్రదం చేయాలని కోరారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు, యాదగిరి, ఉపాధ్యక్షులు వినోద్, జిల్లా కార్యదర్శి వలదాసు దుర్గయ్య, రాజేష్ ఖన్నా, జీవన్, లావణ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు రశీదు ఇవ్వాల్సిందే



**ప్రజాపక్షం/ మునిపల్లి :** రైతులు ,ఎరువులు ,విత్తనాలు, కొనుగోలు చేస్తే అందుకు సంబందించిన రశీదును తప్పని సరిగా ఇవ్వాలని ఫర్టిలైజర్ షాపుల డీలర్లకు రాయికోడ్ డివిజన్ ఏడిఏ సత్యనారాయణ సూచించారు. ఈ సందర్బంగా సోమవారం నాడు మండలంలోని బుదేరా చౌరస్తాలో గల ఫర్టిలైజర్ షాపులు ,విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం డీలర్లకు లైసెన్స్‌లు ,విత్తన నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తనాలు ,ఎరువులను అధిక ధరలకు అమ్మొద్దన్నారు. అమ్మినట్లు తమకు సమాచారం అంఇతే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఏఈఓ స్నేహ డీలర్లుపాల్గొన్నారు.

## జర్నలిస్టులకు సత్కారం



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా హన్మకొండ హంటర్ రోడ్‌లోని డికన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పలువురు జర్నలిస్టులను సత్కరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్,సీతక్క, ప్రొఫెసర్ కోదండరామ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి తోట సుధాకర్, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, వేముల సదానందం,ఎన్ఎస్ రావు,శోభన్,వెంకట్ తదితరులను సత్కరించారు.

## విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ రోజున ఏ పార్టీ గెలిచినా విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని ఎవరైనా అతి క్రమిస్తే వారిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసులు నమోదు చేయబడతాయని ఎస్ఐ కంకల సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ నేడు భువనగిరిలో నిర్వహించబడే ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉన్నందున 144 సెక్షన్ అమలు చేయబడటంతో పాటు ఎలాంటి ఊరేగింపులు సభలు సమావేశాలు నిర్వహించేందుకు అనుమతులు లేవు అని చెప్పారు.

## భూ వివాదం : దాడి కేసు నమోదు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** భూమి విషయంలో వివాదం జరగడంతో కేసు నమోదు చేసిన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పిల్లుట్ల గ్రామానికి చెందిన బోను మానెమ్మ భర్త రాములు, అదే గ్రామానికి చెందిన గుల్లయ్యగారి మధు తండ్రి కిష్టయ్య ఇద్దరు కలసి 20 ఏళ్ల నుంచి ఒక బావిని కొన్నారు.ఆ బావి అర ఎకరం ఉంటుంది. ఆ బావిని పూడ్చితే వ్యవసాయం చేసుకోవచ్చని 10 సంవత్సరాల క్రితం ఇద్దరు కలసి సగం వరకు పూడ్చి సగం వదిలేశారు. వర్షం పడినప్పుడల్లా ఆ గుంతలో నీరు నిల్వ ఉంటుందని ఈ నెల 1న మధును మానెమ్మ అడగగా మధు ఆగ్రహంతో కర్రతో కొట్టగా తీవ్ర గాయమైందన్నారు. ఈ విషయమై మానెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# నేతల గుండెల్లో రైళ్లు

### వరంగల్, భువనగిరి స్థానాలపై ఉత్కంఠ
### ఆ రెండింటిపై కాంగ్రెస్, బిజెపిల ప్రత్యేక గురి
### మంగళవారం మధ్యాహ్నం 12గంటలకల్లా తేలనున్న భవితవ్యం

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** లబ్..డబ్...లబ్..డబ్ అంటు నేతల నుండెల్లో రైళ్లు పరుగిడుతున్నాయి. పోలింగ్ ముగిసిన 22వ రోజు ఓట్ల లెక్కింపు జరుగుతుండడంతో ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ అటు పార్టీ నేతలు, ఇటు అభ్యర్థుల్లో నెలకొంది. గెలుపుపై ఎవరి ధీమా వారికి ఉన్నప్పటికీ లోపల మాత్రం వారిని భయం వెంటాడుతుంది. ప్రధానంగా వరంగల్, భువనగిరి స్థానాలకు కాంగ్రెస్, బిజెపిలు సవాల్‌గా తీసుకున్నారు. ఈ రెండు స్థానాల్లో ఎవరు గెలుస్తారన్న ఉత్కంఠ అభ్యర్థుల్లోనే కాకుండా అన్ని పార్టీల నాయకులు, రాజకీయ పరిశీలకుల్లోనే నెలకొంది. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ గత నెల 13న జరగగా ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుంది. వరంగల్ పార్లమెంట్ (ఎస్సీ) స్థానం ఓట్ల లెక్కింపు వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో జరగనుండగా భువనగిరి ఓట్ల లెక్కింపు ఆరోరా కళాశాలలలో జరగనుంది.ఓట్లలెక్కింపుసందర్భంగా అధికారులు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాలు ఉండగా నియోజకవర్గాల వారిగా 13 చొప్పున ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటలకే ఎన్నికల కౌంటింగ్ పరిశీలకుల సమయంలో తుది ర్యాండమైజేషన్ చేసి ఆయా కౌంటింగ్ కేంద్రాలకు కేటాయిస్తారు. బందోబస్తు సమస్య తలెత్తకుండా ఒకొక కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. లోట్ల లెక్కింపుకు 2500 మందికి పైగా సిబ్బందిని నియమించారు. వారికి పాస్‌లు జారీ చేశారు. పాస్‌లు ఉన్న వారినే లోపలికి అనుమతించనున్నారు. ఇలా పకడ్బందిగా కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది.

### అభ్యర్థుల్లో ఉత్కంఠ

వరంగల్, భువనగిరిలో అన్ని పార్టీల నుండి బలమైన నాయకులే బరిలో ఉన్నారు. వరంగల్ నుండి కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య కాంగ్రెస్ నుండి బరిలోకి దిగగా బిఆర్ఎస్ నుండి సుదీర్‌కుమార్, బిజెపి నుండి అరూరి రమేష్ బరిలో ఉన్నారు. అయితే కడియం కావ్య, అరూరి రమేష్ మద్యనే పోటీ నెలకొంది, బిఆర్ఎస్ ఓట్లు బిజెపికి డైవర్షన్ అయ్యాయన్న ప్రచారం జరుగుతుంది. వరంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు సునాయసమే అని ప్రచారం జరుగుతున్నా లోపల మాత్రం భయం ఉంది. ఇక్కడ ఎక్కువ ఓట్లు బిజెపికి పోలు కావడంతో చీలిన ఓట్లు బిజెపి అభ్యర్థికి అనుకూలంగా పోలైతే పరిస్థితి ఏంటన్న చర్చ జరుగుతుంది. ప్రస్తుతం కడియం కావ్యకు అనుకూల పరిస్థితులు ఉన్నా మంగళవారం ఉదయం 11 గంటల వరకు ఎవరు గెలుస్తారన్నది తేలిపోనుంది. ఇక భువనగిరిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచరుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బిజెపి నుండి మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్ బరిలో ఉన్నారు. ఇక్కడ కూడా బిఆర్ఎస్ ఓట్లు బిజెపి వైపు మళ్లినట్లు తెలుస్తుంది. ఇక నియోజకవర్గంలో రెండో బలమైన సామాజిక వర్గంగా ఉన్న గీతకార్మికుల ఓట్లు బూర నర్సయ్యకు పోలైనట్లు తెలుస్తుంది. గీత కార్మికుల ఓట్లు, బిఆర్ఎస్ ఓట్లలో బిజెపి అభ్యర్థి గట్టి పోటి ఇచ్చే అవకాశం ఉంది. అయితే పలు సర్వేలు మాత్రం వరంగల్, భువనగిరి బిజెపి గెలిచే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నాయి. స్థానికంగా మాత్రం సర్వేలకు విరుద్ద పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏదీ ఏమైనా ఇరు పార్టీల అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎవరు గెలిచినా పది నుండి, ఇరవై వేల ఓట్ల మెజార్టీతో గెలిచే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.



### ఇక ఉత్కంఠకు తెర

ఓట్ల లెక్కింపు రెండు, మూడు గంటలకు పూర్తయ్యే అవకాశం ఉన్నప్పటికీ ఎవరు గెలుస్తారన్నది మధ్యాహ్నం 12 గంటల వరకే తేలిపోనుంది. ఉదయం 7 గంటల కే ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా 22 నుండి 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి చేయనున్నారు. అయితే ఉదయం 10 గంటల వరకే ఆరేడు రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తి కానుండగా మధ్యాహ్నం 12 గంటల వరకు సగానికి పైగా ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. ఎవరు గెలుస్తారు.. ఓవరు ఓడిపోతారన్నది తేలిపోయే అవకాశం ఉంది. ఓట్ల లెక్కింపును రాజకీయ పార్టీలు, ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి.

### ఎవరి ఆశలు వారివి

ఇక తమ భవితవ్వం తేలిపోవడానికి కొద్ది గడియల సమయం మాత్రమే ఉంది. అభ్యర్థుల మధ్య ఉత్కంఠ నెలకొన్నా గెలుపుపై ఎవరి ఆశలు వారికి ఉన్నాయి. తామంటే తామే గెలుస్తామని పోలింగ్ సందర్భంగా ఆ తరువాత ప్రకటించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగానే వారి భవితవ్వం బయట పడనుంది. లోపల ఎవరికి వారు భయంతో ఉన్నా చివరి వరకు కొంత ఆశతోనే ఉన్నారు. 12 గంటల వరకు ఎవరు గెలుస్తారు...ఎవరికి ఎన్ని ఓట్లు పోలయ్యే అవకాశాలు ఉన్నాయని తేలిపోనుండడంతో అభ్యర్థుల భవితవ్వం కూడా తేలిపోనుంది. మరి ఎవరి ఆవలు ఫలిస్తాయో చూడాలి.

## గాలివానతో కరెంటు కష్టాలు

### నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
### అంధకారంలో మగ్గిన పల్లె గ్రామాలు



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించడంతో 33 కెవి లైన్ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీనితో కాళేశ్వరం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి రాత్రి వేళల్లో అంధకారం అలుముకుంది. భగభగ మండుతున్నఎండ తీవ్రత కారణంగా అసలే ఉక్కపోతతోసతమతమవుతున్న వినియోగదారులకు రాత్రి వేళల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో తెల్లవార్లు జాగరణ చేయాల్సి వచ్చింది. రాత్రంతా విద్యుత్ సరాఫరా నిలిచిపోయి. అంధకారం ఏర్పడటంతో చల్లదనానికి రహదారులపై విష సర్పాలు స్వైర విహారం చేసినట్లు పేర్కొన్నారు.ఆదివారం సాయంత్రం 5గంటల నుండి సోమవారం మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడగా, అనంతరం విద్యుత్ లైన్ పునరుద్ధరించడంతో వినియోగదారులు ఊపిరిపీల్చుకున్నారు.

## కౌంటింగ్ కేంద్రాలవద్ద మూడంచెల భద్రత

### ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** వరంగల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు నేడు (మంగళవారం) ప్రక్రియ ప్రారంభం కానుండడంతోవరంగల్ఎనుమాములమార్కెట్‌లో మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య తెలిపారు. సోమవారం వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్ యార్డులో జరగనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలను డిసిపి రవీందర్, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, సంధ్యారాణి, డిఆర్ఓ శ్రీనివాస్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో కలెక్టర్ ప్రావిణ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న అచరాత్మకమైన శిక్షణను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సిబ్బంది, పోలీస్ బందోబస్తు మొత్తం 2500మంది పోలింగ్ ప్రక్రియలో పాల్గొంటారన్నారు. ఏడు నియోజకవర్గాలకులెక్కింపుప్రక్రియజరుగనున్నందున ఏర్పాటు, సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జవర్లకు, ఆరో ఇంచార్జిలకు నియోజకవర్గం వారిగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించిన కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 4వ తేదిన ఉదయం 6గంటలకు ఎన్నికల కౌంటింగ్ పరిశీలకుల సమక్షంలో తుది ర్యాండమైజేషణ్ నిర్వహించి ఆయా కౌంటింగ్ నిర్వహించి ఆయా కౌంటింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయిస్తామన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని, గుర్తింపు కార్డులు లేని వ్యక్తులను గాని, సిబ్బందిని గాని ఎలాంటి పరిస్థితుల్లో కౌంటింగ్ సెంటర్‌లోనికి అనుమతించమని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ రౌండ్ వారిగా ఎన్‌కోర్‌లో ఫలితాలు అప్‌లోడ్ చేసేవిధంగా చర్యలు ఎన్ కోర్ సిబ్బందికి, ఐటి సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద 144వ సెక్షన్ : రూపేష్



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః** హెచ్ఓపి ఎన్నికల కౌటింగ్ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్స్ (గీతం యూనివర్సిటీ వద్ద జిల్లా పోలీసులు కేంద్ర బలగాలు మొత్తం 750 మంది పోలీసులతో మూడంచెల విదానంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. కౌటింగ్ వద్ద జిల్లా వ్యాప్తంగా నేటి ఉదయం 6 గంటల నుంచి బుద వారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ,మద్యం దుకాణాలు మూసిఉంచాలని ఆదేశించారు. నిబందనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జరీ చేసారు. నేడు ఉదయం 8 గంటల నుండి గీతం యూనివర్సిటీ రుద్రారం నందు లోక్ సభ ఎన్నికల కీలక ఘట్టం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుందని ఈ సందర్భంగా కౌటింగ్ వద్ద ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ట్రాపిక్ భద్రత పరమైన సమస్యలు తలెత్తకుండా ఆర్మడ్ రిజర్వ్ స్థానిక పోలీస్ బలగాలు 650 మందితో మూడంచెల విధానంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కౌటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను భద్రత పరమైన అంశాలను పరిశీలిస్తూ కౌటింగ్ బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కౌటింగ్ కేంద్రాల వద్దకు వచ్చే వారికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ఏరియాలలో వాహనాలను పార్కింగ్ చేసే విధంగా చూడాలన్నారు., మోబైల్స్ పోన్లు, అగ్గిపెట్టెలు ,భాణాసంచా ,లైటర్ వంటి నిషేదిత పేలుడు పదార్థాలు కౌటింగ్ కేంద్రాల వద్దకు తీసుకొని రాకుండా చూడాలన్నారు. కౌటింగ్ కేంద్రాల లోపల బయట పరిసరాలు అన్ని సీసీ కెమెరాల నిఘా నేత్రంలో ఉంటాయన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల భద్రతపరమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. సంఘవిద్రోహ శక్తులెవరైన కౌటింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగించాలని చూసినట్లయితే చట్ట పరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు నేడు ఉదయం 6 గంటల నుండి బుదవారం ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు బంద్ అని కౌటింగ్ సెంటర్ వద్ద జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అములులో ఉంటుందని ,నలుగురు కాని అంతకంటే ఎక్కువ మంది కాని గుంపులు గుంపులుగా తిరగరాదని, పార్టీ జెండాలు,పార్టీ కండువాలు, ధరించరాదన పార్టీ గుర్తులు ఫ్లాకార్ట్స్ ప్రదర్శించరాదని ,మైకులు ,లౌడ్ స్పీకర్లు ధర్నాలు రాస్తారోకోలు ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. ఎన్నికల కౌటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు జిల్లా ప్రజలు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు పోలీస్ వారికి సహకరించాలన్నారు. ఎంపి అభ్యర్థులు కౌటింగ్ ఏజెంట్లు ఎన్నిక ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని రిటర్నింగ్ అధికారి జారీ చేసిన పోటో గుర్తింపు కార్డులను కలిగి ఉన్న వారిని మాత్రమే కౌటింగ్ కేంద్రాలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

## లోక్ అదాలత్‌లో కేసులు తక్షణమే పరిష్కారం

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఈ నెల 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జరుగుతున్న డైలీ లోక్ అదాలత్ లను వినియోగించుకొని పెద్ద ఎత్తున కేసులను పరిష్కారం చేసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు సూచనలు చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ మరియు డైలీ లోక్ అదాలత్ లను పురస్కరించుకొని న్యాయవాదులతో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు కోర్టు ప్రాంగణాల్లో ప్రతీరోజూ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని న్యాయవాదులు ఈ అవకాశాన్ని వినియోగించుకోని కక్షిదారులను రాజి కుదుర్చి కేసులను పరిష్కారంచేసుకోవాలని తెలిపారు. ప్రజల్లో ద్వేష భావాలను తగ్గించి కేసుల్లో రాజీ మార్గాన్నిఅలవాటు చేయాలని అన్నారు. రాజి మార్గమే రాజా మార్గం అని ప్రజల్లో నింపాలని, విలువైన సమయం, డబ్బు దుర్వినియోగం కాదన్నారు. చిన్న చిన్న సమస్యలను పెద్దవి చేసుకొని పంతాలకు పోయి కేసుల్లో ఇరికితే పొలిసు స్టేషన్లు, కోర్టులకు ఎక్కితే నష్టమే తప్ప లాభం ఉండదని జడ్జి అన్నారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కే.జయరాంరెడ్డి, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బల్లా మహేందర్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫన్స్ కౌన్సెల్ కంప అక్షయ, అసిస్టెంట్ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫన్స్ కౌన్సెల్ జి.ప్రియాంక తదితరులున్నారు.

## పొరపాట్లు చేయొద్దు.. జాగ్రత్త!



### సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః** జహిరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తియినట్లు జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర క్రాంతి వల్లూరు వెల్లడించారు. రుద్రారం గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రూపేష్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈ నెల 4వ తేదిన జరిగే ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి ఆయ్యాయని తెలిపారు. 13 జూకల్ (ఎస్సీ) నియోజక వర్గం 255 పోలింగ్ కేంద్రాలకు గాను 14, 19 రౌండ్లు , బాన్సువాడకు సంబందించి 258 పోలింగ్ కేంద్రాలకు గాను 14 19 రౌండ్లు , 15 యెల్లారెడ్డి సంబందించి. 270 పోలింగ్ కేంద్రాలకు సంబందించి 14 20 రౌండ్లు 16 కామారెడ్డి కి సంబందించి 266 పోలింగ్ కేంద్రాలకు గాను 14 19 రౌండ్లు 35 నారాయణఖేడ్‌కు సంబందించి 296 అదనంగా 2 ఆక్సిలిరీ పోలింగ్ కేంద్రాలకు గాను 14 22 రౌండ్లు 36 అందోల్ (ఎస్సీ) సంబందించిన 313 పోలింగ్ కేంద్రాలకు గాను 14 23 రౌండ్లు 38 జహిరాబాద్‌కు సంబందించి 313 పోలింగ్ కేంద్రాలకు గాను 14 23 రౌండ్ల ద్వారా కౌటింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మొత్తం 112 , 164 రౌండ్లు ఉన్నట్లు తెలిపారు. ఈవిఎం కౌటింగ్ సంబందించి ప్రతి టేపతి ఒక కౌంటింగ్ సూపర్వైజరు ,ఒక కౌంటింగ్ అసిస్టెంట్ ఒక మైక్రో అబ్జర్వర ఉంటారని మైక్రో అబ్జర్వర్తో కలసి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రిటర్నింగ్ అధికారి రౌండ్ ప్రకారం రిజల్టు నమోదు చేస్తారని పోస్టల్ బ్యాలెట్‌కు సంబందించి ప్రత్యేక హాల్ ఏర్పాటు చేయడం జరిగిందని హోమ్ ఓటింగ్ విధులలో ఉన్న సిబ్బంది సంబందించి ఓట్లను 14 సంబందించి ఏఆర్‌ఓలు ఉంటారని తెలిపారు. దీనితో పాటు సర్వీసు ఓటర్లకు సంబందించి ఇటీపిబిస్ పద్దతిలో స్కానింగ్ ద్వారా కౌటింగ్ నమోదు చేయబడుతుందని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చామని ఇద్దరు అబ్జర్వర్లు గోపాల్ జి.తివారీ ప్రదీప్, సింగ్ సంగ్వాత్‌లు ఓట్ల లెక్కింపు కౌటింగ్ ప్రక్రియలను పరిశీలిస్తారని తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా కౌటింగ్ సిబ్బందికి ప్రతి ఒక్కరికి డ్యూటీ పాస్ ఇవ్వడం జరిగిందని ప్రతి ఒక్క ఒక కౌంటింగ్ ఏజెంట్ ఉంటారని వారికి కూడా పాస్లు ఇవ్వడం జరుగుతుందని పాస్లు ఉన్న వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఇవిఎం బ్యాలెట్ కౌటింగ్ ఉదయం 8.00 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లా ఎస్పీ సిహెచ్ రూపేష్ మాట్లాడుతూ గీతం యూనివర్సీటీలో కౌటింగ్ కోసం మూడంచెల భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి స్ట్రాంగ్ రూమ్ వద్ద సిఐపిఎఫ్ భద్రతా సిబ్బందితో పాటు స్టేట్ సాయుధ సిబ్బంది ఎఆర్ ఫోర్స్ సివిల్ పోర్స్ ఉంటుందని అలాగే స్పెషల్ స్టైకింగ్ పోర్స్ కూడా ఉంటుందని పాస్లు లేకుండా ఎవరూ అనుమతించబడరని పోలీసు బారికేడింగ్ నుండి వాహనాలను అనుమతించరని రిటర్నింగ్ అధికారి అబ్జర్వర్ అంబెలెన్స్ అగ్నిమాపక వాహనాలను మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. మీడియా పాయింట్ కోసం ఏర్పాటు చేశామని మీడియా సిబ్బంది ఎస్కార్ట్ అధికారితో వెళ్లి కవర్ చేయాలని అభ్యర్థులకు అన్ని సెగ్మెంట్లకు అనుమతి ఉంటుందని పోలింగ్ ఏజెంట్లకు మాత్రము వారి కౌటింగ్ హాలుకు మాత్రమే అనుమతి ఉంటుందని అలాగే పోలీసు హెల్ప్ లైన్ కూడా ఏర్పాటు చేశామని అలాగే కౌటింగ్ కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలియజేస్తూ కౌటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ ఐ.ఏ.ఎస్ మనోజ్ ,డిఆర్ఓ పద్మజా రాణి, ఎన్నికల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి రంగాలతోనే రాణింపు

### వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** యువతీ యువకులు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 55వ డివిజన్ భీమారం ప్రాంతానికి చెందిన సంగాల థామస్ నూతనంగా ఏర్పాటు చేసిన జిటి బ్రేక్ పాయింట్ షాపును ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గంలోని యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఆయా రంగాల్లో రాణిస్తే అభివృద్ధి చెందవచ్చన్నారు. షాపు నిర్వాహకులు సంఘాల థామస్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యాజమాన్యం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 55వ డివిజన్ స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలీలకు అనుమతి లేదు



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ ప్రతినిధి :** లోక్ సభ ఎన్నికలు 2024లో భాగంగా రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఈ నెల 13న జరిగిన పోలింగ్ కు సంబంధించి జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమానంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి అనుమతులు లేవని జిల్లా ఎస్పి సురేష్ కుమార్ తెలియజేశారు. పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల సంబంధిత ఓట్ల లెక్కింపు ప్రక్రియ అనంతరం జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకుంటున్న జాగ్రత్త చర్యల్లో భాగంగా ర్యాలీలకు అనుమతులు నిరాకరించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ రోజున పోలీసు శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేయడం జరుగుతుందని, భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లాలో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం లాంటివి చేయకూడదని తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక పనులు చేసినట్లయితే వారి పైన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## టెన్త్ పరీక్షలు ప్రారంభం

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల జిల్లాలో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు, ఉర్దూ, హిందీ) పరీక్షకు 334 మంది విద్యార్థులకు గాను 298 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమీషనర్ సందర్శించారు. అన్ని పరీక్షా కేంద్రాలలో పరీక్షలు సజావుగా జరిగాయని వారు తెలిపారు.

## నలుగురు విద్యార్థులు ఎంపిక

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలం సొనాల ప్రాథమిక పాఠశాల నుంచి ఆదర్శ పాఠశాలకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాదాపు మధుసూదన్ తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## ఫిర్యాదులపై డిఎల్పిఓ విచారణ



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్, గ్రామానికి చెందిన మరో వ్యక్తి బొల్లంపల్లి సంతోష్ గౌడ్, ముత్తారం ఎంపిఓ వేణు మాధవ్ పై ఇచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు డిఎల్పిఓ శంకరయ్య సోమవారం విచారణ చేపట్టారు.ముత్తారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విచారణ కొనసాగించారు. సంబంధిత కార్యదర్శులను, ఎంపిఓ, ఫిర్యాదుదారులను పిలిపించి ఫిర్యాదులపై వాస్తవ అవాస్తవాలను విచారణ జరిపి, ఫిర్యాదుల నుంచి, ఎంపిఓ, గ్రామ కార్యదర్శుల నుంచి ఫిర్యాదుల వివరణ తీసుకొని, దీనిపై నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి పంపనున్నట్లు ఆయన తెలిపారు. నివేదికలను పరిశీలించిన అనంతరం చర్యలుంటాయని డిఎల్పిఓ తెలిపారు. ఈ విచారణలో ఎంపిడిఓ లలిత తదితరులున్నారు.

## నిబంధన పాటించకుంటే జరిమానా



**ప్రజాపక్షం/మంథని:** మున్సిపల్ పరిధిలోని వర్తక వాణిజ్య వ్యాపార నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే జరిమానాలు విధిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమాసురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మంథని మున్సిపల్ పరిదిలోని పలు వ్యాణిజ్య వ్యాపార సముదాయాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆమె పర్యవేక్షించి వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారులు ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ చెత్తను వేస్తూ అపరిశుభ్రత నెలకొల్పి ప్రజలకు అసౌకర్యం కల్గిస్తున్నారని అన్నారు.నిత్యం తమసిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేస్తున్నారని, ఉదయం చెత్త బండ్లు సైతం తిప్పుతున్నామని అన్నారు. మంథని పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యతగా గుర్తించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. ప్రజలకు, వినియోగదారులకు ఇబ్బందికలిగేలా అపరిశుభ్రత ఏర్పడేలా వ్యవహరిస్తే నోటీసులు ఇచ్చి జరిమానాలు విధిస్తామని ఆమె స్పష్టం చేశారు. కౌన్సిలర్‌లు వీకే రవి, చొప్పకట్ల హన్మంతరావు, కుర్ర లింగయ్యతో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత



**ప్రజాపక్షం / జగిత్యాల జిల్లా ప్రతినిధి :** శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ద్వారా జగిత్యాల పట్టణంలో పరిశుభ్రత మెరుగుపరుస్తామని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మ ణ్ అన్నారు. సోమవారం పట్టణంలో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్వహించారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో రోడ్ల వెంబడి ఉన్న చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించి, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ సీజనల్ వ్యాధులకు దూరం ఉండాలంటే వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచిస్తూనే శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో 38వ వార్డు కౌన్సిలర్ దాసరి లావణ్య ప్రవీణ్, 12వ వార్డు కౌన్సిలర్ నక్క జీవన్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అరకొర పనులతో ఇబ్బందులు

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గత ప్రభుత్వ హాయాంలో మన ఊరు మన బడి పథకంలో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులను మొదలు పెట్టారే తప్ప నేటి వరకు పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయని మాజీ ఎంపిటిసి మొరపు గంగారాజం జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. విద్యా సంవత్సరం కొద్ది రోజుల్లోనే ప్రారంభం అవుతుందని పనులలో జాప్యం జరిగి అసంపూర్తిగా ఉన్నాయని, తక్షణమే చర్యలు చేపట్టి విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

# అనుకున్న చోటకి...పైరవీల్లో బిజీబిజీ

బదిలీలకు రంగం సిద్ధం....!!



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:** గత అసెంబ్లీ,మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వెళ్లిన అధికారులకు మళ్లీ బదిలీ చేసేందుకు కార్యచరణ సిద్ధం అవుతున్న నేపథ్యంలో అధికారులు పైరవిలలో మునిగి తేలుతున్నారు. తమకు అనుకున్న చోటే పోస్ట్ ఇవ్వాలని, ఎక్కడైతే స్థానచలం జరిగిందో అక్కడికి పంపాలని పైరవీలో అధికారులు బిజీబిజీగా గడుపు తున్నారని చెప్పాలి.పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కోడు ముగియగానే అధికారుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుండి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సమాచారం రావడంతో,ఈ నెల 6 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ప్రక్రియ వేగంగా చేయరాదు, దీంతో ఒక్కొక్క శాఖ పరిధిలో బదిలీల ప్రక్రియ మొదలు కానుంది.ఈ క్రమంలో జిల్లాలోని అన్ని శాఖల పరిధిలో ఉన్న కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పనిచేస్తున్న అధికారులకు స్థానాచలం తప్పదని తెలుస్తుంది. సొంత జిల్లాలకు కుటుంబాలతో దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న అధికారులు అంతా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు.అయితే గత ఐదు, పది సంవత్సరాల నుంచి ఉన్న అధికారులకు స్థాన చలనం తప్పదని ఇప్పటికే అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారని చెప్పాలి.కొందరు రాజకీయ ఒత్తిడితో అక్కడానే గత పది సంవత్సరాల నుంచి ఉంటున్న వారిని కూడా స్థానచలం చేయాల్సిందేనని కొందరు అధికారులు పట్టుపడుతున్నట్టు తెలుస్తుంది.పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు వెళ్లిన వారంతా తిరిగి వచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.ఈ క్రమంలో పాలన తిరిగి కోరకున్న చోటికి పంపేందుకు అవకాశం ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు సైతం డిమాండ్ చేస్తున్నాయి. వివిధ శాఖల మండల అధికారుల నుంచి మొదలుకొని జిల్లా స్థాయి అధికారుల వరకు పార్లమెంటు ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు.అయితే నచ్చిన చోట పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తహసీల్దారు. ఎంపీ డీవోలు ఇతర శాఖల అధికారులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. దీంతో తమ సొంత స్థలానికి బదిలీ చేయాలని కోరుతూ,అలాగే పోలీస్ ఎక్సైజ్ ట్రాన్స్పోర్ట్, అటవీ, పంచాయతీ రాజ్,వైద్య ఆరోగ్య శాఖ, విద్య, ఇంజనీరింగ్ శాఖ తదితర శాఖలో పనిచేస్తున్న అధికారులు తమకు అనుకూలంగా ఉండే చోటకు పోస్టింగ్ కోసం చేస్తున్నా రని చెప్పాలి.ఎన్నికల కోడు మునియగానే బదిలీలకు మార్గదర్శకాల ప్రకటన జారీ ప్రక్రియ మొదలవుతుందని అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. లాభ నష్టాల కోసం అనుకున్న చోటకు పోస్టింగ్ కావాలని రాజకీయ నాయకుల వద్దకు పరుగులు మొదలుపెట్టారు.జిల్లా ఇన్చార్జి కాంగ్రెస్ నాయకులకు ఉన్నతస్థాయి అధికారులను కలిసి పైరవీలు చేసుకుం టున్నారని చెప్పాలి. నిర్మల్ జిల్లాలో రెండు బిజెపి అసెంబ్లీ స్థానం గెలిచింది. దీంతో బిజెపి ఎమ్మెల్యేవద్దకుపైరవీకారులురాసప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిల వద్ద మాత్రం పైరవీలు జరుగుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ పెద్దలను కలిసి తమకు అనుకున్న చోకు పోస్టింగులు ఇప్పించాలని, పైరవీలు చేస్తూ అనుకున్న కాడికి ముడు పులు చెల్లి స్తున్నారని ప్రచారం కూడా లేకపోలేదు.రాష్ట్ర ప్రభుత్వం లో పలుకుబడి ఉన్న నాయకులతో పాటు తమ బంధువులైన రాజకీయ నాయకులను పట్టుకొని అనుకున్నచోటికి పోస్టింగ్ ఇప్పించాలని పైరవీలు మొద లుపెట్టారు. కానీ అర్హులైన అధికారులకు మాత్రం ఇలాంటి పైరవీలు చేసే అధికారులతో నిజాయితీగా పనిచేసే అధికారులకు ముప్పు వాటిలుతుందని చెప్పాలి. ఏది ఏమైనా అప్పటికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిలకు బదిలీలు రావడంతో పండగ చేసుకుంటున్నారని చెప్పాలి. ఉదయం నుండే జిల్లా ఇన్చార్జ్ కాంగ్రెస్ నేతల ఇంటి చుట్టూ అధికారులు భజన చేస్తున్నారు.జిల్లాలో బిజెపి ఎమ్మెల్యే గెలిచిన ఉన్న లేనట్లే అని చెప్పుకోవచ్చు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ కామెంట్ చేసింది తెలిసిందే. అనాటి నుండి జిల్లా అధికారులు కిందిస్థాయి అధికారులు కూడా కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్చా ర్జిల చుట్టూ తిరుగుతూ తమకు అనుకున్న చోటకు పోస్టింగ్లతో పాటు ప్రమోషన్ల కోసం తిరుగుతున్నారని చెప్పారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా, జిల్లా కలెక్టరేట్లో కొందరు కీలక శాఖలో కొన్ని ఏళ్లుగా తిష్ట వేసి పని చేస్తున్న అధికారులపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా పోస్టింగ్ నుంచి కదలడం లేదనేది. విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అలాంటి వారిని స్థానచలం చేసి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని ఉద్యోగ సంఘాలుకోరుతున్నాయి. కొందరు ఉన్నత అధికారులను మంచిగా చేసుకొని కోరుకున్న చోట కొనసాగుతున్నారని,ఈక్రమంలోఇలాంటి అధికారులకు బదిలీలు ఉండాలని తోటి ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న సందర్భాలు లేకపోలేదు,ఇప్పటికే తమ కు అనుకూల చోటుకు పోస్టింగ్ ఇవ్వాలని అధికారులు పోటీపడుతూ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జల నాయకుల పైరవీలు ఉన్నత అధికారుల ఒత్తిడి ఏ మేరకు పనిచేస్తుందో కోరుకున్న చోట పోస్ట్ వస్తుందా లేదా వేచి చూడాల్సిందే మరి.

## కాంట్రాక్టర్, సూపర్‌వైజర్లపై చర్యలకు డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గోదావరిఖని ఆర్టీసీ డిపో లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వేదిస్తున్న కాంట్రాక్టర్ ఎం.ఎస్.రెడ్డి, సూపర్వైజర్ రమేష్ లపై చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి డిమాండు చేసింది. అదేవిధంగా కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిపో అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. గౌస్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్ పేర్కొన్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో అనంతరం వారు మాట్లాడుతూ గోదావరిఖని ఆర్టీసీ డిపోలో గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సూపర్వైజర్ రమేష్ వేదింపులకు గురి చేస్తున్నారని, అతన్ని విధుల నుండి తప్పించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా వారికి చట్ట ప్రకారం రావాల్సిన జీతాలు చెల్లించడం లేదని, వారికి ఇచ్చే వేతనం నుండి కాంట్రాక్టర్ ఎం.ఎస్ రెడ్డి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఇది గత నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు. గత కొన్ని నెలల క్రితం వీరి సమస్యలను పరిష్కరించాలని డిపో మేనేజర్ కు, కాంట్రాక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని దీని వల్ల వారు అతి తక్కువ వేతనం తో కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు, లేనిచో ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు శివ, రాజు, లక్ష్మి , పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి

**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం 3 ఏరియాలోని గనులకు సంబంధించి భద్రత ,బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా పై ఆర్జీ3 జీ.ఎం శ్రీ ఎన్. సుధాకర రావు సోమవారం జి.ఎం కార్యాలయం నందు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ఓసిపి 1, ఓసిపి 2 ఉపరితల గనుల ఉత్పతి, ఉత్పాదకత, రవాణా, ఓ.బీ(మట్టి వెలికితీత) లక్ష్యాల అంశాల పై చర్చించారు. ఆర్జీ 3 ఏరియా వివిధ విభాగాల పనితీరును విశ్లేషించారు. ఈ సందర్భంగా వివిధ గనుల అధికారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించుటకు, అలాగే నిర్దేశించిన బొగ్గు రవాణా చేయడానికి అనుగుణంగా తమ వంతు కృషి చేస్తూ, లక్ష్యాలను భద్రతతో సాధించాలని, అందుకు కావలసిన చర్యలను చేపట్టాలని అన్నారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి అందరము కలసి కట్టుగా పని చేసి నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించు కోవడానికి తగిన ప్రణాళికలను రూపొందించుకోవాలని అన్నారు. అలాగే ఉపరితల గనులలో వర్షాకాలం తీసుకోవలసిన జాగ్రత్తలను తూచ తప్పక పాటించాలని, వర్షాకాలం ఉత్పత్తి కి అంతరాయం కలుగకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ పి.ఎలీషా, ఫైనాన్స్ ఏ.జీ.ఎం పి.శ్రీనివాసులు,ఎస్.వో.టు. జీ.ఎం.జీ.రఘుపతి,ప్రాజెక్ట్ అధికారులు ఎన్.రమేష్, కె.రాజేందర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సి.హెచ్.వెంకట రమణ, డీ.జీ.ఎం.ఐ.ఈ.డీ కే.చంద్ర శేఖర్, సివిల్ డీ.జీ.ఎం పద్మ రాజు, పర్సనల్ మేనేజర్ ఎం. రవీందర్ రెడ్డి, సి. హెచ్ పి డి జి ఎం కాశీ విశ్వేశ్వర రావు , ప్రాజెక్ట్ ఇంజనీర్లు ఉన్నారు.

## పకడ్బందీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ

**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** లోక్‌సభ ఎన్నికలు 2024లో భాగంగా ఈ నెల 13న జరిగిన పోలింగ్‌కు సంబంధించి జూన్ 4వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ పరిశీలకులు విజయ ఈ రవికుమార్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), బెల్లంపల్లి, అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి బి.రాహుల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి వి. రాములు, ప్రత్యేక ఉప పాలనాధికారి (ఎల్ఎ, ఆర్ అండ్ ఆర్), చెన్నూర్ అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి డి.చంద్రకళతో కలిసి కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులకు ఏర్పాటు చేసిన 2వ విడత శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈ నెల 13న జరిగిన పోలింగ్‌కు జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో జరిగే ప్రతి అంశం భారత ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్వహించవలసి ఉంటుందని, జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. అందరూ సహకరించాలని ఆయన కోరారు.

## కౌంటింగ్ విధుల్లో అలసత్వం తగదు

రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ విధులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ రామగిరిలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత కౌంటింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా, అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జి.వి. శ్యామ్‌ప్రసాద్ లాల్, దివాకర్ లతో కలిసి పాల్గొన్నారు.కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ర్యాండమైజేషన్ చేపట్టి అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా కౌంటింగ్ సిబ్బందిని కేటాయించామని, కౌంటింగ్ ఉదయం 5 గంటలకు వారీగా కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు చేస్తామన్నారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 5 గంటల వరకు తప్పనిసరిగా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, సిబ్బంది తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డులు తీసుకుని రావాలని, కౌంటింగ్ హాల్ లోపలికి సెల్ ఫోన్ అనుమతి ఉండదని, ఈ విషయాన్ని సిబ్బంది గమనించాలని కలెక్టర్ సూచించారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు జేఎన్టీయు కళాశాల నందు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ హాల్‌లో 14ఉంటాయని, వీటి వివరాలను కంప్యూటర్ లో నమోదు చేసేందుకు నలుగురు ఆపరేటర్లను కంప్యూటర్ లతో ప్రత్యేకంగా నియమించామని, వీరి మధ్య మెరుగైన సమన్వయం కోసం కలర్ డ్రెస్ కోడ్ ఏర్పాటు చేశామని అన్నారు. కౌంటింగ్ హాల్లో అధికారులు, సిబ్బంది మౌనంగా ఉండాలన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో కౌంటింగ్ చాలా కీలకమైందని, సిబ్బంది చాలా ఓపికతో ఉండాలన్నారు. పెద్దపల్లి సహాయ రిటర్నింగ్ అధికారి బి.గంగయ్య,మంథని రిటర్నింగ్ అధికారి హను మా నాయక్, మంథని మీడియా నోడల్ అధికారి తూము రవీందర్ ఉన్నారు.

## గ్రీవెన్స్ డేలో 22 ఫిర్యాదులు స్వీకరణ

జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి ప్రతి ఫిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం ఉదయం10:00 గంటల నుండి 03:00 గంటల వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా ఎస్పి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడారు. బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 22 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధం గా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేర కు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పి తెలిపారు.

## నిజామాబాద్ బాద్‌షా ఎవరో తేలేది నేడే

**ప్రజాపక్షం / జగిత్యాల జిల్లా ప్రతినిధి :** నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు ఉదయం 8గంటలకు లెక్కింపు ప్రారంభం కాగా మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించిన పిమ్మట ఈవిఎంల లెక్కింపును చేపట్టనున్నారు. రౌండ్ల వారీగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల పోలైన ఓట్లను లెక్కించనున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నిజామాబాద్ ఆర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఆర్మూర్, బోధన్, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 20 రౌండ్లకుగాను15 ఏర్పాటు చేశారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్, జగిత్యాల, కోరుట్లలో 18 ఓట్లను లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్ కోసం 2 అదనంగా ఏర్పాటు చేశారు. ఇందుకోసం జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో అధికార యంత్రాంగ కౌంటింగ్ ప్రక్రియ నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని సిఎంసి కళాశాలలో అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. కౌంటింగ్ కేంద్రం వద్ద నలుగురి కంటే ఎక్కువగా గుమికూడిఉండకుండా144సెక్షన్ అమలు చేశారు. అలాగే కౌంటింగ్ ఏజెంట్లు మంగళవారం ఉదయం 6గంటలకే లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల నుండి అధికారులు కౌంటింగ్‌కు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాల్లో నిజామాబాద్‌కు వెళ్లారు.

**20రోజుల ఉత్కంఠకు తెర**

గత నెల 13న పోలింగ్ జరగిన 20 రోజుల తరువాత ఎన్నికల కౌంటింగ్ నేడు చేపట్టనుండగా ఎవరూ గెలుస్తారో నేటి మధ్యాహ్నం వరకు తేలనుంది. నిజామాబాద్ నుండి మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బిజెపి నుండి సిట్టింగ్ ఎంపి ధర్మపురి అరవింద్, భారాస నుండి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లు ప్రధానంగా పోటీ పడి ఎవరికి వారు విస్తృత ప్రచారం నిర్వహించారు. పోలింగ్ అనంతరం నియోజకవర్గం, మండలం, గ్రామాల వారీగా పోలైన ఓట్లు, ఎవరెవరికి ఎన్ని ఓట్లు పడ్డాయో నాయకులు, కార్యకర్తల ద్వారా సమీక్షలు జరిపి బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు ధీమాను వ్యక్తం చేస్తూ వచ్చారు. ఓటర్లు తమ వైపే మొగ్గు చూపారని ఫలితం తమకే అనుకూలంగా ఉంటాయని కాంగ్రెస్, బిజెపి పార్టీలు చెప్పుకొచ్చాయి. శనివారం సాయంత్రం నుండి వివిధ సంస్థలు చేపట్టిన సర్వే ఫలితాలు వెల్లడి చేయడంతో ఆయా పార్టీల నేతలు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొన్నది.

## పాలిసెట్‌లో మార్గం భవానికి స్టేట్ ర్యాంక్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫషనల్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో 45 రోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణలో సిరిసిల్ల ప్రగతి నగర్ కు చెందిన మార్గం భవాని రాష్ట్ర స్థాయిలో 373 ర్యాంక్ సాధించింది. 60మంది విద్యార్థులు పోపా ఉచిత శిక్షణలో అత్యున్నత ర్యాంకులు సాధించినట్లు పోపా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల పున్నంచందర్ తెలిపారు. 5000వేల లోపు ర్యాంకులను 26మంది విద్యార్థులు సాధించినట్లు పేర్కొన్నారు.10 వేల లోపు ర్యాంకులను 41 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. మార్గం భవాని 373 ర్యాంకు, గాలి భాను శ్రీ 1395 ర్యాంకు, మామిడాల నందిని 1960 ర్యాంకు, గుండ్లపెల్లి వర్ధన్ 2616 ర్యాం కు, చేర్యాల చక్రధర్ 2963 ర్యాంకు, ఒగ్గు సుశాంత్ 3309 ర్యాంకు, బొద్దుల అద్వైత, గుండెల్లి సిరి, గడ్డం శివ క్రిష్ణ, ఇప్పనపెల్లి హర్షిత్, మిట్టపల్లి తరంగిణి, ఆమిదాల అనుష లు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు పున్నంచందర్ తెలిపారు. 95శాతంమంది విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సీటు వస్తుందని తెలిపారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను పాలి సెట్ కోర్స్ డైరెక్టర్స్ మండల విద్యాధికారి దూస రఘుపతి, గాజుల ప్రతాప్, మచ్చ ఆనందం, కనుకుంట్ల పున్నం ఛందర్, మామిడాల భూపతి, వాసాల హరిప్రసాద్, అడేపు వేణు, భైరిర వీందర్, కనుకుంట్ల తిరుమల, ఆంకారపు జ్యనోభ, గెంట్యాల భూమేష్, సామల తిరుపతి, కోక్కుల శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, కొడం రాం ప్రసాద్, బొల్లి భగవాన్, కనుకుంట్ల మధు, గడ్డం సత్యం, దుస శ్రీనివాస్, జక్కనీ నవీన్, చిట్యాల రత్నాకర్, చేరాల ప్రభాకర్ అభినందించారు.

**SIDDHU COLLEGE OF EDUCATION**
Recognized by NCTE & Affiliated to MGU
Near Srinivasa theatre, Huzurnagar-508204,Suryapet (Dist)

WANTED FACULTY

| Post | Qualifications |
| --- | --- |
| Lectures: | |
| 1. MPA | MPA with 55% Marks |
| 2. Life sciences | M.sc, M.Ed with 55% marks and NET/SLET is complusary |

Qualified Candidates may send their resumes by post on or before 10-06-2024

Sd/- Secretary / Correspondant
Cell: 9246778803

# అందరి దృష్టి ఆ స్థానాలపైనే

## కీలక అభ్యర్థులు వీరే...

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో మంగళవారం కౌంటింగ్ సందర్భంగా పలు కీలక స్థానాలపై అందరి దృష్టి నెల కొంది. వాటిలో ప్రముఖులు, కాకలుదీరిన రాజకీయ నాయకులు, కొత్తగా పోటీ చేస్తున్న అభ్యర్థులు, బలమైన ప్రత్యర్థులు పోటీ చేస్తున్న స్థానాలు ఉన్నాయి. కీలకమైన అభ్యర్థులు పోటీ చేస్తున్న స్థానాలను ఒకసారి చూద్దాం.

### వారణాసి : నరేంద్ర మోదీ వర్సెస్ అజయ్‌రాయ్




వారణాసి నియోజకవర్గం నుండి ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడవసారి పోటీ చేస్తున్నారు. 2014లో తొలిసారిగా ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై ఆయన గెలుపొంది ప్రధాని అయ్యారు. రెండసారి 2019లో సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి షాలినీ యాదవ్‌పై విజయం సాధించారు. ఈసారి ఎన్నికల్లో ఎస్‌పి మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్ పోటీ పడుతుఆన్నరు. వారణాసిలో ఐదు లక్షలకు పైగా మెజారిటీ సాధిస్తామని బిజెపి చెబుతుండగా, గత ఎన్నికల్లో విడివిడిగా పోటీచేసిన ఎస్‌పి, కాంగ్రెస్‌లు, ఈసారి కూటమిగా పోటీ చేస్తున్నాయని, కాబట్టి గట్టి పోటీ ఇస్తామని ఇండియా కూటమి నేతలు చెబుతున్నారు.

### రాయ్‌బరేలీ : రాహుల్‌గాంధీ వర్సెస్ ప్రతాప్ సింగ్




ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాంధీ కుటుంబ కంచుకోట రాయ్‌బరేలీ నియోజవకర్గం నుండి తొలిసారిగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఆయన అమేథీ నుండి స్మృతి ఇరానీ చేతిలో పరాజయం పాలయ్యారు. దీంతో తన తల్లి సోనియా గాంధీ రాజ్యసభకు ఎన్నికకావడంతో, రాహుల్‌గాంధీ ఆమె ప్రాతినిధ్యం వహించిన రాయ్‌బరేలీ నుండి బరిలో దిగారు. ఆయనపై బిజెపి అభ్యర్థి ప్రతాప్ సింగ్ పోటీ పడుతున్నారు.

### వయనాడ్ రాహుల్ గాంధీ వర్సెస్ అన్నీ రాజా




కేరళలోని వయనాడ్ స్థానం నుండి సిట్టింగ్ ఎంపిగా ఉన్న రాహుల్‌గాంధీ మరోసారి పోటీ చేస్తున్నారు. ఈసారి ఆయన ఎల్‌డిఎఫ్ తరుపున సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు జాతీయ ప్రధాన కార్యదర్శి అన్నీ రాజా గట్టి పోటీ ఇస్తున్నారు. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్, సిపిఐలు పోటీ పడుతుండడంతో జాతీయ స్థాయిలో ఈ నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక్కడ బిజెపి నుండి సురేంద్రన్ పోటీ చేస్తున్నారు.

### శివమొగ్గ : బివై రాఘవేంద్ర వర్సెస్ కెఎస్ ఈశ్వరప్ప




కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యెడియూరప్పకు పెట్టనికోట లాంటి శివమొగ్గ స్థానం నుండి బిజెపి తరుపున ఆయన కుమారుడు బిఎస్‌రాఘవేంద్ర పోటీ చేస్తున్నారు. ఈసారి నాటకీయ పరిణామాల మధ్య బిజెపి నేత, మాజీడిప్యూటీ సిఎం కె.ఎస్ ఈశ్వరప్ప శివమొగ్గ నుండి ఇండిపెండెంట్‌గా పోటీచేస్తున్నారు. గత ఏడాది రాజకీయాల నుండి రిటైర్‌మెంట్ ప్రకటించిన ఆయన.. తన కుమారుడికి లోక్‌సభ టికెట్ ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనికి యెడియూరప్పనే కారణమని ప్రకటించి, ఆయన కుమారుడు రాఘవేంద్రపైనే ఈశ్వరప్ప పోటీచేస్తున్నారు. ఈస్థానం నుండి కాంగ్రెస్ తరుపున గీతా శివరాజ్‌కుమార్ బరిలో ఉన్నారు.

### అమేథీ : స్మృతి ఇరానీ వర్సెస్ కిశోరీలాల్ శర్మ




ఒకప్పటి కాంగ్రెస్ కంచుకోట అమేథీ నుండి సిట్టింగ్ ఎంపి , కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పోటీ చేస్తున్నారు. ఆమెపై కాంగ్రెస్ పాత కాపు, గాంధీ కుటుంబ నమ్మకస్తుడైన స్థానిక నేత కిశోరీలాల్ శర్మను బరిలో దింపారు. గత ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ఓటమికి ఈసారి ప్రతీకారం తీర్చుకోవాలని కాంగ్రెస్ శ్రేణులు పట్టుదలతో ఎన్నికల్లో పని చేశాయి. గత పాతికేళ్ళలో అమేథీ నుండి గాంధీ కుటుంబం పోటీ చేయకపోవడం ఇదే ప్రథమం

### తిరువనంతపురం : శశి థరూర్ వర్సెస్ పన్నియన్ రవీంద్రన్ వర్సెస్ రాజీవ్ చంద్రశేఖర్






కేరళ రాజధాని తిరువనంతపురంలో ముక్కోణపు పోటీ అందరినీ ఆకర్షించింది. ఇక్కడ సిట్టింగ్ కాంగ్రెస్ అభ్యర్థి శశిథరూర్‌పై , అదే నియోజకవర్గం నుండి గతంలో ఎంపిగా గెలుపొందిన సిపిఐ నేత పన్నియన్ రవీంద్రన్, బిజెపి తరుపున కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పోటీ చేస్తున్నారు. ముక్కోణపు పోటీ నెలకొనడంతో పాటు, కాంగ్రెస్, బిజెపిలు హై ప్రొఫైల్ నేతలు నిలబడడం, వీరితో సిపిఐ నుండి బలమైన నేత ఢీ కొడుతుండడంతో ఫలితంపై ఆసక్తి నెలకొంది

### చురూ : రాహుల్ కస్వా వర్సెస్ దేవేంద్ర ఝూఝురియా




రాజస్తాన్‌లోని చురూ లోక్‌సభ నియోజవర్గంలో పోటీ ఆసక్తికరంగా మారింది. ఇక్కడ రెండు సార్లు బిజెపి తరుపున సిట్టింగ్ ఎంపిగా గెలిచిన రాహుల్ కస్వా ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్నారు. ఆయనపై పారా ఒలింపిక్ ఛాంపియన్ దేవేంద్ర ఝూఝురియాను బిజెపి పోటీ పెట్టింది.

### రాజ్‌నంద్‌గావ్ : భూపేశ్ భగేల్ వర్సెస్ సంతోష్ పాండే




ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. రాజ్‌నంద్‌గావ్ లోక్‌సభ నియోజకవర్గం నుండి బిజెపి సిట్టింగ్ ఎంపి సంతోష్ పాండేపై ఆయన పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గం బిజెపి కంచుకోట, బిజెపి మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌కు గట్టి పట్టున్న ప్రాంతం. 2009 నుండి ఈ సీటును బిజెపి ఎప్పుడు కోల్పోలేదు. దీంతో కాంగ్రెస్ ఏకంగా మాజీ సిఎంనే పోటీలో పెట్టడంతో పోరు రసవత్తరంగా మారింది.

### బహరాంపూర్ : అధీర్ రంజన్ చౌధురి వర్సెస్ యూసుఫ్ పటాన్




పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని బహరాంపూర్ నియోజకవర్గం నుండి లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత, ఫైర్ బ్రాండ్ అధీర్ రంజన్ చౌధురిపై ప్రముఖ క్రికెటర్ యూసుఫ్ పటాన్‌ను అధికార తృణమూల్ కాంగ్రెస్ బరిలో దింపింది. పిసిసి అధ్యక్షుడు, సిట్టింగ్ ఎంపిగా ఉన్న అధీర్ రంజన్ ఈ నియోజవర్గం నుండి ఐదు సార్లు ఎంపిగా ఎన్నికయ్యారు. ఈసారి ఆయన డబుల్ హ్యాట్రిక్‌ను నిలవరించేందుకు టిఎంసి ప్రయత్నిస్తుంది.

### ఛింద్వాడా : నకుల్‌నాథ్ వర్సెస్ వివేక్ సాహు




మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ స్వంత నియోజకవర్గం ఛింద్వాడా నుండి ఆయన కుమారుడు నకుల్‌నాథ్ కాంగ్రెస్ నుండి పోటీ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కమల్‌నాథ్‌పై ఓడిపోయిన వివేక్‌సాహూ లోక్‌సభ ఎన్నికల్లో ఆయన కుమారుడిని ఓడించి పగ తీర్చుకోవాలనుకుంటున్నారు. కమల్‌నాథ్ ఈస్థానం నుండి తొమ్మిదిసార్లు ఎంపిగా గెలుపొందగా, ఆయన కుమారుడు నకుల్‌నాథ్ 2019లో ఈస్థానం నుండి గెలుపొందారు.

### న్యూఢిల్లీ : బాసూరీ స్వరాజ్ వర్సెస్ సోమనాథ్ భార్తీ




దేశ రాజధానిలోని న్యూఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుండి బిజెపి తరుపున కేంద్ర మాజీ మంత్రి , ఢిల్లీ మాజీ సిఎం సుష్మా స్వరాజ్ కుమార్తె బాసురి స్వరాజ్ బరిలో దిగారు. పోయిన సారి ఈ స్థానం నుండి గెలుపొందిన మీనాక్షి లేఖీని తప్పించి మరీ ఆమెకు ఈ సీటు ఇచ్చారు. బాసురి స్వరాజ్‌పై ఆప్ సిట్టింగ్ ఎంఎల్‌ఏ సోమనాథ్ భార్తీని పోటీ చేస్తున్నారు. ఆప్‌కు కాంగ్రెస్ మద్దతునిస్తోంది. ఇక్కడ విజేతగా ఎవరు నిలుస్తారోనని ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

## ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలి : తక్కళ్లపల్లి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని, ఉద్యమకారుల కుటుంబాలను అన్ని విధాలుగా ప్రభుత్వాన్ని ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. సోమవారం హన్మకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్ అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ తెలంగాణ కోసం ఎందరో విద్యార్థి, యువకులు ప్రాణత్యాగం చేశారని, వారి ఆకాంక్షలు నెరవేర్చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. గడిచిన పదేళ్లకాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను ఏనాడు పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తెలంగాణ కోసం పోరాడిన పార్టీలను, ప్రజాసంఘాలను గుర్తించాలని, ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, ఆదరి శ్రీనివాస్, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి పాల్గొన్నారు.

## హామీల అమలుకు పోరాడుతాం

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి పోరాడుతామని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం ఆర్కె 7 గని పై ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో మాట్లాడారు. కార్మికులు ఇంటి నిర్మాణం కోసం తీసుకున్నటువంటి హెచ్‌బిఎల్‌ఆర్ఎస్ లోన్ ఇంట్రెస్ట్ ను గతంలో యాజమాన్యం కార్మికుడు తీసుకున్నప్పుడు ఉన్న లోన్ ఇంట్రెస్ట్ 8.3 శాతం కంటే తక్కువ మాత్రమే చెల్లించేవారని, పెరిగిన ఇంట్రెస్ట్ ను కార్మికులు చెల్లించేవారుకారని పేర్కొన్నారు. ఈ సమస్యను యాజమాన్యంతో చర్చించి 8.3 శాతం చెల్లించుటకు ఒప్పించామన్నారు. సిఎంపిఎఫ్ లోన్ పెట్టుకున్న కార్మికులకు ఎటువంటి పైరవీలకు తావు లేకుండా 10నెలలుగా పెండింగ్‌లో ఉన్న లోన్ల సమస్యలను పరిష్కారం చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, ఏరియా కార్యదర్శి మారుపల్లి సారయ్య, ఫిట్ కార్యదర్శులు బి.రవీందర్, మురళీచౌదరి, ఆకుల లక్ష్మణ్, గొల్లపల్లి రామచందర్, ప్రతాప్, రాజేందర్, సామిని సదానందం, చంద్రశేఖర్, రవితేజ పాల్గొన్నారు.

## కొత్త రుణాలు మంజూరు చేయండి



**ప్రజాపక్షం/గార్ల :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం రైతులకు వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేసి, కొత్త రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించాలని సిపిఐ మండల కార్యదర్శి సభ్యుడు కట్టబోయిన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గార్ల మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎదుట సోమవారం సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో శ్రీనివాస్ మాట్లాడారు. రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్న రైతులకు వడ్డీలతో కలిపి రుణభారం పెరిగిందన్నారు. బ్యాంకుల్లో కొత్త రుణాలు మంజూరు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారస్తుల వద్ద అప్పులు చేస్తున్నారన్నారు. వెంటనే రైతులకు రుణాలను మాఫీచేసి రైతులను రుణ విముక్తులను చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్,ధారావత్ వీరన్న,గుగులోత్ బిచ్యా,రాగం కృష్ణయ్య, భూక్య నగేష్ ,ఉపేందర్‌రెడ్డి,దార్ల నగేష్ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలేవీ?



**ప్రజాపక్షం/నర్సంపేట :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ డివిజన్ కన్వీనర్ పూర్ణ అన్నారు. ఎఐఎస్ఎఫ్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం సిద్ధార్థ కళాశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, డ్రెస్సులు, సాక్స్, ట్రై, బెల్టులు అమ్ముతున్నారని ఆరోపించారు. పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు విక్రయాలు చేస్తున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, రాజు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీ చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా దోపిడి చేస్తున్నాయని, ఫీజుల పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యకర్తల సమావేశం జహిరాబాద్ పట్టణం భరత్‌నగర్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య పేద వారికి అందని ద్రాక్షగా మారిందని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యసంస్థలు విద్యను అంగడి సరుకుగా మార్చాయని, పాఠశాలలు, కళాశాలల్లో ఆడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, బుక్స్ ఫీజులంటూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారన్నారు. తెలంగాణలో కార్పోరేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖ అధికారులు వత్తాను పలకడం ద్వారా వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా విద్యా వ్యాపారం చేస్తున్నారని, ఒకే కళాశాల అనుమతి పేరు మీద పదుల సంఖ్యలో కళాశాలలు నడుపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఇంటర్ బోర్డు విద్యార్థులకు సెలవులు ప్రకటించినప్పటికీ వారి ఆదేశాలను తుంగలో తొక్కుతూ కార్పోరేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యశాఖ అధికారులు వారి కబంద హస్తాల్లో చిక్కుకొని వారు చేస్తున్న ఆగడాలకు మద్దతు పలుకుతున్నారన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం పటిష్టంగా అమలు చేయకుండా గత ప్రభుత్వం కాలయాపన చేయడం జరిగిందన్నారు. పాఠశాల విద్య ఫీజుల నియంత్రణపై తిరుపతిరావు కమిటీవేసి వివరాలు బహిర్గతం చేయలేదన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యవ్యవస్థను పూర్తి ప్రక్షాళన చేసి ఫీజుల నియంత్రణపై కార్పోరేట్ విద్యాసంస్థల ఆగడాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, సహాయ కార్యదర్శి ఆనంద్, ఎఐఎస్ఎఫ్ సభ్యులు ఇసాక్, ప్రవీణ్, లింగం, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## కుంభవృష్టి...

(మొదటి పేజీ తరువాయి)

నమోదైనట్లు అధికారులు తెలిపారు. బెంగళూరులో ఆదివారం కుంభవృష్టి కురిసింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. రోడ్లన్నీ జలమయమై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలడంతో వాహనాలు ధ్వంసమయ్యాయి. విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం ఒక్కరోజే నగరంలో 111.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గత 133 ఏళ్లలో ఇంత వర్షపాతం నమోదు కావడం ఇదే తొలిసారని అధికారులు పేర్కొన్నారు. జూన్ 16, 1891లో బెంగళూరు నగరంలో 101.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. ఇప్పుడు ఆ రికార్డు బద్దలైనట్లు తెలిపారు. మరోవైపు నేటి నుంచి (జూన్ 3) 5వ తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

## ట్యాంక్‌లో శవం (మొదటి పేజీ తరువాయి)

వస్తున్న దుర్వాసన.. రుచి తేడా ఉండటంతో స్థానికులు మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందజేశారు. నీటి సరఫరాను నిలిపివేసి స్థానిక ప్రజల సహకారంతో మున్సిపల్ సిబ్బంది వాటర్ ట్యాంక్‌లోకి దిగి చూడగా ఓ మనిషి చనిపోయి దుర్వాసన రావడంతో అవాక్కయ్యారు. వాటర్ ట్యాంక్‌లోకి మనిషి శవం ఎలా వచ్చిందంటూ స్థానికులు భయాందోళనకు గురికావడమే కాకుండా ఇన్ని రోజులు చనిపోయిన మనిషి దుర్వాసనతో కూడిన నీటిని తాగామా అంటూ తమకు అనారోగ్య సమస్యలు వస్తాయోమోనని భయాందోళనలకు గురయ్యారు. వాటర్ ట్యాంక్‌లో మనిషి శవం ఉందని గుర్తించడంతో చుట్టుపక్కల జనం అంతా వాటర్ ట్యాంక్ వద్దకు తరలివచ్చి నిత్యం మనుషులు తాగే వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయక వాటిపై పర్యవేక్షణ లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారా అంటూ మున్సిపల్ సిబ్బందిపై స్థానిక ప్రజలంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే గత రెండు నెలల క్రితం నాగార్జున సాగర్ నందికొండలో 30 వానరుల శవాలు కుళ్లిపోయిన నీటినే మున్సిపల్ సిబ్బంది సరఫరా చేయడంతో ప్రజలు తాగిన సంఘటన మరిచిపోకముందే జిల్లా కేంద్రంలో గత పదిరోజుల క్రితం ఓ వ్యక్తి చనిపోయిన శవం కుళ్లిపోయినప్పటికీ అదే నీటిని త్రాగడానికి ప్రజలకు సరఫరా చేయడం పట్ల ప్రజలంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

**వంశీది హత్యా.. ఆత్మహత్యా ..?**


హిందూపూర్ వాటర్ ట్యాంక్‌లో దొరికిన శవం ఎక్కడిదంటూ స్థానిక ప్రజలు ఆందోళన చెందారు. అయితే హనుమాన్ నగర్ పాతబస్తీకి చెందిన ఆవుల వంశీకృష్ణ (27) మే 24 శుక్రవారం అర్ధరాత్రి వంటిగంట నుండి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వంశీకృష్ణకు మతిస్థిమితం సరిగా లేదని, ఆయన వెళ్లే సమయంలో తెల్లని బనీన్, షాట్ వేసుకొని ఉన్నాడని కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పలు ప్రాంతాల్లో అతని ఫోటోతో కూడిన పోస్టర్లను వేశారు. సోమవారం వాటర్ ట్యాంక్‌లో దొరికిన శవం వంశీదిగా గుర్తించారు. అయితే హత్య, ఆత్మహత్య వంటి వివిధ కోణాలలో పోలీసులు పరిశీలిస్తున్నారు. శవంపై అక్కడక్కడ గాయాలున్నట్లు కూడా గుర్తించారు.

**3 రోజులకు ఒకసారి వాటర్‌ట్యాంకు బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం : కమిషనర్**

మున్సిపల్ పరిధిలోని ప్రతి వాటర్ ట్యాంక్‌ను 2 లేదా 3 రోజులకోసారి నిబంధనల ప్రకారం శుభ్రం చేయడం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో ఉన్న వాటర్ ట్యాంక్ పరిశుభ్రం కోసం తనిఖీ చేయగా శవం కనిపించింది. ఈ శవం నల్లగొండ పాత బస్తి 28 వ వార్డుకు చెందిన ఆవుల వంశీకృష్ణ (27) గా గుర్తించడం జరిగిందన్నారు. మున్సిపల్ సిబ్బంది మే 30, జూన్ 1 న వాటర్ ట్యాంక్ ను తనిఖీ చేసి నీటిని విడుదల చేయడం జరిగింది. అప్పుడు వాటర్ ట్యాంకులో ఎలాంటి శవం లేదన్నారు. వాటర్ ట్యాంక్ ను ప్రతి 2,3 రోజులకు ఒకసారి ఎప్పటికప్పుడు శుభ్రపరచడం జరుగుతున్నది. సంఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కళ్యాణ్ చక్రవర్తి వాటర్ ట్యాంకు ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న ఇండ్లలో 50 ఇండ్లను సందర్శించారు. ఈ సంఘటన ద్వారా ఇప్పటివరకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కాలేదన్నారు.

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి**

పాతబస్తీలోని వాటర్ ట్యాంక్‌లో శవం కనిపించిన సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్‌పి చందనా దీప్తి పరిశీలించారు. మతిస్థిమితం కోల్పోయిన వంశీకృష్ణ ఎలా చనిపోయాడు సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని సంబంధిత పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఎవ్వరు ఆందోళన చెందవద్దని, నీటి సరఫరా అయ్యే ప్రాంతాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా ఇట్టి సంఘటనపై జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్రను నియమించారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ – రంగారెడ్డి
కరీంనగర్ మంగళవారం | 04 జూన్, 2024 9

## సెక్రటేరియట్‌లో వాస్తు మార్పులు !



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో వాస్తుమార్పులు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయా న్ని ఆరవ అంతస్తు నుంచి తొమ్మిదో అంతస్తుకు మార్పు చేస్తున్నట్లు సమాచారం. తొమ్మిదో అంతస్తులో ముఖ్యమంత్రి కార్యాలయానికి అవసరమైన అన్ని ఏర్పాట్లకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు సెక్రటేరియట్ ప్రధాన ద్వారం నుంచి లోపలికి వచ్చిన ముఖ్యమంత్రి కాన్వాయ్ ఇక నుండి పశ్చిమ ద్వారం నుంచి లోపలికి వచ్చి ఈశాన్య ద్వారం గుండా బయటకు వెళ్లనున్నది. ఆగ్నేయ ద్వారం నుంచి ఐఎఎస్, ఐపిఎస్, ఇతర ఉన్నతాధికారుల రాకపోకలు కొనసాగుతాయని భద్రతా అధికారులు అంటున్నారు. సచివాలయం లోపల మరి కొన్ని మార్పులు, చేర్పులను కూడా ప్రభుత్వం చేయిస్తున్నది.

## 18ఏళ్లకు పైబడిన వారు వ్యాక్సిన్ వేయించుకోవాలి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ ను అవసరమైన 18 ఏళ్లకు పైబడిన వారందరూ వేయించుకోవాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం కామినేని హాస్పిటల్‌లో టీబి వ్యాధి నివారణకై తయారైన అడల్ట్ బిసిజి టీకా అవగాహన కై జిల్లా వైద్య సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అరుణ కుమారితో కలిసి శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇంటింటి సర్వే నిర్వహించి గుర్తించడంతోపాటు బిసిజి ప్రాధాన్యతను వివరించి వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి, డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ గీత, డాక్టర్ వినోద్, డాక్టర్ అని త,హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంబిక,తదితరులు పాల్గొన్నారు.



అమెరికాలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించిన గ్లోబల్ తెలంగాణ సంఘం

## రాధాకిషన్‌రావుకు మధ్యంతర బెయిల్ మంజూరు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన టాస్క్ ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావుకు కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు మంగళవారం సాయంత్రం 6 వరకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన తల్లి సరోజినీ దేవి(98) ఆదివారం రాత్రి మరణించారు.అంత్యక్రియల అనంతరం తిరిగి జ్యూడీషియల్ రిమాండ్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

## ఆర్బిట్రేషన్ ప్రోగ్రాంపై ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికేషన్ కోర్సు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా, జవహర్ లాల్ నెహ్రు టెక్నాలజీ యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్ మధ్య కుదిరిన ఎంఓయు మేరకు గుర్తింపు కలిగి వున్న ఏ యూనివర్సిటీ నుండైనా బ్యాచిలర్ డిగ్రీ కలిగి ఉన్న విద్యార్థులకు వన్ ఇయర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఆర్బిట్రేషన్‌లో చేరడానికి అడ్మిషన్స్ మొదలయినట్లు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన సోమవారం కళాశాల ప్రాంగణంలో విడుదల చేశారు. వ్యవస్థలో అనేక రకాలైన వివాదాలు ఉంటాయని, అవి, ఇద్దరు వ్యక్తులు, లేదా అంతకంటే ఎక్కువ మంది మధ్య ఉండవచ్చన్నారు. ఆర్బిట్రేషన్ ద్వారా ఆ వివాదాలను న్యాయ పరంగా పరిష్కరించవచ్చని, ఇందుకు సంబంధించిన అరిబిట్రేషన్ యాక్ట్, అరిబిట్రేషన్ సంస్థలు, వాటి రూల్స్ ఇంకా వివిధ రకాలైన సిలబస్‌తో కూడుకున్న పాఠ్యాంశాలను హైకోర్టుతో పాటుగా లీగల్ కోర్టుల్లో టెక్నికల్ లీగల్ సెల్స్‌లో పనిచేసిన, చేస్తున్న సీనియర్ ఫ్యాకల్టీ ఆర్బిట్రేటర్ల ద్వారా విద్యాబోధన జరుగుతుందని వివరించారు. ఈ కోర్సులో చేరాలనుకున్నవారికి మొదట రాత పరీక్ష ఆ తరువాత ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. అడ్మిషన్ ఫీజు ప్రతి ఒక్కరికి ఒక లక్ష 20 వేలు కాగా, ఈ కోర్సు పూర్తి చేసినవారు తమకు తాము అరిబిట్రేషన్ కన్సల్టెన్సీ ఏర్పాటుచేసుకోవచ్చని డైరెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలోని సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ విభాగం ఈ కోర్సును నిర్వహిస్తుందని, గ్రాడ్యుయేట్స్ అయినవారు, లేదా గ్రాడ్యుయేషన్ చివరి పరీక్షలు రాస్తున్నవారు, అయిదేళ్ల ఎల్‌ఎల్‌బి కోర్సులో మూడేళ్లు పూర్తి చేసికున్నవారు కూడా ఆర్బిట్రేషన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికేషన్ కోర్సులో చేరవచ్చని రామేశ్వర్ రావు తెలిపారు. ఈ సర్టిఫికేషన్ కోర్సులో చేరాలనుకునేవారికి అప్లికేషన్స్ ఫారాలు కళాశాల నుండి సోమవారం నుండే పొందవచ్చని, చివరి తేదీ ఈనెల 30 వరకు అవకాశం ఉంటుందన్నారు.

## గొర్రెల స్కామ్‌లో.. తలసాని ప్రమేయాన్ని తేల్చాలి : టిడిపి డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రమేయంపై పారదర్శకంగా విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని టిడిపి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా కోరారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గొర్రెల పంపిణిలో భారీగా అవకతవకలు జరిగాయనే వెలుగులోకి వచ్చిందన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిగా, ఏసిబి విచారణ చేపట్టగా రూ.700 కోట్ల భారీ అవినీతి అక్రమాలు చోటు చేసుకున్న విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ కేసులో పశుసంవర్ధక శాఖ మాజీ ఎం.డితో పాటు, అప్పటి పశుసంవర్ధక శాఖమంత్రి ఓఎస్‌డి కళ్యాణ్ కుమార్, ఇతర కీలక నిందితులను అరెస్ట్ చేశారన్నారు. ఈ కేసులో అప్పటి పశుసంవర్ధక శాఖమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కూడా అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయన్నారు. వెంటనే నిష్పక్షికంగా విచారణ జరిపించాలన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఈ స్కామ్‌లో ఏమేరకు ప్రమేయం ఉందో వెల్లడించాలని సాయిబాబా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కేసులో దోషులు ఎంతటి వారైనా వదిలి పెట్టవద్దన్నారు. ఈ కేసును అవసరమైతే ప్రభుత్వం సిబిఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నల్లెల కిశోర్, పి.బాలరాజగౌడ్, ఎస్.ప్రకాష్, భాను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలు పాట కమనీయం..




**ప్రజాపక్షం/వనస్థలిపురం:** తన మధురమైన గళంతో పాటకు పట్టాభిషేకం చేసిన మహా గాయకుడు ఎస్‌పి బాల సుబ్రహ్మణ్యం అని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త కొనియాడారు. సోమవారం నాగోల్ లోని కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ లో ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'ఆకృతి' ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్. పి.బాలసుబ్రహ్మణ్యం 78జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి బాలసుబ్రమణ్యం చిత్రపటాన్ని పూలమాలలు వేసి నివాళిఅర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ దాదాపు అన్ని భారతీయ భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడిన అరుదైన గాయకులు బాలు అంటూ ప్రస్తుతించారు.. తన 55 ఏళ్ల సుదీర్ఘ సంగీత ప్రయాణంలో గాయకుడిగా, నటుడుగా, నిర్మాతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా ఆయన బహుముఖ ప్రజ్ఞ అనితర సాధ్యమైనదన్నారు.. రచయిత, గాయకుడు చిమ్మపూడి శ్రీరామ మూర్తి మాట్లాడుతూ బాలు పాట కమనీయం, మాట రమణీయం, సంస్కారం అనుసరణీయం అన్ని కొనియాడారు.. సినీ దర్శకుడు డా..పి.సి. ఆదిత్య మాట్లాడుతూ ప్రతి పాటకు ప్రాణ ప్రతిష్ట చేసిన అరుదైన గాయకుడు బాలు అన్నారు.. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిమ్మ పూడి సహ కార్యదర్శి మురళీ కృష్ణ తో పాటు పలువురు సంగీతాభిమానులు పాల్గొన్నారు.

## ప్రభాకర్‌రావును కలిసిన ఫొటోలు బయటపెడితే రాజకీయ సన్యాసం తీసుకుంటావా?

### హరీశ్‌రావుకు గజ్జల కాంతం సవాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్‌ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును కలిసినట్లు ఫొటోలు బయటపెడితే రాజకీయ సన్యాసం తీసుకొని, రాష్ట్రం నుంచి వెళ్లిపోతావా అని మాజీమంత్రి టి.హరీశ్‌రావుకు కాంగ్రెస్ నేత గజ్జల కాంతం సవాల్ విసిరారు. హరీశ్‌రావు సవాల్ స్వీకరిస్తే ఆధారాలు బయటపెడుతామని గజ్జల కాంతం అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలు గజ్జల కాంతం, సతీష్ మాదిగలు మాట్లాడారు. ప్రభాకర్‌రావు రాష్ట్రానికి వస్తే అందరం జైలుకు వెళ్లాల్సి వస్తుందని హరీశ్‌రావు చెప్పి వచ్చాడని గజ్జల కాంతం ఆరోపించారు. సిసి కెమెరాల రికార్డు, లోకేషన్ తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. హరీశ్‌రావు, కెటిఆర్, కవితలు విదేశాల్లో పెట్టుబడులు పెట్టారని విమర్శించారు. కెసిఆర్ మాట్లాడిన మాటలు తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు.




### ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న కెసిఆర్

నిలువెత్తు విషాన్ని రాష్ట్ర ప్రభుత్వం మీద కెసిఆర్ చిమ్ముతున్నారని గజ్జల కాంతం ఆగ్రహం వ్యక్తం చేశారు. సిగ్గు లేకుండా మాట్లాడుతున్నావని విమర్శించారు. కాంగ్రెస్‌కి పరిపాలన సాధ్యం కాదంటున్న కెసిఆర్ దుర్మార్గమైన పాలన చేశాడని మండిపడ్డారు. 1969లో కెసిఆర్ కంటే ముందే తెలంగాణ కోసం పెద్ద పెద్ద ఉద్యమాలు చేశారని, కేంద్ర మంత్రి పదవి కూడా వద్దనుకున్న కొండా లక్ష్మణ్ బాపూజీ అసలైన ఉద్యమ కారుడన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు అమరులు అయితే, రాజ్యాధికారం దొరలకు వచ్చిందన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన ఏ పథకం పూర్తిగా అమలు చేయలేదన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, మూడు ఎకరాల భూమి, ఉద్యోగాలు ఏ ఒక్క హామీని అమలు ఘనమైన చరిత్రను కెసిఆర్ మూటగట్టుకున్నాడని విమర్శించారు. కెటిఆర్ సిఎం రేవంత్ రెడ్డి గురించి విమర్శలు చేస్తున్నాడన్నారు. కెటిఆర్ తండ్రి పేరుతో రాజకీయాల్లోకి వచ్చాడన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి జెడ్‌పిటిసి నుంచి సిఎం స్థాయికి అంచెలాంచెలుగా ఎదిగారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దమ్ము చూపించాలని కెసిఆర్‌కు సవాల్ విసిరారు.

### మాట మార్చడంలో కెసిఆర్‌కు అస్కార్ ఇవ్వాలి : సతీష్ మాదిగ

కెసిఆర్ కాళేశ్వరం మీద, దళితులకు మూడు ఎకరాల భూమి అన్నింటిలో కెసిఆర్ మాట మార్చాడని సతీష్ మాదిగ అన్నారు. మాట మార్చడంలో ఆస్కార్ ఎవరికైనా ఇచ్చేది ఉంటే ముందుగా కెసిఆర్‌కే ఇవ్వాలన్నారు. ఆహ్వానించిన అందరికీ కుర్చీలు వేశారని, కెసిఆర్‌కి కూడా కుర్చీ వేశామన్నారు. నిజమైన తెలంగాణ వాది అయితే తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు రావాలి కదా? అని ప్రశ్నించారు. ఏడున్నర లక్షల అప్పులు చేశామనే భయం కెసిఆర్‌లో ఉందన్నారు. మహబూబ్ నగర్ ఎంఎల్‌సిలో కాదు, మంగళవారం వచ్చే లోక్‌సభ ఫలితాలు చూసుకుందామన్నారు.

## పెరిగిన 5 శాతం టోల్ రుసుం

### అమలు షురూ... వాహనదారులపై మరింత భారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టోల్ పేరుతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ)వాహనదారుల జేబులకు చిల్లులు పెడుతోంది. ప్రతి ఏటా 5 శాతం టోల్ రుసుం పెంచుతున్న ఎన్‌హెచ్‌ఎఐ సంస్థ వాహనదారులకు కనీస సౌకర్యాలను కల్పించడంతో మాత్రం పూర్తిగా విఫలమతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది కూడా నేషనల్ హైవే అథారటీ పెంచిన మరో 5 శాతం టోల్ రుసుం సోమవారం నుంచి అమల్లోకి రావడంతో వాహనదారులపై మరింత భారం పండింది. ట్రాన్స్‌పోర్ట్ వాహనాల యాజమనులపై పెనుభారం పడుతుండడంతో వారు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే కేవలం హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లి రావాలంటేనే రూ.4600 వరకు చెల్లించాల్సి వస్తోందని, కేంద్రం మరోసారి 5 శాతం పెంచడంతో అదనంగా రూ.240ల భారం పెరిగిందని, ఇలా సగటున నెలకు 15 ట్రిపులు తిరిగినా రూ.3600ల భారం పడనుండనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెరిగిన డీజిల్, ఆయిల్, ఫైనాన్స్ వడ్డీ రేట్లు పెరగడంతో ఈ ట్రాన్స్‌పోర్ట్ రంగంపై పూర్తి ప్రభావం చూపుతుండడంతో అప్పులు చేసి నెల నెల ఫైనాన్స్ చెల్లించాల్సి వస్తోందని, దీనికి తోడు మళ్లీ టోల్ రుసుం పెరగడం మరింత భారంగా మారందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుల నుంచి టోల్ రూపంలో ముక్కు పిండి వసూళ్లు చేస్తున్న కేంద్రం టోల్ ప్లాజా వద్ద కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడం పట్ల వాహనదారులు మండి పడుతున్నారు. మరోవైపు దేశ వ్యాపితంగా జాతీయ రహదారుల టోల్ టాక్స్ రేట్లను సగటున 5 శాతం పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో వివిధ రకాల వాహనాలను ఆరు కేటగిరీలుగా విభజించి హైదరాబాద్ చుట్టు ఉన్న ఔటర్ రింగ్ రోడ్డులో టోల్ ఛార్జీలను 5 శాతం పెంచుతున్నట్లు ఐఆర్‌పి సంస్థ ప్రకటించడంతో ఔటర్ టోల్ ఛార్జీలు సైతం పెరిగాయి.




**టోల్ రుసుం పెంచడం ప్రజలపై పెను భారం : సిపిఐ(ఎం)...** ప్రతి ఏటా 5 శాతం టోల్ రుసుం పెంచడం తీవ్ర అన్యాయమని సిపిఐ(ఎం) విమర్శించింది. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పెంపుదలను వాయిదా వేసిన కేంద్రం, పోలింగ్ ముగియగానే పెంచడం పట్ల సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మండిపడ్డారు. ఈ పెంపుదల రు.5 నుండి రు.50ల వరకు భారం పడనుందని, ఇది ప్రయాణీకులపై తీవ్ర భారాన్ని మోపడమేనన్నారు. టోల్ రుసుం పెంపుపై ఉన్న శ్రద్ధ కనీస సౌకర్యాలు కల్పించడంలో లేదన్నారు. టోల్ రుసుం పెంచడం ద్వారా కేంద్రం ప్రజలపై భారం వేసి టోల్ ప్లాజా సంస్థ యజమానులకు దోచిపెడుతోందని ఆయన ధ్వజమెత్తారు.

## ఎసిబి వలలో మేడ్చల్ జిల్లా పరిశ్రమ శాఖ ఎడి




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మేడ్చల్ జిల్లా పరిశ్రమల శాఖలో అవినీతి తిమింగలం ఎసిబి వలకు చిక్కింది. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని పరిశ్రమ శాఖలో ఎడిగా పని చేస్తున్న వెంకట్ నర్సిరెడ్డిని ఎసిబి అధికారులు సోమవారం రూ 45 వేలు తీసుకొంటుండగా రెడ్‌హాండెడ్‌గా ఎసిబి అధికారులు పట్టుకొన్నారు. రంగారెడ్డి జిలాల ఎసిబి డిఎస్పీ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన రమేష్ తెలంగాణా రాష్ట్ర ఫ్రైడ్ పథకం కింద రూ. 53 లక్షల టిప్పర్ వాహనం కొనుగోలు చేసాడు. దళిత పథకం కింద మంజూరు అయిన నిధులతో కొనుగోలు చేసిన ఈ వాహనానికి సంబంధించి తనిఖీ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపేందుకు గాను రమేష్ కొద్ది రోజుల క్రితం పరిశ్రమ శాఖ ఎడి నర్సిరెడ్డిని కలిసారు. తనకు రూ. 50 వేలు ముడుపుగా చెల్లించాలని, ఆ తర్వాతే తానను నివేదికలు సిద్ధం చేస్తానని ఎడి ఖరాఖండిగా డిమాండ్ చేసి కాలయాపన చేయసాగాడు. తప్పని పరిస్థితుల్లో ఎడిని బతిమిలాడి చివరికి రూ. 45 వేలు ఇస్తానని చెప్పి ఈ సమాచారాన్ని ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేసాడు. ముందస్తు ఒప్పందం మేరకు ఎడి నర్సిరెడ్డికి సోమవారం జీడిమెట్ల ప్రాంతంలో రమేష్ రూ.45వేలు ఇస్తుండగా పథకం ప్రకారం అక్కడికి చేరుకొన్న ఎసిబి అధికారుల బృందం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని ఎడి తీసుకొన్న నగదును స్వాధీనం చేసుకొన్నారు.

## బిఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల సందర్భంగా శంషాబాద్ లోని రంగారెడ్డి జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జాతీయజెండాతోపాటు పార్టీ జెండాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, టి. ప్రకాష్ గౌడ్,కాలె యాదయ్య,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి,జెడ్పి వైస్ చైర్మెన్ ఈట గణేష్ ,జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి,గణేష్ గుప్త ,కోలన్ సుష్మారెడ్డి తదితరులు, పాల్గొన్నారు.

## గుండెపోటుతో మలిదశ ఉద్యమకారుడు సూర్యనారాయణగౌడ్ మృతి



**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు సూర్యనారాయణగౌడ్ గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు సోమవారం నాగోల్‌లో నిర్వహించారు. సూర్యనారాయణగౌడ్ స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం. మాజీ స్పీకర్ మధుసూదనా చారి, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఉద్యమకారులు తాండ్ర శివరాజ్, రామాచారి, డబ్బికారు మధు, మోహన్ నాయక్, నరేందర్ గౌడ్ తదితరులు సూర్యనారాయణగౌడ్‌కు నివాళులర్పించారు.

## గోడ కూలి ముగ్గురు చిన్నారులు దుర్మరణం

### ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** ఆదివారం రాత్రి కురిసిన భారీవర్షం కారణంగా ప్రమాదవశాత్తు శిథిలావస్థలో ఉన్న ప్రహారి గోడ కూలీ అభం శుభం ఏరుగని ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు చిన్నారులను అసుపత్రికి తరలిస్తుండగా ఒకరు మార్గ మధ్యలోనే మృత్యువాత పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు చిన్నారులు అసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈహృదయ విధారకమైన ఘటన సోమవారం ఉదయం మైలార్‌దేవ్ పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్‌లో చోటు చేసుకుంది.సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను స్వాధీనం చేసుకొని, గాయపడిన వారిని అసుపత్రికి తరలించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతిచెందిన వారు బీహార్ రాష్ట్రంకు చెందిన వారీగా పోలీసులు గుర్తించారు. మృతిచెందిన వారిలో బీహార్‌కు చెందిన మహ్మామ్మద్ నజీమ్ కూతురు నూర్ జహాన్(10), మహమ్మద్ అక్బర్ కూతురు ఆఫియా పర్వీన్(05) ఘటన స్థలంలో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గాయపడిన వారిలో మహమ్మద్ నజీమ్ కుమారుడు మహమ్మద్ అలీ(9), అనభియా అలియాస్ నజీమ్(4), ఎండి అఫ్జల్ కూతురు అఫిది(3)లకు తీవ్ర గాయాలైయ్యాయి. అసుపత్రికి తరలిస్తున్న చిన్నారులలో మరొకరు మార్గమధ్యలో మృతిచెందిన చిన్నారి ఎవరనే విషయం తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







### మృతుల కుంటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : ఎఐటియుసి

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్ రెడ్డి నగర్‌లో శిథిలావస్థలో ఉన్న ప్రహారి గోడ కూలి మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘటనపైన పోలీసులు విచారణ జరిపి ఇంటి యాజమానిపై తగిన చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

### అండగా ఉంటాం: తోకల శ్రీనివాస్ రెడ్డి

మృత్యువాత పడిన చిన్నారుల కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. తాను పలుమారు కౌన్సిల్ సమావేశంలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కూలి ప్రాణ నష్టం జరుగుతుందని మేయర్ దృష్టికి తీసుకెళ్లటం జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిహెచ్‌ఎంసి అధికారులు తనిఖీలు చేపట్టి శిథిలావస్థలో ఉన్న ఇండ్లను ఖాళీ చేయించి తక్షణమే కూల్చివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత

### చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** కౌంటింగ్‌కు కేంద్రాల కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 7 కౌంటింగ్ హాల్‌లను ఏర్పాటు చేశామని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం కూడా ప్రత్యేకంగా కౌంటింగ్ హాల్ నెలకొల్పామని తెలిపారు. మహేశ్వరం, రాజేందర్ నగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం 28 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేయగా, చేవెళ్ళ, పరిగి, వికారాబాద్, తాండూర్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల కౌంటింగ్ కోసం 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కౌంటింగ్‌కు 25 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. మహేశ్వరం 20 రౌండ్లు, రాజేందర్ నగర్ 20 రౌండ్లు, శేరిలింగంపల్లి 23 రౌండ్లు, చేవెళ్ళ 22 రౌండ్లు, పరిగి 22 రౌండ్లు, వికారాబాద్ 21రౌండ్లు, తాండూరు 20రౌండ్లు, పోస్టల్ బ్యాలెట్ 2 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుందని. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఒక్కో ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని వివరించారు. 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోల్ అయిన ఓట్లను రౌండ్ల వారీగా లెక్కించేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఆదేశాల అనుసారం 25 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుతూ, ఈవీఎం ఓట్ల కౌంటింగ్ కోసం 545మందిని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 126మందిని కలుపుకుని మొత్తం 671మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించామని వివరించారు. ఇవీఎంల ఓట్లను అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా, ఒక్కో రౌండ్ వారీగా లెక్కిస్తూ, ఫలితాలను వెల్లడిస్తామని, ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్లను కలుపుతూ పార్లమెంటు నియోజకవర్గం వారీగా ఫలితాలను ప్రకటిస్తామన్నారు.






### అబ్జర్వర్ల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్

పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం పూర్తి చేశారు. ఎన్నికల పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా,కౌంటింగ్ పరిశీలకులు మృణాళిని సావంత్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిల సమక్షంలో రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ శశాంక నేతృత్వంలో చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా ర్యాండమైజేషన్ ప్రక్రియ జరిపారు. కౌంటింగ్ సిబ్బందిని సెకండ్ ర్యాండమైజేషన్ ద్వారా 7అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం కేటాయించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని స్క్రీన్ ద్వారా చూపించారు. మంగళవారం ఉదయం ఐదు గంటలకు మూడవ విడత ర్యాండమైజేషన్ పూర్తయిన మీదట ఆ జాబితా ఆధారంగా పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని మహేశ్వరం, రాజేందర్ నగర్, చేవెళ్ళ, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూర్ శాసనసభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు.

**అందుబాటులో కౌంటింగ్ పరిశీలకులు ...**చేవెళ్ళ పార్లమెంటు నియోజక వర్గ కౌంటింగ్ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, మృణాళిని సావంత్ చేవెళ్ళ మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ వద్ద అందుబాటులో ఉంటారని చేవెళ్ళ పార్లమెంటు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక తెలిపారు.

## పారదర్శకంగా స్త్రీ నిధి రుణాల మంజూరు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** మహిళా సమాఖ్యలు, ప్రభుత్వ భాగస్వామ్య సంస్థ స్త్రీ నిధి ద్వారా మహిళా సంఘాలకు అందజేస్తున్న అత్యవసర జీవనోపాధి రుణాలు పారదర్శకంగా అందించేందుకు పూర్తి చర్యలు చేపడుతున్నట్లు స్త్రీ నిధి మేనేజర్ పలుస విక్రమ్ కుమార్ తెలిపారు. సోమవారం బిజినేపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామంలో గంగారం గ్రామ ఐక్య సంఘం నందు హెచ్‌ఆర్‌పియం అనిల్ కుమార్‌తో కలిసి సంఘం సభ్యుల ఎలక్ట్రానిక్ డాక్యుమెంటేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మహిళా సంఘం సభ్యులకు బిజినేపల్లి మండల పరిధిలో 5 కోట్ల 67 లక్షల రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆధార్ ఆధారిత ధృవీకరణ ద్వారా ఎలక్ట్రానిక్ డాక్యుమెంటేషన్ పూర్తి చేసి అర్హులైన సభ్యులకు రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సభ్యులు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకొని జీవనోపాధులను వృద్ధి చేసుకోవాలని, సమిష్టి బాధ్యతతో క్రమంతప్పని చెల్లింపులు జరుపుతూ వడ్డీలేని రుణాలకు అర్హత లిగి ఉండాలని సూచించారు.

## కరాటే బ్లాక్, కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గాడ్స్ ఆఫ్ వారియర్స్ పోటు ఖాన్ కరాటే దు ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ బెల్ట్, కలర్ బెల్టు గ్రేడింగ్ టెస్ట్ జరిగింది. ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో బ్లాక్ బెల్టు 10, కలర్ బెల్ట్ 20 విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబర్చి బెల్ట్ సర్టిఫికెట్లు సాధించారని క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. వీరిలో ఎల్లో బెల్ట్ సాధించిన సుశాంత్ ఆదిత్‌రెడ్డి జశ్వంత్ విజ్ఞశ్రీ జశ్వంత్, పరమేష్ గౌడ్, సాయి, కౌశిక్, తులసి, ఆరెంజ్ బెల్ట్ సాధించిన శ్రీనిజ, గౌతమ్, పవన్, మధు గౌడ్, బ్లూబెల్ట్ సాధించిన ఆదిత్య శ్రీ వల్లభ మెరున్ బెల్ట్ సాధించిన లక్ష్మీ కాంత్ రెడ్డి, సాయి చరణ్, రోహిత్, మేఘన, బ్రౌన్ బెల్ట్ సాధించిన అనిరుద్, బ్లాక్ బెల్ట్ సాధించిన ఏకాంబరి, యోగేశ్వరి, అన్విత, సురేందర్, అరవింద్, వెంకటేశ్వర్ రెడ్డి, గౌతమ్, హర్షవర్ధన్, హఫీజ్, శివకుమార్‌యాదవ్‌లు సాధించారు. ఈ విద్యార్థులందరిని కరాటే పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొని విద్యార్థులకు బెల్టు సర్టిఫికెట్లు అందిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించడం జరిగింది. ఈ మెగా కార్యక్రమంలో క్లబ్బు డిప్యూటీ ఫౌండర్స్ జె. హరీష్ యాదవ్ , జాఫర్ సాదిక్ , బాబా , ఆఫ్సర్ , లాస్య కార్తికేయ యాదవ్ , గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## వృథాగా మిషన్ భగీరథ నీరు

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడం గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నీరు నిరంతరం వృథాగా పోతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. శుద్ధి చేయబడిన మిషన్ భగీరథ నీరు గ్రామానికి సరఫరా కావడానికి ఎన్నో వ్యయ ప్రయాసలు, ప్రజాధనం ఖర్చు అవుతున్నది. పంచాయతీ సిబ్బంది వెంటనే నీటి వృథా అరికట్టాలని గుమ్మడం గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నల్లమలలో భారీగా వర్షాలు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** నల్లమలలో భారీగా వర్షాలు అచ్చంపేట నియోజకవర్గం మొత్తం వర్షాలు కురిశాయి. ముఖ్యంగా నల్లమల అడవిలో ఆదివారం రాత్రి వర్షమొదలై సోమవారం ఉదయం వరకు కురిసింది. దీంతో వ్యవసాయ భూములు పూర్తిగా పంటలు వేసేందుకు అదును గా వచ్చాయి. అదేవిధంగా రాసుల చెరువులో నీరు అధికంగా రావడంతో చంద్ర సాగర్‌ప్రాజెక్టులోకి నీరుభారీగా చేరింది.

**జోరువానలతో యాత్రికులకు ఇబ్బందులు**

ఆదివారం ఆకస్మికంగా పడిన వర్షంతో శ్రీశైలంవెళ్లే యాత్రికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. వర్షంతో కొండలపైనున్న బురద రోడ్డుపైకిరావడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులుపడ్డారు. రాత్రిళ్ళ కరెంటులేక యాత్రికులు ఇబ్బందులుపడ్డారు. ఉదయం దేవస్థానసిబ్బంది మట్టిని తొలగించడంతో ప్రయాణికులకు రాకపోకలు సాగాయి.

## చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన క్రాంతి



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన మేకల రమ్య నాగరాజును మంత్రి జూపల్లికృష్ణారావు, ఎంపిని సూర్యప్రతాప్‌గౌడ్ ప్రధాన అనుచరులు కల్వకోల్ గ్రామ కాంగ్రెస్ పార్టీయువ నాయకులు నూనె క్రాంతి కుమార్ ఆదివారం మేకల రమ్య నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## వలలో చిక్కుకుని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలపరిధిలోని వెన్నచర్ల గ్రామపెద్దచెరువులో చేపలవేటకువెళ్లి సుధాకర్ అనేవ్యక్తి మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతకుంట సుధాకర్ (65) అనే మత్స్యకారుడు ఆదివారం సాయంత్రం పెద్దచెరువులో చేపలవేటకువెళ్లి చేపలుపడుతున్న సమయంలో కాళ్లకు చేపలవల చిక్కుకోవడంతో చెరువులోపడి మృతిచెందారు. మృతునికి భార్య నర్సమ్మ, ఐదుగురు అమ్మాయిలు, ఒకకుమారుడు ఉన్నారని మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామప్రజలు కోరారు.


## మంత్రి సహకారంతో ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** చాదారం మండలంలో గాలివాన బీభత్సం సృష్టించడంతో ముష్టిపల్లి గ్రామానికి చెందిన నల్మాది చెన్నమ్మ, నల్మాదిరా ముదు మరణించారు. మంత్రి జూపల్లికృష్ణారావు, ఎంపిని సూర్యప్రతాప్ గౌడ్ ఆర్థిక సహకారంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు కవి, రయుత గాదారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు. అనంతరం గాదారి చంద్రశేఖర్ మాట్లాడుతూ మంత్రి జూపల్లికృష్ణారావు ప్రభుత్వం నుంచి మరణించిన బాధితుల ఒక్కొక్క కుటుంబానికి రూ.4 లక్షల ప్రభుత్వం నుంచి అందిస్తున్నామని మంత్రి జూపల్లికృష్ణారావు చెప్పారని త్వరలోనే బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజమైన ఉద్యమకారులను గుర్తించాలి

### సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఉద్యమంలో పాల్గొన్న నిజమైన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి జె. రమేష్, సిపిఐ అనుబంధ ఎఐటియూసి జిల్లా సహయ కార్యదర్శి గోపాలకృష్ణ కోరారు. సిపిఐ వనపర్తి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం సిపిఐ పిలుపుని అందుకొని అనుబంధ ప్రజా సంఘాల నాయకులు ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడారన్నారు. ఆ క్రమంలో లాఠీ దెబ్బలు, అరెస్టులు కోర్టును చూడవాల్సి వచ్చిందన్నారు. ఆదివారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాలకు కొందరినని తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించి పంపడం జరిగిందన్నారు. తెలంగాణ కోసం లాఠీ దెబ్బతిని, పోలీస్ స్టేషన్‌లో మగ్గిన సిపిఐకి చెందిన వారెవరినని ఉద్యమకారులుగా గుర్తించకపోవడం శోచనీయమన్నారు. సిపిఐ మాత్రమే గాక ఇతర పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కూడా కొందరు ఉద్యమంలో పాల్గొన్నారని, వారిని కూడా గుర్తించాలన్నారు. ఉద్యమకారులను గుర్తించేందుకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా తెలంగాణ ఓసం పోరాడిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కమిటీలు ఏర్పాటు చేసి నిజమైన ఉద్యమకారులను గుర్తించి గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్న వెంకటేష్ , స్వామి, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1 పరీక్షల అర్థరహిత నిబంధనలు తొలగించాలి

### ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వ జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్ 1 పరీక్షల అర్థరహిత నిబంధనలను తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ డిమాండ్ చేశారు. వనపర్తి శ్వేతా నగర్ ఆఫీసులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గృహిణులు తాలిబొట్లు , మెట్టెలు తీసి వేసి పరీక్షలకు హాజరు కావాలని నిబంధన పెట్టారని, వాటిని వెంటనే తొలగించాలన్నారు. హిందూ స్త్రీలు తాళి, మెట్టలు భర్త మరణించినప్పుడు మాత్రమే తొలగిస్తారన్నారు. ఈ నిబంధన సరికాదన్నారు. పరీక్ష ప్రారంభానికి అర్థగంట ముందే కేంద్రాల ప్రవేశ ద్వారాలను మూసివేసే నిబంధన కూడా సరికాదన్నారు. ఇది మారుమూల పల్లెల నుంచి అభ్యర్థులు బస్సులు, టూ వీలర్స్‌పై వస్తారని, వర్షాలు పడుతున్నందున ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఆ నిబంధన కూడా రద్దు చేయాలన్నారు. అభ్యర్థులు తమ వెంట బ్యాగులు, పుస్తకాలు పర్సులు, సెల్ ఫోన్లు తెచ్చుకుంటారని, ప్రతి సెంటర్‌లో వాటిని భద్రపర్చేందుకు ఒక గదిని కేటాయించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు సడలించుకుంటే ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## ప్రశాంతంగా కౌంటింగ్ సాగేలా చర్యలు

### రిటర్నింగ్ అధికారి రవి నాయక్




**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** నేడు పాలమూరు యునివర్సిటీలో మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని రిటర్నింగ్ అధికారి, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్ వెల్లడించారు. సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో పాలమూరు యూనివర్సిటీలో కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్ పరిశీలించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రశాంతంగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ హాల్లోకి గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. కౌంటింగ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఓట్లను లెక్కించాలని సూచించారు. స్ట్రాంగ్ రూమల్లో నుంచి కౌంటింగ్ హాల్లోకి ఈవిఎంలను జాగ్రత్తగా తరలించాలని పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కౌంటింగ్ సాఫీగా సాగేలా సిబ్బంది ప్రత్యేక కృషి చూయాలని తెలిపారు. అనంతరం మీడియా సెంటర్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటిగ్ నిర్వహణ





**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** జిల్లాలో ప్రశాంత వాతావరణంలో లోక్ సభ ఎన్నికల కౌటింగ్ ప్రక్రియ జరగాలని పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చాల ముఖ్యమని జిల్లా ఎస్పీ అన్నారు. నేడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికలు కౌంటింగ్ నిమితమ్ము రాజభదుర్‌రెడ్డి కొనెన్షన్ బందోబస్తుకి వచ్చిన పోలీస్ అధికారులకు బ్రీఫింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లడుతూ కౌంటింగ్ ప్రక్రియ జరిగే ప్రదేశం పాలమూరు యూనివర్శిటీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటిగ్ నిర్వహణ జరగాలని సిబ్బందికి తెలియజేశారు. ప్రజలు, నాయకులు అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేలా పూర్తి భద్రతను ఏర్పాటు చేశామని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందని చెప్పారు. కౌంటింగ్ కొరకు 485 మంది సిబ్బందిని నియమించమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు , ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్ , మహబూబ్ నగర్ టౌన్ డిఎస్పి వెంకటేశ్వర్లు , డిసిఆర్పి డిఎస్పీ రమణారెడ్డి, నారాయణపేట డిఎస్పీ లింగయ్య, డిటిసి డిఎస్పీ నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## విత్తనల దుకాణాల తనిఖీలు



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల కేంద్రంలో గల విత్తనా లు అమ్మే దుకాణాలను నకిలీ విత్తనాల అమ్మకాలను నిరోదించుటకు, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ , అధికారులతో కూడిన టీం సీడ్ షాపులను తనిఖీలు చేపట్టింది. వ్యవసాయ అధికారి చంద్రమౌళి మాట్లాడుతూ ఎవరైనా నకిలీ విత్తనాలు రైతులకు అంటగడితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని, మంచి నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఒరిజినల్ రసీదుతో రైతులకు అమ్మాలని, ప్రతి అమ్మకానికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని, లైసె న్స్ రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన దుకాణదారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి చంద్రమౌళి, నాయబ్ , తహసీల్దార్ లక్ష్మీ కాంత్ , హెడ్ కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటా

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** బిజినేపల్లి మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త కుమ్మరిమైబూస్ ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంఎల్‌ఏ మర్రిజనార్దన్‌రెడ్డి కుమ్మరిమైబూస్ ఇంటికివెళ్లి రూ.2 లక్షల చెక్‌ను అందజేశారు. కార్యకర్తలే పార్టీకి ప్రాణమని, ఆపదలో ఉన్న ప్రతికార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటానని అన్నారు.

# కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

### ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రమైన నెల్లికొండ వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చే టసిన కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఉదయ్‌కుమార్ కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గంలోని నాగర్‌కర్నూల్, అ చ్చంపేట, గద్వాల, వనపర్తి, అసెంబ్లీ నియోజకవర్గాల కు సంబంధించి 16 టేబుళ్లు, అల్లంపూర్, కల్వకుర్తి, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అ సెంబ్లీ సెగ్మెంట్ల వారిగా కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను నిశితంగా పరిశీలన జరిపారు. పోస్టల్ బ్యాలెట్ లె క్కింపు కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌ను సందర్శించారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ జరపాల టని సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని, ఇవి ఎంల కౌంటింగ్‌ప్రక్రి య 8.30గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నిబంధనలను పాటించాలని అన్నా రు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణకోసం నియమించబడిన వారికి పాస్‌లు అందించాలని, పాస్ కలిగి ఉన్న వారినే కౌంటింగ్ సెంటర్ లోకి అనుమతించాలని సూచించారు. నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగాపూర్తి చేయాలని హితవు పలికారు. ఎలాంటి అప్రశుతులకు తావు లేకుండా కౌంటింగ్‌కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేస్తూ అవసరమైన పోలీస్‌బందోబస్తు ఉందన్నారు.

**కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ పూర్తి**

సాధారణ ఎన్నికల పరిశీలకులు రుచేష్‌జైవన్షి, కౌంటింగ్ అబ్జర్వర్ సత్పాల్‌శర్మ, గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ సమక్షంలో రెండో ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలోభాగంగా ఓట్ల లెక్కింపుకోసం కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం పూర్తి చేశారు. నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ పూర్తిచేసినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎన్ఐసి సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు రుచేష్‌జైవన్షి కౌంటింగ్ అబ్జర్వర్ సత్పాల్‌శర్మ సమక్షంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు సంబంధించిన ఏడు నియోజకవర్గాల కౌంటింగ్ సిబ్బంది పోస్టల్‌బ్యాలెట్ కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ నిర్వహించి ఏడు కౌంటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన 106 టేబుళ్లకు సంబంధించిన కౌంటింగ్ సూపర్‌వైజర్స్ 127, కౌంటింగ్ అసిస్టెంట్స్ 131, మైక్రో అబ్జర్వర్స్ 130సిబ్బందిని కేటాయించారు. 16మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించినట్లు చెప్పారు.ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఈప్రక్రియ మొత్తాన్ని స్క్రీన్‌ద్వారా చూపించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, వనపర్తి అదనపు కలెక్టర్ నగేష్, గద్వాల అదనపు కలెక్టర్ అపూర్వచౌహన్, సిబ్బంది పాల్గొన్నారు.

# కౌంటింగ్ కోసం 12 వందల మంది సిబ్బంది

### ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లాలో హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లలో సోమవారం కౌంటింగ్ ఏర్పాట్లను రోనాల్డ్ రోస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని కమలానెహ్రూ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో, చార్మినార్ అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కేంద్రంలో, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఉస్మానియా యూనివర్సిటీ సెంటర్ ప్రొఫెసర్ రామ్ రెడ్డి ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కేంద్రంలో జరుగనుందన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు సంబంధించి సికింద్రాబాద్‌లోని సిఎస్ఐఐటి, వెస్లీ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో జరుగుతుందన్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు 3 కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుందని, మిగిలిన 12 కౌంటింగ్ కేంద్రాల్లో ఉదయం 8.00కి ఇవిఎం ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుందన్నారు. కౌంటింగ్ కోసం 12 వందల మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారన్నారు. హైదరాబాద్ జిల్లాలో 13 లోకేషన్లలో ఓట్ల లెక్కింపుకు జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 20 , మిగితా అసెంబ్లీ సెగ్మెంట్‌లలో 14 చొప్పున కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని, ఓట్ల లెక్కింపు యాకత్ పుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 24 రౌండ్లు, చార్మినార్ అసెంబ్లీ సెగ్మెంట్లో అత్యల్పంగా 15 రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుందని రోనాల్డ్ రోస్ తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి వెంట సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి,హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఖైరతాబాద్ ఏఅర్ఓ, హేమంత్ బొడ్కే సహదేవ రావు, జూబ్లీహిల్స్ డిసి ప్రశాంతి, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఏఆర్ఓ దశరథ్ సింగ్, డిప్యూటీ కలెక్టర్ విజయ లక్ష్మి , యూసఫ్ గూడ డిప్యూటీ కమిషనర్ సేవాసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై ఉచిత శిక్షణ



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కొత్తకోట మండలం మదనాపురంలోని కృషి విజ్ఞా న కేంద్రం ఆధ్వర్యంలో నైపుణ్య భారత్‌లో భాగంగా గ్రామీణ యువతకు, యువ రైతులకు సేంద్రీయ వ్యవసాయ సాగుపై 25 రోజుల పాటు వ్యవసాయ నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శిక్షణ నిర్వాహకుడు సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ రెండో వారం నుండి ప్రారంభమయ్యే శిక్షణకు జిల్లాలో ఆసక్తి కలిగిన అభ్యర్థులు కనీసం ఆరవ తరగతి చదివి 18 నుండి 40 సంవత్సరాలు కలిగి ఉండాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఉచిత భోజనం, వసతి కల్పించడం జరుగుతుందని ఆసక్తి కలిగిన గ్రామీణ యువ రైతులు, యువత ఈ నెల 9న ఆధార్ కార్డు జిరాక్స్, పాస్పోర్ట్ ఫోటో, చదువు ధృవీకరణ పత్రం లేదా మార్కుల పత్రం జిరాక్స్ పత్రాలతో కృషి విజ్ఞాన కేంద్రం మదనాపురం పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, సుస్థిర వ్యవసాయసాగు పద్ధతులు, భూసార సంరక్షణ పద్ధతులు, సమగ్ర పోషకాల యజమాన్యం, సేంద్రియ ఎరువుల వర్మి కంపోస్ట్ తయారీ, పచ్చి రొట్టె ఎరువులు, జీవన ఎరువులు, సమగ్ర సమస్య రక్షణ, జీవ నియంత్రణ పద్ధతులు, జీవ రసాయనల తయారీ, వృక్ష సంబంధిత మందుల తయారీ, సేంద్రీయ ఉత్పత్తులు, మార్కెటింగ్ అంశాలపై శిక్షణ ఇచ్చి సేంద్రీయ వ్యవసాయ క్షేత్ర సందర్శన ఏర్పాటు చేయడం జరిగిందని సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని యువత యువ రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆర్‌టిసిలో కొత్త జీతాలు : ఇయు ధన్యవాదాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 2017 వేతన సవరణ అమలు జరిగి జూన్ 1 న ఉద్యోగుల బ్యాంక్ అకౌంట్లలో కొత్త జీతాలు జమ అయినందుకు ప్రభుత్వానికి, విసి ఎండి వి.సి.సజ్జనార్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలంగాణ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఇ.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. కొత్త జీతాలు అమలు చేసిన ఆ చేతి తోనే కొత్త అలవెన్సులు కూడా జులై 1న వచ్చే జీతాలతో పాటు అమలు చేయాలని వారు కోరారు. కొత్త జీతాలు రావడం వల్ల 2017 వేతన సవరణ సగమే అమలయిందని, కొత్త అలవెన్సులు కూడా వచ్చి చేరితే 2017 వేతన సవరణ సంపూర్ణమవుతుందని వారు అన్నారు. 2013 వేతన సవరణ బాండ్ల బకాయిలు అన్ని తరగతుల వారికి విడుదల చేయాలని వారు డిమాండ చేశారు. తెలంగాణ రాష్ట్రం దశాబ్ది ఉత్సవాలు కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్నందున ఆ పార్టీ ఎలక్షన్ మానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి అపాయింటెడ్ డేట్‌ను అమలు చేయాలని వారు కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడుస్తున్నా ఇంతవరకు విలీనంపై దృష్టి సారించకపోవటం అత్యంత శోచనీయమన్నారు. కాబట్టి ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ మానిఫెస్టోలో ఇచ్చిన మరొక హామీ అయిన ట్రేడ్ యూనియన్లను ఆర్టీసిలో పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసిలో పనిభారాలు పెరిగాయని, యాజమాన్యపు వేధింపులు ఎక్కువయ్యాయని, అదే యూనియన్ల ప్రమేయం ఉంటే ఉద్యోగులు ఇంత ఆందోళన చెందేవారు కాదని వారు అభిప్రాయపడ్డారు. కార్మికులలో ఈ ఆందోళన దూరం కావాలంటే వెంటనే ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని, ఈ పని చేయటం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి కాని, ఆర్టీసి యాజమాన్యానికి కాని ఆర్థిక భారం పడదని, అప్పులు చేయాల్సిన అవసరం అంత కంటె ఉండదని తెలిపారు. ఆర్టీసి కార్మికులకు 2021 వేతన సవరణ బకాయి పడిందని, 2025 తో ఈ వేతన సవరణ కాల పరిమితి పూర్తవుతున్నందున వెంటనే ఆర్టీసి ఉద్యోగులకు 2021 వేతన సవరణను 50 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి అమలు చేయాలన్నారు. ఇప్పటికే ఆలస్యమైనందున 25 శాతం ఇంటీరియమ్ రిలీఫ్ జులై మాసం జీతాలలో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కావున ఈ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టి, సమీక్షా సమావేశాలు జరిపి, ఆ సమావేశాలలో యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలని వారు డిమాండ చేశారు. కనీసం ఈ దశాబ్ది ఉత్సవాల సందర్భంగానైనా ఆర్టీసి కార్మికుల సమస్యలు పరిష్కరించబడితే ఆ ఉత్సవాలకు శోభ చేకూరుతుందని వారు పేర్కొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిధిలోని ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలలో, ఆగ్రో సేవా కేంద్రాలలో రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని అగ్రో సేవా కేంద్రం, ఫర్టిలైజర్ దుకాణాలలో జిల్లా టాస్కోర్స్ బృందం మండల టాస్కోర్స్ బృందం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా టాస్కోర్స్ బృందం జిల్లా వ్యవసాయ అధికారి మట్లాడుతూ రైతులకు నాణ్యమైన కంపెనీ విత్తనాలను విక్రయించాలని, సీడ్స్ దుకాణాలలో విత్తన ప్యాకెట్లపై కంపెనీ పేరు తయారు తేదీ గడువు తేదీలను పరిశీలించి రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, గడువు ముగిసిన విత్తనాలను, నకిలీ విత్తనాలు అమ్మితే దుకాణదారులపై కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. రైతులు దుకాణాల నుంచి విత్తనాలు ఫర్టిలైజర్స్ కొన్నప్పుడు తప్పనిసరిగా ఒరిజినల్ బిల్లు తీసుకోవాలని, ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన దుకాణాలలో మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. నాణ్యతలేని గుర్తింపు లేని విత్తనాలు అమ్మిన డీలర్లపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, ఎవరికైనా లూజూ విత్తనాలు అమ్మినట్లయితే రైతులు వెంటనే 08545 / 233525 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ దామోదర్ , వీపనగండ్ల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ , నయాబ్ తహసీల్దార్ కృష్ణమూర్తి, హెడ్ కానిస్టేబుల్ బీరయ్య ఉన్నారు.

## పాఠశాలల్లో మున్సిపల్ చైర్మన్ తనిఖీ



పజాపక్షం/చర్లపల్లి:ప్రభుత్వపాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేయాలని మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి అన్నారు.సోమవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జెడిపిహెచ్‌సి స్కూల్ పరిసరాలను,బిల్డింగ్ పై ప్రదేశాలను,టాయిలెట్లను చైర్మన్, అధికారులతో కలసి పరిశీలించారు.స్కూల్ ప్రారంభయ్యే లోపు పాఠశాలను క్లీన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్,మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమంలో పండ్ల పంపిణీ



ప్రజాపక్షం/షామీర్‌పేట్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మూడు చింతలపల్లి మండలం లోని జగ్గం గూడ గ్రామ పరిధిలోని ఆశ్రమంలో సోమవారం బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిఎంఎస్ వైస్ చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి విచ్చేసి పండ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. మాజీ సర్పంచ్‌లు విష్ణువర్ధన్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటలతో ఊతం.. యువతకు ప్రోత్సాహం

మండల వైస్ ఎంపిపి కౌకుంట్ల బందయ్య గౌడ్



ప్రజాపక్షం/నవాబుపేట్ : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని నవాబుపేట్ మండల వైస్ ఎంపిపి కౌకుంట్ల బందయ్య గౌడ్ అన్నారు. వైసిపి జన్మదిన వేడుకలు సందర్భంగా అక్నాపూర్ గ్రామ యువజన సంఘాల నాయకులు నిర్వహించిన మండల స్థాయి క్రికెట్, వాలీబాల్ టోర్నమెంటును వైసీపీ బందయ్య గౌడ్ కలిసి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రస్తుత సమాజంలో క్రీడలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని అన్నారు. జూన్ 6న నవాబ్ పేట్ వైస్ ఎంపిపి కౌకుంట్ల బందయ్య గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని అక్నాపూర్ గ్రామ యువజన సంఘాల ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్ ను సోమవారం క్రికెట్ ప్రారంభించారు. యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి టోర్నమెంట్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడాకారుల్లో ఉత్సాహంతో పాటు మానసికోల్లాసానికి సైతం వీటితో పెంపొందించవచ్చన్నారు. ఈ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15 వేలు, రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.6 వేల నగదు.వాలీబాల్ మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు, రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 5 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందజేస్తామని గ్రామ యువజన సంఘం నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్, నరేగూడ, పుల్ మామిడి, అక్నాపూర్, కేశవపల్లి గ్రామాల యువకులు, క్రీడాకారులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ముగింపు వేడుకలు



ప్రజాపక్షం/దుండిగల్ : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం రోజు బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా కార్యాలయాంలో జాతీయ జెండాను బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరించిన మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, అనంతరం తెలంగాణ ఏర్పాటుకు ముందు, తెలంగాణ ఏర్పాడిన అనంతరం పరిస్థితులను వీడియో ఆధారంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూఏ రాష్ట్రం కోసమైతే ప్రాణత్యాగాలు, ఉద్యమాలు జరిగాయో అవన్నీ ఫలించి దశాబ్దకాలంలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించి, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చింది కేసీఆర్ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి బిఆర్ఎస్ పార్టీ ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు, కౌన్సిలర్స్, డిప్యూటీ మేయర్, పాక్స్ చైర్మన్, డివిజన్ అధ్యక్షుడు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 8న జిల్లాకోర్టులో జాతీయ లోక్‌అదాలత్

పజాపక్షం/చర్లపల్లి: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఢిల్లీ,తెలంగాణ ఆదేశానుసారం,మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని సంస్థ చైర్మన్,ప్రధాన న్యాయ మూర్తి వి బాల భాస్కర్ రావు,సెక్రెటరీ కిరణ్‌కుమార్‌లు తెలిపారు.జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్,రాజీ పడదగిన క్రిమినల్,వాహన ప్రమాద రికవరీ,చెక్ బౌన్స్,భూవివాదాల కేసులు పరిష్కరించుకోవచ్చునని పేర్కొన్నారు.కక్షిదారులు అవకాశాన్ని వినియోగించుకొని సమన్యాయం,సత్వర న్యాయం పొంది సమయాన్ని ఆదా చేసుకోవాలని సూచించారు.

## హరీశ్‌రావు జన్మదిన వేడుకల్లో ఎంఎల్ఎ



ప్రజాపక్షం/చర్లపల్లి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల ముగింపులో భాగంగా రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం సోమవారం ఎఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని రౌండ్ బిల్డింగ్ వద్ద ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి ఎగరవేశారు. అనంతరం మాజీ మంత్రి, సిద్దిపేట్ ఎంఎల్ఎ తన్నీర్ హరీశ్‌రావు జన్మదిన్నాన్ని పురస్కరించుకుని నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌బి కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, జి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి, బాలరాజు, షేర్ మణెమ్మ,శి రీషారెడ్డి, లక్ష్మి నారాయణ, మనమ్మ, మురళిపంతులు, రహీం, రాజయ్య,రాజు పాల్గొన్నారు.

## పొలంలో బయటపడిన పురాతన విగ్రహం

ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని తమ్మలోని గూడ గ్రామ సమిపంలోని సత్తిరెడ్డి వ్యవసాయ పొలంలో ల్యాండ్ లెవలింగ్ పనులు చేస్తుండగా పురాతన విగ్రహం బయట పడింది. అ విగ్రహన్ని బయటకు తీసిన ఉపాధి కూలీలు దానిని నిటితో శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ విషయాన్ని ఫిల్డ్ అసిస్టేంట్ జగయ్య అధికారుల దృష్టికి తెవడంతో ఎంపిడిఓ నరేంధర్‌రెడ్డి, యాచారం సిఐ శంకర్‌కుమార్. రెవేన్యూ అర్ఐ రామకృష్ణ తదితర సిబ్బంది అక్కడి వెళ్ళి పరిశీలించారు. అవిగ్రహాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు. గ్రామంలో పురాతన విగ్రహం బయట పడడంతో అప్రాతంలో పురాతన విగ్రహలు ఇంకా ఉండ వచ్చునని పలువురు పెర్కోంటున్నారు. వివిధ గ్రామాలకు చేందిన వారు అక్కడికి వచ్చి చూసి వెల్తున్నారు.

# అన్నింటా మహిళలకు భాగస్వామ్యం

భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: రాజకీయ ఆర్థిక సామాజిక రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. మహిళా సమాఖ్య 70వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఉప్పల్ మండలం సాయినగర్ కాలనీలో షహీదా భేగం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై వివక్ష, అణచివేత, సామాజిక కట్టుబాట్లు, పితృస్వామ్య ఆధిపత్యం, శ్రమ దోపిడీ, అత్యాచారాలు, హత్యలు నానాటికి పెచ్చరిల్లి పోతుండటాన్ని ఆమె ధ్వజమెత్తారు. మహిళలపై అరాచకాలను పాలకులు అరికట్టటంలో విఫలమవుతున్నారన్నారు. జనాభా ఆధారంగా 50 శాతం అవకాశాలు కల్పించాలని, విద్యా ఉద్యోగ వైద్య రంగాల్లో రిజర్వేషన్లు కల్పించి దేశాభివృద్ధిలో మహిళలను భాగస్వాములను చేయాలన్నారు. పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్లు డీలిమిటేషన్ తర్వాత 2029లో కల్పిస్తామంటూ మోడీ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందన్నారు. ఎన్నికల కమిషన్ పాలకవర్గాలకు ఊడిగం చేసే సంస్థగా మార్చేసారని ఆమె విమర్శించారు. మహిళా సమాఖ్యను గ్రామ స్థాయి నుండి నిర్మాణం చేసుకొంటూ ఆందోళనలను ఉధృతం చేద్దామని ఆమె పిలుపిచ్చారు. శ్రమ దోపిడీకి పితృస్వామ్య పీడన అణచివేతల నుండి విముక్తి కోసం పోరాడాలని, నూతన సామాజిక వ్యవస్థ నిర్మాణం కోసం సోషలిజం సా ధ నే ధ్యేయంగా మహిళలకు అసలైన విముక్తి లభించేందుకు పోరాటం చేసేందుకు మహిళలు కదం తొక్కాలన్నారు. మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి లక్ష్మి మాట్లాడుతూ మహిళల కోసం ఎన్ని ప్రత్యేక చట్టాలున్నప్పటికీ సరైన దిశలో పని చేయటం లేదని ఆందోళన వ్యక్తం చేసారు. మహిళల చట్టాలను మరింత కఠినతరం చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతంగా పరిష్కరిస్తూ నిందితులకు సరైన శిక్షలు పడేలా చూడాలన్నారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని, రేషన్ దుకాణాల ద్వారా 16 రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని, బాలికలకు కళాశాల స్థాయి నుండే ఆత్మరక్షణ పద్ధతులు నేర్పించాలన్నారు. మహిళా సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ఏ. ప్రమీల, ఉప్పల్ మండల అధ్యక్షురాలు కె. జ్యోతి, నరసమ్మ, హేమలత, షీలా, ఎన్.అచ్చాలి, నాగటి పద్మ, సత్తమ్మ, లక్ష్మ మ్మ,లింగమ్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు కార్మికుడిపై కూలిన గోడ



ప్రజాపక్షం/దుండిగల్ : ఇటీవల భారీభవంతుల గోడలు కూలి కార్మికులు మృతి చెందిన గాయపడిన సంఘటనలు కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ప్రాంతంలో వెలుగులోకి వస్తున్నాయి. భవనాలు నిర్మించే బిల్డర్లు నాణ్యత పాటించకపోవడంతోనే తరచూ సంఘటనలు వెలుగులోకి వస్తున్న వారి తీరు మారడం లేదు హెచ్‌ఎండిఏ, జిహెచ్‌ఎంసి, మున్సిపల్ అధికారులు ఇష్టానుసారంగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారే తప్ప నాణ్యతను గాలికి వదిలేస్తున్నారు. ఇటీవలే కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ప్రాంతంలోని బాచుపల్లిలో ఓ నిర్మాణ సంస్థ ప్రహరి గోడ కూలి దాదాపు ఏడుగురు మృత్యువాత చెందిన సంఘటన మరువకముందే పెట్ బషీరాబాద్ ప్రాంతంలోని సుచిత్రలో ఓ నిర్మాణ సంస్థ ప్రహరీ గోడ కూలి మరో కార్మికుడు బలవంత్ రెడ్డి (32) గోడక్రిందే ఇరుక్కుని ప్రాణాలతో బయటపడ్డాడు. జేసిబి సహాయంతో 4గంటలుగా కార్మికుని తీసేందుకు డిఆర్ఎఫ్, జిహెచ్‌ఎంసి, పోలీసులు, ఫైర్ సిబ్బంది కష్టపడ్డారు. ఈ సంఘటనలన్నీ నాణ్యతలేని భవనాలు నిర్మించడం ద్వారానే జరిగాయి. జరిగిన సంఘటనలే నిదర్శనం ఇక నుండి అయినా అనుమతులు ఇచ్చే ఉన్నతాధికారులు అనుమతులతో పాటు నాణ్యతను కూడా పరిశీలిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

## ప్రైవేటు స్కూళ్ళపై నిఘా పెంచాలి

సిపిఐ సీనియర్ రాష్ట్ర నాయకుడు ఎసురత్నం



ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ కూకట్పల్లి ఏరియాలో ప్రైవేటు స్కూల్ యాజమాన్యంపై తెలంగాణ ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కుతూ తమ ఇష్టానుసారంగా విద్యార్థి తల్లిదండ్రులపై ఒత్తిడితెచ్చి మీ పిల్లలకు కావలసిన సామాగ్రిని తమ దగ్గరనే కొనుక్కోవాలని ఒత్తిడి చేస్తున్నారు. మీ పిల్లలు మంచిగా చదువుకోవాలంటే మా దగ్గరనే కొనాలని బయట కొంటే ఆ సామాగ్రికి మాకు ఎలాంటి సంబంధం లేదని తల్లిదండ్రులను ఇబ్బందికి గురి చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర నాయకుడు కె.ఏసురత్నం అన్నారు. అనంతరం వారు పత్రిక పట్టణ ద్వారా మాట్లాడుతూ.. కొన్ని విద్యాసంస్థలు అయితే విద్యార్థులు స్కూలు మారితే టిసి మార్పుల లిస్టు ఇవ్వకుండా విద్యార్థి తల్లిదండ్రులను ఇబ్బందికి గురిచేస్తున్నారన్నారు. మరికొన్ని స్కూలు ఆటస్థలం లేదు, పిటి టీచర్లు లేరు, మరుగుదొడ్లు సరిగ్గా లేవు,అధిక ఫీజు వసూలు చేస్తున్నారు. డొనేషన్ అంటూ దోచుకుంటున్నారు. హరహత అనుభవము లేని, టీచర్లను పెడుతూ టీచర్లకు తక్కువ జీతాలు చెల్లించి, నాణ్యతలేని చదువులు చెబుతూ, తల్లిదండ్రులను మాత్రం ఫీజుల పేరుతో పీకు తింటున్నారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న స్కూలు యాజమాన్యాలపై చర్యలు తీసుకో వాళ్లని, విద్యాశాఖ అధికారులు మరియు ఎంఈఓని డిమాండ్ చేశారు.

## ఫారెస్టులో అక్రమాలపై విచారణ

హైదరాబాద్ డిఎఫ్ఒ విజిలెన్స్ అధికారి రాజశేఖర్

ప్రజాపక్షం /వికారాబాద్: వికారాబాద్ పరిధిలోని గోట్టిముక్కుల పారెస్టు శాఖ లో గతంలో జరిగిన అక్రమాలపై చినికి చినికి వాన పెద్దదైనట్టుగా ఒక్కసారిగా బయటపడడంతో అధికారుల్లో గుబులు మొదలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని గత వారం నుండి కొన్ని పత్రికలు వాస్తలను ప్రచురితం చేయడంతో హైద్రబాద్ డిఎఫ్‌వో విజిలెన్స్ అధికారి రాజశేఖర్ విచారాణ చేపట్టారు. ఈ విషయమై ఆయనవిచారాణ అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు... పారెస్టులు ప్రతి సంవత్సరం బీడీల ఆకుల చెట్లను అమ్మకాలు జరుగుతుంటాయి. అందులో భాగంగానే 2017సంవత్సరంలో గొట్టిముక్కుల పారెస్టులోని బీడీల ఆకుల అమ్మకాలను అప్పటి పారెస్టుఎఫ్ఆర్‌వో రైతులకు అమ్మకుండా తన డ్రైవర్‌తో పాటు మరి కొందరి పేర్లలను రాసి దాదాపుగా 7లక్షల 51 వేల రూపాయలను ఖాతాలకు మల్లించడం జరిగింది. అనంతరం డ్రైవర్ మృతి చెందగా మృతి చెందిన డ్రైవర్ ఖాతాలో 7లక్షల డబ్బులు ఉండడం అదే శాఖలో కొందరికి అనుమానం వచ్చి మృతి చెందిన వారి భర్యాను అడుగగ నాకు ఎం తెలియదని సమాధానం ఇవ్వగా.. మరింత అనుమానం పెరిగింది. అసలేం జరిగిందని ఇటీవల కొన్ని పత్రికలు ఆరా తీయగా అసలు విషయం బయటికి వచ్చింది. ఈ విషయమై విచారణ చేపట్టడం జరిగిందని విచారాణ అనంతరం ఎవరు తప్పు చేశారనేది గుర్తించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## నల్లపోచమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం



ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట: చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్‌లో నల్ల పోచమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టి. లక్ష్మారెడ్డి, శ్రీనాథ్ రావు, భగత్ సింగ్ నగర్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, అలంకరణ ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నల్ల పోచమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్నికి సహకరించిన బస్తి వాసులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. బస్తి వాసులందరూ సుఖ సంతోషాలుతో ఉండాలని కోరుకున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నల్ల పోచమ్మ తల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.సాంబయ్య, ఆలయ కమిటీ సభ్యులు సుభాష్, మూర్తి, పంగా రాజు, చందు, స్రామాట్, కిషన్ నేత, మద్ది వెంకటేష్, రమేష్ గౌడ్, బిక్షపతి గౌడ్, లక్ష్మయ్య, ఉప్పలయ్య, ప్రభాకర్, నాగ కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ‘ఓం ట్రేడింగ్’ రైతులకు పంగనామాలు

న్యాయం చేయాలంటూ రైతుల ధర్నా.. రాస్తారోకో

పత్తాలేని వ్యవసాయ అధికారులు



ప్రజాపక్షం / కొడంగల్ : ఎకరాకు 100 క్వింటాళ్ల వరి దిగుబడి వస్తుందని రైతులను నమ్మించి మోసం చేసి నకిలి విత్తనాలను విక్రయించిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు ఆయా గ్రామాల రైతులు కొడంగల్ పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణం ముందు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. కొడంగల్ పట్టణంలోని ఓం ట్రేడింగ్ ఫర్టిలైజర్ మందుల దుకాణం యాజమాన్యం గత సంవత్సరం డిసెంబర్‌లో కెఎస్‌వి పంక్షన్ హాల్ లో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఓం ట్రేడింగ్ కంపెనీ వరి సీడ్‌తో ఎకరాకు 100 బస్తాల దిగుబడి ఎలా తీయాలో అవగాహన కల్పించి ఒక్కో రైతు నుంచి కొంత నగదును స్వీకరించి ముందుస్తుగా దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఇట్టి విషయాన్ని నమ్మిన రైతులు జనవరిలో ఓం ట్రేడింగ్ దుకాణంలో విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు పంటసాగు చేశారు. కంపెనీ అదేశాల మేరకు వారు ఏ మందులు ఇస్తే ఆ మందులు వాడటంతో ఎకరాకు 100 బస్తాలు కాదు కదా.. 5 నుంచి 10 బస్తాలు కూడా దిగుబడి రాలేదని రైతులు వాపోయారు. వరి పంటసాగుపై కంపెనీ అధికారులను, షాపు యాజమాన్యాన్ని ప్రశ్నించగా మాకు ఎలాంటి సంబంధం లేదని అందరితో పాటు మీరు కూడా నష్టపోయారని తెలుపడంతో నియోజకవర్గంలోని రేగడిమైలారం, ఎన్కెపల్లి, లింగన్‌పల్లి, నాచారం తదితర గ్రామాల రైతులు దుకాణం ముందు బైఠాయించి రైతులను మోసం చేసిన షాపు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులకు పిర్యాధులు చేసిన అధికారులు ఏ మాత్రం స్పందించకపోగ పత్తలేరని రైతులు మండిపడ్డారు. 163 నేషనల్ హైవేపై రైతులు ధర్నా.. రాస్తారోకో చేయడంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. కంపెనీ సిబ్బందితో మాట్లాడి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామి ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

## నాణ్యమైన విత్తనాల సరఫరాకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగే గజేందర్ గౌడ్ డిమాండ్



ప్రజాపక్షం/షాబాద్ :రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగే గజేందర్ గౌడ్ అన్నారు. సోమవారం షాబాద్ మండల రైతు వేదిక కార్యాలయంలో వ్యవసాయ అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి సంత్సరం ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ ఖరిఫ్ సిజన్ నుండి అధికారులు అప్రమతంగా ఉండి రైతులకు నాణ్యమై విత్తనాలు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. బిటి పత్తి విత్తనాలు సాగు చేయడం నేరం అని వివరించారు. బిటి పత్తి విత్తనాల పేర్లతో రైతులకు మోసం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు మండల వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని సుచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశం, ఎఈవో సోనిశ్రీ, బికేఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి చంద్రబాబు, వివిధ గ్రామాల రైతు సంఘాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి కౌంటింగ్ కోసం రెండవ విదత

# ర్యాండమైజేషన్ పూర్తి





ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: మంగళవారం జరుగను న్న మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రెండవ విదత ర్యాందమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని వి.సి.హాలులో సాధారణ ఎన్నికల పరిశీలకులు డాక్టర్ ఎం.ఎస్. ప్రియాంక శుక్లా, దిలీప్ ధ్యాన్‌దేవ్, నిరంకర్ సింగ్, మంజూర్ అహ్మద్ ఖాద్రి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఈఓ విజయకుమారి, ఇతర అధికారులు, జిల్లా ఎన్నికల అధికారి గౌతంల పర్యవేక్షణలో ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు.

మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్‌బినగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధులకు సంబంధించి మొత్తం 158 , 158 కౌటింగ్ సూపర్‌వైజర్లు, 158 కౌటింగ్ అసిస్టెంట్లు, 158 మైక్రో అబ్జర్వర్లను ఎంపిక చేసామని జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతం తెలిపారు.

# రాంకీలో ఇటాచి డ్రైవర్ గల్లంతు

హైదరాబాద్ వెస్ట్ మేనేజ్మెంట్ (రాంకీ) నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి బలి




ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ మున్సిపాలిటీలోని హైదరాబాద్ వెస్ట్ మేనేజ్మెంట్ (రాంకీ) పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న ఇటాచి డ్రైవర్ సోమవారం తెల్లవారు జామున 3 గంటలకు ఇటాచితో సహా భారీ గుంతలో జారీ పడి గల్లంతైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన గోళం మహమ్మద్ రాంకీ పరిశ్రమలో ఇటాచి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి మరో వ్యక్తితో కలిసి ఇటాచితో పరిశ్రమలో ఉన్న గుంతలను మట్టి, బండరాళ్లతో పూడ్చుతుండగా ప్రమాదవశాత్తు ఇటాచి బారి గుంతలోకి జారీ పడింది. డ్రైవర్ ఇటాచిలో ఇరుక్కొని గుంతలో గల్లంతయ్యాడు. మరో వ్యక్తి ఇటాచి నుండి దూకి ఈదుకుంటు బయటపడి ప్రాణాలు రక్షించుకున్నట్లు సమచారం. రాత్రి సంఘటన జరిగిన సమాచారం బయటకు పొక్కకుండా యాజమాన్యం గోప్యంగా ఉంచింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న దుండిగల్ పోలీస్‌లు మృతదేహాన్ని వెలుకి తీసేందుకు ఉదయం 10 గంటల నుండి శ్రమిస్తున్నట్లు సమాచారం. భారీ గుంత కావడం ఇటాచి మట్టిలో కూరుకు పోవడంతో మృతదేహాన్ని వెలికి తీసేందుకు మరికొంత సమయం పడుతుందని ఎస్ఐ రాజేష్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గత పది రోజుల క్రితం జెసిబి బోల్తాపడి బీహార్ కు చెందిన జెసిబి డ్రైవర్ మృతి చెందగా సంస్థ కు చెందిన అంబులెన్స్ ద్వారా సూరారంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిన యాజమాన్యం మృతుని కుటుంబానికి 2 లక్ష్యలు ఇస్తామని చెప్పి మేనేజ్ చేసినట్లు సమాచారం. రాంకీ పరుశ్రమలో వరుస సంఘటనలు జరుగుతున్న రాంకీ యాజమాన్యం గోప్యంగా ఉంచుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నత అధికారులు సంఘటనలు పునరావృతం కాకుండా యాజమాన్యం పై కఠినమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## క్రీడ

# దక్షిణాఫ్రికా శుభారంభం



**న్యూయార్క్:** టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా శుభారంభం చేసింది. గ్రూప్– డిలో శ్రీలంకపై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. సఫారీ బౌలర్లు అన్రిచ్ నోకియా (4/7), కేశవ్ మహరాజ్ (2/22), రబాడ (2/21) విజృంభించడంతో తొలుత శ్రీలంక 77 పరుగులకే కుప్పకూలింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకకు ఇదే అత్యల్ప స్కోరు. లంక బ్యాటర్లలో ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ఓపెనర్ కుశాల్ మెండిస్ (19) టాప్ స్కోరర్. కమిందు మెండిస్ (11), ఏంజెలో మాథ్యూస్ (16) పరుగులు చేశారు. వానిందు హసరంగ (0), సమరవిక్రమ (0) డకౌట్ కాగా.. దాసున్ శనక (9), చరిత్ అసలంక (6), మహీశ్ తీక్షణ (7) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. 78 పరుగుల స్వల్ప లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా తడబడింది. 16.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి టార్గెట్‌ను అందుకుంది. సౌతాఫ్రికా బ్యాటర్లలో ఓపెనర్ క్వింటన్ డికాక్ (20) పరుగులు చేయగా.. మరో ఓపెనర్ రీజా హెండ్రిక్స్ (4) నిరాశపర్చాడు. తర్వాత వచ్చిన మార్క్‌రమ్ (12), ట్రిస్టన్ స్టబ్స్ (13) రన్స్ చేసి వెనుదిరిగారు. హెన్రిచ్ క్లాసెన్ (19), డేవిడ్ మిల్లర్ (6) నాటౌట్‌గా నిలిచారు. శ్రీలంక బౌలర్లలో వానిందు హసరంగ 2, నువాన్ తుషార, దాసున్ శనక తలో వికెట్ పడగొట్టారు.

## టీ20 వరల్డ్‌కప్‌కు రూ.93కోట్ల ప్రైజ్‌మనీ




**న్యూఢిల్లీ :** 2024 టీ20 వరల్డ్‌కప్ టోర్నమెంట్‌కు ఐసిసి భారీ నజరానా ప్రకటించింది. మొత్తం రూ. 93.52కోట్లు ప్రైజ్‌మనీగా అందించనుంది. అందులో టైటిల్ విన్నర్‌కు అత్యధికంగా రూ. 20.36కోట్లు దక్కనుంది. ఇక రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ. 10.64 కోట్లు అందనుంది. అలాగే సెమీఫైనల్‌కు చేరిన ప్రతి జట్టుకు రూ.6.54 కోట్ల ప్రైజ్ మనీ దక్కనుంది. కాగా, అన్ని జట్లు టోర్నీలో తమ తమ స్థానాలను బట్టి నగదు బహుమతి అందుకోనున్నాయి.

* రెండో రౌండ్ (సూపర్ 8)కు చేరిన జట్లు ప్రైజ్ మనీ రూ. రూ.3.17 కోట్లు
* 9 నుంచి 12వ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 2.05 కోట్లు
* 13 నుంచి 20 స్థానాల్లో ఉన్న జట్టుకు రూ. 1.87 కోట్లు

ఇక ఇవే కాకుండా టోర్నీలో నెగ్గిన ప్రతీ మ్యాచ్‌కు ఆయా జట్లు అదనంగా రూ. 25.89 లక్షలు అందుకోనున్నాయి. సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లు ఇందులో మినహాయింపు.

## 'నేను కోచ్ అయితే పక్కా ఆ రూల్ తీసుకొస్తా'



2024 టీ20 వరల్డ్‌కప్ నేపథ్యంలో టీమ్‌ఇండియా మాజీ ప్లేయర్ ఇర్ఫాన్ పఠాన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. తాను గనక టీమ్‌ఇండియా కోచ్ అయ్యి ఉంటే ప్రతి బ్యాటర్ కచ్చితంగా బౌలింగ్ చేయాలన్న నిబంధన పెట్టేవాడిని పేర్కొన్నాడు. 'నేను కోచ్ అయితే స్పెషలిస్ట్ బ్యాటర్లు అందరూ జట్టుకు అవసరమైనప్పుడు కచ్చితంగా బౌలింగ్ చేయాలి అనే రూల్ తీసుకొస్తా' అని అన్నాడు. ఈ సందర్భంగా 2007, 2011లో టీమ్ఇండియా వరల్డ్‌కప్‌లు నెగ్గడంలో ఆల్‌రౌండర్లు కీలక పాత్ర పోషించినట్లు గుర్తుచేశాడు. అప్పటి జట్టులో సచిన్, యువరాజ్, రైనా బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్ కూడా చేశారన్నాడు. ఇప్పుడున్న జట్టులో రోహిత్, విరాట్, సూర్య కేవలం బ్యాటింగ్ చేస్తారని, బౌలింగ్ చేయరని అన్నాడు. ఆ ముగ్గురిలో ఒక్కరు బౌలింగ్ చేసినా జట్టుకు కలిసొస్తుందని అభిప్రాయపడ్డాడు. అలాగే 'ఇంగ్లాండ్‌లో లివింగ్‌స్టోన్, మొయిన్ అలీ, జాక్స్ బ్యాటింగ్‌తోపాటు బంతితోనూ రాణిస్తారు' అని అన్నాడు.

## క్రికెట్‌కు కేదార్ జాదవ్ గుడ్‌బై

### అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్డ్



టీమ్‌ఇండియా సీనియర్ ప్లేయర్ కేదార్ జాదవ్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 39ఏళ్ల జాదవ్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు సోమవారం ప్రకటించాడు. తన నిర్ణయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. 'నా 1500 గంటల కెరీర్‌లో మద్దతుగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు. ఇక నేను అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి నేను తప్పుకుంటున్నట్లు పరిగణించండి' అని రాసుకొచ్చాడు. కాగా, జాదవ్ 2014లో శ్రీలంకతో జరిగిన సిరీస్‌తో టీమ్‌ఇండియా తరపున అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. తన కెరీర్‌లో 73 వన్డేలు, 9 టీ20ల్లో టీమ్‌ఇండియాకు ప్రాతినిధ్యం వహించాడు. ఇక 2020లో ఆఖరి వన్డే మ్యాచ్ ఆడాడు. ఇక దాదాపు ఆరేళ్లు టీమ్‌ఇండియాకు జాదవ్ ఆల్‌రౌండర్‌గా సేవలందించాడు. వన్డేల్లో 42.09 సగటుతో 1389 పరుగులు సాధించాడు. అందులో రెండు సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. పలు మ్యాచ్‌ల్లో జాదవ్ బంతితోనూ రాణించాడు. వన్డేల్లో 42 ఇన్నింగ్స్‌లో 27 వికెట్లు పడగొట్టాడు. స్పిన్ బౌలరైన జాదవ్ అవసరమైనప్పుడు టీమ్‌ఇండియాకు బ్రేక్ ఇచ్చాడు. అయితే ఫామ్‌లేమి కారణంగా జట్టులో చోటు కోల్పోయిన జాదవ్, క్రమంగా దూరమవుతూ వచ్చాడు.

## రీల్



# ఎన్టీఆర్ రెండు పాత్రల మధ్య..

ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ సినిమా ఈ ఏడాది ఆగస్టు నుంచి షూటింగ్ ప్రారంభం కానుంది. ఐతే, తాజాగా ఈ సినిమా పై ఓ కొత్త రూమర్ వినిపిస్తోంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు టాక్. ఎన్టీఆర్ రెండు పాత్రల మధ్య డ్రామా చాలా కొత్తగా ఉంటుందని.. ముఖ్యంగా ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కి మరియు యాక్షన్ అభిమానులకు ఈ సినిమా కనుల విందుగా ఉంటుందని తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ చాలా ఇంటెన్స్ క్యారెక్టర్ లో కనిపించబోతున్నాడు. అలాగే, మరో షేడ్ క్యారెక్టర్‌లో కూడా తారక్ కనిపించబోతున్నాడు. కాగా ఈ మధ్య ఈ పవర్ ఫుల్ ప్రాజెక్ట్ కోసం మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి అంటూ చిత్రబృందం ఓ మెసేజ్‌ను కూడా పోస్ట్ చేసింది. మరి ఈ సినిమా ఎలా ఉండబోతుందో చూడాలి. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ నటిస్తోందని తెలుస్తోంది. మరి, కియారా అద్వానీ, నిజంగానే ఎన్టీఆర్ సరసన నటిస్తే.. ఆ క్రేజే వేరు. అలాగే, ఈ సినిమాలో మరో హీరోయిన్‌కి కూడా స్కోప్ ఉందని.. ఆ పాత్రలో మరో స్టార్ హీరోయిన్‌ను తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలుస్తోంది.

## 'మల్లెపూల టాక్సీ'తో మాయ చేస్తోన్న మంగ్లీ



ఫోక్ సింగర్ మంగ్లీ ఇండస్ట్రీలో తనకంటూ ఓ ప్రత్యేక ఇమేజ్‌ను క్రియేట్ చేసుకున్నారు. వరుస హిట్ సాంగ్స్ తో ఆమె ప్రస్తుతం టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ లేడీ ఫోక్ సింగర్ గా మారారు. ఇక ఆమె పాడిన పాటలకు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉందని చెప్పాలి. ఆమెతో కనీసం ఓ ఫోక్ సాంగ్ పాడిస్తే, తమ సినిమాకు మంచి బూస్ట్ వస్తుందని టాలీవుడ్ మేకర్స్ భావిస్తున్నారు. అంతటి క్రేజ్ తెచ్చుకున్న ఈ సింగర్ తాజాగా మరో కొత్త సాంగ్ తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేందుకు రెడీ అయ్యారు. 'ధూంధాం' అనే కొత్త మూవీలో ప్రముఖ లిరిసిస్ట్ రామ జోగయ్య శాస్త్రి రాసిన 'మల్లె పూల టాక్సీ' అనే పెప్పీ సాంగ్ ను మంగ్లీ పాడారు. ఈ పాటకు సంబంధించిన ప్రోమోను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. గోపీసుందర్ సంగీతం అందించిన ఈ పాట ప్రోమో అద్భుతంగా ఉందని అభిమానులు అంటున్నారు. ఇక 'ధూంధాం' సినిమాలో చేతన్ కృష్ణ హీరోగా నటిస్తోండగా, అందాల భామ హెబ్బా పటేల్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాను మచ్చ సాయి కిషోర్ డైరెక్ట్ చేస్తుండగా.. ఫ్రైడే ఫ్రేంవరక్స్ ప్రై.లిమిటెడ్ బ్యానర్ పై ఎంఎస్.రామ్ కుమార్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ 'మల్లె పూల టాక్సీ' ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ ను జూన్ 5న ఉదయం 9.18 నిమిషాలకు రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

## 'పరువు' కోసమే పోలీసులతో గొడవ



నటీనటులు సోషల్ మీడియాలో ఏది పోస్ట్ చేసినా అది వైరల్ గా మారడం సహజం. ఇదే కోవలో నటి నివేథా పేతురాజ్ పోలీసులతో గొడవపడుతూ కనిపించిన వీడియో ఒకటి గురువారం నాడు నెట్టింట తెగ చక్కర్లు కొట్టింది. ఆమె నిజంగానే పోలీసులతో గొడవకు దిగిందా.. లేక ఇదంతా కేవలం ప్రమోషన్స్ కోసమేనా అని అభిమానులు ఆరా తీశారు. కాగా, ఈ వీడియోకి సంబంధించిన అసలు కథ బయటకు వచ్చింది. నివేథా పేతురాజ్ పోలీసులతో గొడవపడుతున్నట్లు కనిపించిన వీడియో కేవలం ప్రమోషనల్ స్టంట్ అని తేలింది. ఆమె నటిస్తున్న 'పరువు' అనే వెబ్ సిరీస్ కోసం ఇలా వినూత్నంగా ప్రమోషన్స్ చేపట్టారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ జీ5లో త్వరలో స్ట్రీమింగ్ కి రాబోతున్న 'పరువు' వెబ్ సిరీస్ ఓ క్రైమ్ థ్రిల్లర్ గా తెరకెక్కించారు. 'పరువు' వెబ్ సిరీస్ ను పవన్ సదినేని డైరెక్ట్ చేస్తుండగా, సుస్మిత కొణిదెల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. గోల్ బాక్స్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై వస్తున్న ఈ వెబ్ సిరీస్ లో నాగబాబు, నరేష్ అగస్త్య, ప్రణీత్ పట్నాయక్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జూన్ 14 నుండి ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కానున్నట్లు జీ5 ప్రకటించింది.

## మొదట పోస్టల్ బ్యాలట్స్ లెక్కింపే

### అంగీకరించిన ఇసి

**న్యూఢిల్లీ :** ఓట్ల లెక్కింపులో మొదట పోస్టల్ బ్యాలట్స్‌ను లెక్కించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించిందని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు అభిషేక్ సింఘ్వి చెప్పారు. పోస్టల్ బ్యాలట్లనే ముందుగా లెక్కించాలని తాము చేసిన విజ్ఞప్తిని ఎన్నికల సంఘం అంగీకరించిందని మంగళవారంనాడు మొదట లెక్కింపు అదేనన్నారు. భాగస్వామ్య ప్రాతిపదిపై ఉండే స్ఫూర్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. 'ఇండియా' కూటమి నాయకులు ఆదివారంనాడు ఎన్నికల అధికారును కలిశారు. కౌంటింగ్ ప్రక్రియను అమలుచేయడంపై చాలా స్పష్టమైన మార్గదర్శకాలను అందరికీ జారీ చేయాలని వారు కోరారు. ఈ ప్రతినిధి బృందంలో సింఘ్వితోపాటు పలువురు నాయకులు ఉన్నారు. పలు పార్టీల నాయకులు ఈ ప్రతినిధిబృందంలో ఉన్నారన్నారు. ఇ సి అంగీకరించడంతో తమకు ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. తాము ముగ్గురుసభ్యుల బృందాన్నీ కలిసి ఒక లిఖితపూర్వక విజ్ఞప్తి అందజేసినట్లు చెప్పారు. 1961 ఎన్నికల నిర్వహణా నిబంధనలనుఈ సందర్భంగా వారు ఆ లేఖలో ఉటంకించారు.

## 8 వేల మంది భవితవ్యం తేలేది నేడే...

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. ఈ ఎన్నికల్లో 8 వేలకుపైగా మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అందులో 16 శాతం మంది జాతీయ పార్టీలకు చెందిన వారు కాగా, 6 శాతం ప్రాంతీయ పార్టీలు, 47 శాతం స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలు మొత్తం ఏడు విడతల్లో జరిగాయి. ఏప్రిల్ 19న తొలి దశల పోలింగ్ జరగగా, జూన్ 1 తుది దశ పోలింగ్ నిర్వహించారు. వీటి ఫలితాలు నేడు వెల్లడికానున్నాయి. అయితే 1996 తరువాత అభ్యర్థులు పెద్ద ఎత్తున అభ్యర్థులు పోటీలో నిలిచారు. 1996లో అత్యధికంగా 13,952 మంది ఎన్నికల బరిలో నిల్వగా, 2019లో 8,039 మంది పోటీ చేశారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో 543 స్థానాల్లో 744 పార్టీలకు చెందిన 8,360 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని తేల్చుకునేందుకు బరిలోకి దిగారు. ఆరు జాతీయ పార్టీల్లో ఒకటైన బిఎస్‌పి నుంచి అత్యధికంగా 488 మంది పోటీ చేశారు. అదే విధంగా జాతీయ పార్టీలైన బిజెపి 441, కాంగ్రెస్ 328, సిపిఐ(ఎం) 52, ఆప్ 22, ఎన్‌పిపి నుంచి ముగ్గురి పోటీ చేశారు. అయితే స్థానిక పార్టీల్లో అత్యధికంగా సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) నుంచి 71 మంది, టిఎంసి నుంచి 48, ఎఐఎడిఎంకె నుంచి 36, సిపిఐ 30, వైఎస్‌ఆర్‌సిపి నుంచి 25, ఆర్‌జెడి నుంచి 24, డిఎంకె నుంచి 22 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గుర్తింపు పొందిన పార్టీలైన సోషల్ యూనిటీ సెంటర్ ఆప్ ఇండియా (కమ్యూనిస్టు) అత్యధికంగా 150 మంది, పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమాక్రటిక్) 79 మందిని బరిలోకి దింపింది. ప్రతి నియోజకవర్గంలో సగటున 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. తెలంగాణలో అత్యధికంగా సగటున 31 మంది పోటీ చేయగా, లడఖ్, నాగాలాండ్‌లో ముగ్గురు చొప్పున బరిలో ఉన్నారు. తమిళనాడులోని కరూర్‌లో అత్యధికంగా 54 మంది పోటీలో ఉండగా, వారిలో 46 మంది (85 శాతం) స్వతంత్రులే. మొత్తం అభ్యర్థుల్లో సగటు వయస్సు 48 ఏళ్లు. జాతీయ పార్టీల్లో 13 శాతం మంది అభ్యర్థులు 40 ఏళ్ల లేపువారు కాగా, బిఎస్‌పి పోటీలో నిలిపిన 20 శాతం మంది అభ్యర్థులు 40 సంవత్సరాల లోపు వారే కావడం గమనార్హం. ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో 27 శాతం మంది గతంలో ఎంపిగా చేసిన వారే. అయితే 25 శాతం మంది గతలో లోక్‌సభ సభ్యులు కాగా, 4 శాతం మంది రాజ్యసభ సభ్యులు, 2 శాతం మంది ఉభయసభలకు చెందిన వారు ఉన్నారు. మొత్తంగా 17వ లోక్‌సభకు చెందిన 327 మంది మళ్లీ పోటీలో నిలిచారు. ఒక ఎంపి రెండు స్థానాల నుంచి బరిలో ఉన్నారు. ఇదిలా ఉండగా, మరోసారి పోటీ చేస్తున్న 17వ లోక్‌సభకు చెందిన 34 మంది ఎంపిలు ఈసారి వివిధ పార్టీల్లో ఉండడం గమనార్హం.

**మహిళలు 9.6 శాతమే:** ఈ సారి ఎన్నికల్లో 8 వేలకుపైగా పోటీలో ఉన్న అభ్యర్థుల్లో మహిళలు కేవలం 9.6 శాతమే. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మూడింట ఒక వంతు మహిళలు ఉన్నాలన్న ఉద్దేశంతో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించిన తరువాత జరుగుతున్న తొలి సార్వత్రిక ఎన్నికల్లో మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉండడం విశేషం. మొత్తం 8,337 అభ్యర్థుల్లో కేవలం 797 మంది మాత్రమే మహిళలు ఉన్నారు.

### ఢిల్లీలో నీటి కరువు సమస్యపై

## రేపు యమునా నది బోర్డు సమావేశం

**న్యూఢిల్లీ :** ఎగువ యమునా నది బోర్డు (యువైఆర్‌బి) సమావేశం అత్యవసరంగా మంగళవారంనాడు జరుగుతుంది. ఢిల్లీలో నీటి సమస్య పెరిగిపోవడం, వడగాలులకు ఇటీవలికాలంలో అనేకమంది మరణించడం వంటి ఘటనల నేపథ్యంలో యువైఆర్‌బి అత్యవసర సమావేశం ఏరాటు చేశారు. 1995లో ఎగుమ యమునా నది బోర్డును ఏర్పాటు చేశారు. ఈ నీటి ప్రవాహం ద్వారా లబ్ధిపొందే రాష్ట్రాలలో నీటి వాడకాన్ని నిర్దేశించి కట్టడిచేయడంకోసం ఈ బోర్డు ఏర్పడింది. అదేవిధంగా ఢిల్లీలోని ఒఖ్లా బ్రిడ్జితో సహా ఈ నదిపై నిర్మించే అన్నిరకాల వంతెన ప్రాజెక్టుల పనుల పరిశీలన ప్రగతినీ ఈ బోర్డు సమీక్షిస్తుంది. ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, నేషనల్ క్యాపిటల్ టెరిటరీ (ఎన్‌సిటి) ఢిల్లీ ఈ బోర్డు పరిధిలో ఉన్నాయి. ఐతే నది ఎగువ పరీవాహక ప్రాంతంలో ఉన్న అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో కలిపి ఎందుకు ఒక ఉమ్మడి సమావేశం నిర్వహించకూడదు? అని జస్టిస్ పి కె.మిశ్రా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీంకోర్టు వేసవికాలపు ధర్మాసనం ఈ సమస్యపై విచారణ సందర్భంగా ప్రశ్నించింది. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాల తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, బోర్డు ఇప్పటికే ఈ సమస్యను పరిగణనలోకి తీసుకుందని చెప్పారు. "ఈ విషయంలో హిమాచల్ ప్రదేశ్‌ను పిలిచి మాట్లాడతాం, వారి దగ్గర ఎంత అదనపు నీరు ఉంది? మొత్తం ఎంత నీరు ఉంది? అని ప్రశ్నిస్తాం" అని సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలియజేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, "అసలు రేపే ఈ సమస్య పరిష్కారానికి ఎందుకు సమావేశం ఏర్పాటు చేయకూడదు?" అని ప్రశ్నించింది. దీంతో ఈ కేసు విషయంపై ధర్మాసనం ఎదుట హాజరైన ఆ యా రాష్ట్రాల తరపు న్యాయవాదులు ఈ ప్రతిపాదనను అంగీకరించారు. కోర్టుకు మెహతా చెప్పిన సమాచారం ప్రకారం, ఢిల్లీకి గనుక 100 లీటర్ల నీరు చేరుకుంటే ఢిల్లీ నివాసితులకు కేవలం 48.65 లీటర్ల నీరు మాత్రమే అందుతోందని మెహతా చెప్పారు. ఈ రూపేణా మొత్తం 51.35 శాతం నీరు నష్టం జరుగుతోందని చెప్పారు. ఐతే నివాసితులు నీటిని దుర్వినియోగం చేయడం లేదని, ఐతే ట్యాంకుల్లో లీకేజీలు, ట్యాంకర్ మాఫియా, కొన్ని పారిశ్రామిక యూనిట్లు నీటి దొంగతనం చేయడం వంటివాటిని సరిదిద్దాల్సిన అసరం ఉందని చెప్పారు. వృథాను నివారించి నీటిని భద్రపరచేందుకు ఢిల్లీ ప్రభుత్వం తగిన ప్రణాళిక చేస్తుందని, ఐతే మీరు దుర్వినియోగం గురించి చెప్పినప్పటికీ జూన్‌నెలలో ఇంతవరకూ నీరు విడుదల చేయలేదన్న విషయం కూడా చెప్పాలని ఢిల్లీ ప్రభుత్వం తరపున న్యాయవాది అభిషేక్ సింఘ్వి కోర్టుకు చెప్పారు.

## ఇజ్రాయిల్ వార్ రూమ్‌లో విభేదాలు



**టెల్ అవీవ్ :** ప్రపంచవ్యాప్తంగా అన్ని వైపుల నుండీ ఒత్తిడులు పెరిగిపోయిన పూర్వరంగంలో ఇజ్రాయిల్ వార్ రూమ్‌లో తీవ్ర వాగ్యుద్ధాలు, విభేదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ శాంతి ప్రణాళిక, మరోవైపు ఇజ్రాయిల్‌దేశంలో బందీల కుటుంబాలు శాంతి ఒప్పందాన్ని అంగీకరించాలంటూ భారీ ప్రదర్శనలతో నిరసనలు తెలియజేస్తుండగా, ప్రధానమంత్రి నేతన్యాహూ వార్ రూమ్‌లో క్యాబినెట్ సభ్యులమధ్య ఘర్షణలు వస్తున్నాయి. వార్ క్యాబినెట్ రెండుగా చీలిపోయింది. హమాస్ నిర్మూలన తర్వాతే శాంతి ఒప్పందం చేసుకుంటామన్నది మౌలిక సూత్రమని చెబుతుండగా, క్యాబినెట్‌లో మరోవర్గం భిన్నంగా మాట్లాడుతున్నది. రక్షణమంత్రి గ్యాలంట్ కూడా గాజాలో ఎట్టి పరిస్థితుల్లోనూ హమాస్ పరిపాలన కొనాగడానికి వీలులేదని అందుకు సమ్మతించేదిలేదని అన్నారు. ఇంకోవైపు దేశంలో ప్రతిపక్షం కూడా శాంతి ఒప్పందాన్ని అంగీకరించాలని డిమాండ్ చేస్తున్నది. వారు కూడా వేలాదిమందితో ర్యాలీలు చేస్తున్నారు. ఇక ఐక్య రాజ్యసమితి కూడా ఈ శాంతి ఒప్పందానికి ఆమోదం తెలియజేస్తుండగా, ఈజిప్టు దేశం కూడా ఒక అధికారిక ప్రకటన చేస్తూ, రఫా నుండి తక్షణం వైదొలగాలనీ, ఆహార సరఫరాకు అంగీకరించాలనీ, యుద్ధం విరమించాలని ఇజ్రాయిల్‌ను కోరింది. మాల్దీవుల ప్రభుత్వం కూడా ఒక ప్రకటన చేస్తూ, ఇజ్రాయిల్ వీసా ఉన్న వారిని తమ దేశంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేసింది. గాజాలో ఉన్న బందీలను విడుదల చేయించాలని కోరుతూ సోమవారంనాడు న్యూయార్క్ నగరంలో భారీ ప్రదర్శన జరిగింది. వైట్ హౌస్ ప్రతినిధి జాన్ కిర్బీ కూడా హ మాస్ అధికారికంగా తన సమ్మతిని ఎప్పుడు తెలియజేస్తుందో? అంటూ ఎదురుచూస్తున్నారు. బైడెన్ ప్రతిపాదనలను సానుకూల దృష్టితో పరిశీలిస్తున్నట్లు హమాస్ ప్రకటించింది. "ఆరు వారాలపాటు యుద్ధ విర మణతో మొదలయ్యే జో బైడెన్ శాంతి ప్రణాళికలో రెండో దశలో ఇజ్రాయిల్ బందీలను హమాస్ విడుదల చేయడం, హమాస్ కోరిన విధంగా ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఉన్న 8,975 మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయిల్ విడుదల చేయడం, ఇక మూడోదశ ప్రణాళికలో గాజా పునర్నిర్మాణ చర్యలతోపాటు ప్రతిరోజూ 600 ట్రక్కుల నిండా ఆహార పదార్థాలను పాలస్తీనా ప్రజలకోసం గాజాలోకి తరలించాలని బైడెన్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను దాదాపు అందరూ సమ్మతించారు ఇంకా హమాస్–ఇజ్రాయిల్ తప్ప! ఇదిలా ఉండగా ఒకవైపు ఒత్తిడి ఉన్నప్పటికీ ఇజ్రాయిల్ సైన్యం యుద్ధం మొదలైన 241వ రోజుల తర్వాత సోమవారంనాడు కూడా సెంట్రల్ గాజాలో డ్రోన్లతో దాడులు కొనసాగించింది. ఈ దాడుల్లో ఐదుగురు పిల్లలతోసహా ఏడుగురు మరణించారు. గడచిన నాలుగు వారాలలో 10,00,000 మంది ప్రజలు రఫాను వదిలి పారిపోయారు. ఈ యుద్ధంవల్ల ఐదేళ్ళలోపు వయసుల 85 శాతం పాలస్తీనా పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారని అంతర్జాతీయ సంస్థలుప్రకటించాయి.

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు

## హైకోర్టు మాజీ న్యాయమూర్తులు లేఖ

**న్యూఢిల్లీ :** ఎవరికీ స్పష్టమైన మెజారిటీ రాని సందర్భంలో అమలులో ఉన్న ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని అనుసరించి ఎన్నికలకు ముందు ఏర్పడిన అతిపెద్ద కూటమినే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఏడుగురు హైకోర్టు మాజీ న్యాయమూర్తులు లేఖ రాశారు. తద్వారా బేరసారాలకు తావు లేకుండా చేయాలని కోరారు. ప్రస్తుత అధికార వ్యవస్థ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయినట్లయితే రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ సులువుగా అధికార మార్పిడి జరిగే విధంగా చూడాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, ప్రధాన ఎన్నికల కమిషనర్‌లకు కూడా వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాసిన బహిరంగ లేఖపై ఆరుగురు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు జి.ఎం.అక్బర్ అలీ, అరుణా జగదీశన్, డి.హరిపరంథామన్, పి.ఆర్.శివకుమార్, సి.టి.సెల్వం, ఎస్.విమల, పట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అంజనా ప్రకాశ్‌లు సంతకాలు చేశారు. ప్రస్తుత అధికార వ్యవస్థ ప్రజల తీర్పును కోల్పోయినట్లయితే, అధికార మార్పిడి సరిగా జరగకపోతే, రాజ్యాంగ సంక్షోభం ఉండే అవకాశం ఉన్నందున వాస్తవిక ఆందోళనతో ఈ లేఖ రాస్తున్నట్లు తెలిపారు. తమకు ఎలాంటి రాజకీయ పార్టీతో అనుబంధం లేదని, రాజ్యాంగ ఆదర్శాలకు, ఎన్నికల ప్రజాస్వామ్యానికి గట్టిగా కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లకు సంబంధించి కచ్చితమైన అంకెలను వెల్లడించేందుకు ఎన్నికల కమిషన్ నిరాకరించడం, ఫామ్ 17 (సి)ని ప్రజలకు అందుబాటులో ఉంచకపోవడం, మైనారిటీలు, ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా అధికార పార్టీ నాయకులు చేసిన విద్వేష ప్రసంగాలపై చర్య తీసుకోకపోవడం తీవ్ర ఆందోళనకరమని లేఖలో తెలిపారు. కౌంటింగ్ , ఫలితాల ప్రకటన సందర్భంగా గందరగోళ, దారుణమైన సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకొని రాజ్యాంగాన్ని , ప్రజాస్వామ్యాన్ని సుప్రీం కోర్టు రక్షించాలని విజ్ఞప్తి చేశారు.

## పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

### 13మంది మృతి, మరో 16మందికి గాయాలు

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి 13మంది మృతి చెందగా, మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో నలుగురు చిన్నారులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై సిఎం మోహన్ యాదవ్, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, ఆదివారం సాయంత్రం రాజస్థాన్‌లోని మోతీపురా ప్రాంతానికి చెందిన 30మంది బృందం మధ్యప్రదేశ్‌లోని కులామ్‌పుర్‌లో జరిగే పెళ్లికి ట్రాక్టర్‌లో బయలుదేరింది. రాత్రి 9 గంటల సమయంలో రాజ్‌గఢ్ జిల్లాలోని పీప్‌లోడీ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు చిన్నారులు సహా 13మంది మరణించారు. గాయపడిన వారిలో 13మందిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న మరో ఇద్దరిని చికిత్స కోసం భోపాల్‌కు తరలించారు. అయితే వీరికి ప్రాణాపాయం లేదని జిల్లా కలెక్టర్ హర్ష దీక్షిత్ తెలిపారు.

**సీఎం, రాష్ట్రపతి దిగ్భ్రాంతి**

ఈ ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలు, బాధితులకు ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. మరోవైపు ఈ ప్రమాదంలో 13మంది మరణించడం భాదకరమని మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్ అన్నారు. 'ఘటన స్థలానికి రాజ్‌గఢ్ జిల్లా కలెక్టర్, ఎస్‌పి, మంత్రి నారాయణ్ సింగ్ పన్వార్ చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. రాజస్థాన్ ప్రభుత్వంతో సంప్రదించాం. ఆ రాష్ట్ర పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులకు రాజ్‌గఢ్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది. పరిస్థితి విషమంగా ఉన్నవారిని భోపాల్‌కు తరలి ంచాం. వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని సిఎం మోహన్ యాదవ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## రేవ్ పార్టీ కేసులో నటి హేమ అరెస్టు



**బెంగళూరు :** కర్నాటకలోని బెంగళూరు రేవ్ పార్టీ కేసులో నటి హేమను పోలీసులు అరెస్టు చేశారు. విచారణ తరువాత నటి హేమను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వైద్య పరీక్షల నిమిత్తం హేమను ఆస్పత్రికి తరలించారు. మే 20న బెంగుళూరు రేవ్ పార్టీలో ప్రముఖ తెలుగు నటి హేమతోపాటు పలువురు నటులు పాల్గొన్న విషయం విధితమే. నటి హేమ రక్త నమూనాల్లో డ్రగ్స్ తీసుకున్నట్టుగా తేలినట్టు పోలీసులు వెల్లడించారు. మే 27న హాజరు కావాలని పోలీసులు హేమకు నోటీసులు జారీ చేసింది. తన అనారోగ్య సమస్యలు ఉన్నాయని ఒక వారం గడువు కావాలని ఆమె కోరారు. జూన్ 1న విచారణకు హాజరు కావాల్సిందిగా సిసిబి పోలీసులు మరో నోటీసును హేమకు పంపించారు. డ్రగ్స్ తీసుకున్నట్టు తేలడంతో ఆమెను అరెస్టు చేసినట్టు సమాచారం. హేమతో పాటు దాదాపుగా 150 మంది రక్త నమూనాలను నార్కోటిక్ టీమ్ సేకరించి పరీక్షించింది.